

ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్టం	కనిష్టం
నెల్లూరు	35.8	27.3
కావలి	33	27
ఆత్మకూరు	34	24
ఉదయగిరి	33	26
కందుకూరు	32	27



"'ఆంధ్రజ్యోతి' సమస్యలను ఎత్తిచూపడమే కాదు.. ఆ సమస్యలను పరిష్కారించాలన్న పట్టుదలతో కృషి చేస్తున్నాం. ఆ క్రమంలో పుట్టిందే 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' కార్యక్రమం. రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో నిర్వహించి స్థానిక సమస్యలను పరిష్కరించాం. సౌత్‌మోపూరు లో జరిగిన అభివృద్ధి పనులు చూస్తుంటే ఆనందంగా ఉంది. ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్తులో మరిన్ని చేపడతాం.' అని 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' సంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వేమూరి ఆదిత్య అన్నారు. 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' కార్యక్రమం విజయోత్సవ సభ బుధవారం నెల్లూరు రూరల్ మండలం సౌత్‌మోపూరులో జరిగింది. ముందుగా సౌత్‌మోపూరుకు చేరుకున్న వేమూరి ఆదిత్యకు ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి ఘన స్వాగతం పలికారు. అనంతరం హైస్కూల్ ప్రాంగణంలో జరుగుతున్న ప్రహరీ గోడ నిర్మాణ పనులను వారు పరిశీలించారు. ఆ పనుల వివరాలను ఆదిత్యకు కోటంరెడ్డి సోదరులు వివరించారు. అలానే గ్రామంలో చేపట్టిన పనులు, వాటి పురోగతి వివరాలను కూడా తెలియజేశారు. అనంతరం వీరంతా కలిసి నూతన బస్‌షెల్టర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. తర్వాత కమ్యూనిటీ హాలులో ఏర్పాటు చేసిన విజయోత్సవ సభలో పాల్గొని సౌత్‌మోపూరు గ్రామస్థుల స్పందన తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వేమూరి ఆదిత్య మాట్లాడుతూ ఆంధ్రజ్యోతి ద్వారా గ్రామ సమస్యలను పరిష్కరించిన ప్రజాప్రతినిధులకు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. 'అక్షరమే అండగా.. పరిష్కారమే అజెండా' కార్యక్రమం విజయోత్సవ సభకు సౌత్‌మోపూరు గ్రామస్థులను ఆహ్వానించడం సంతోషంగా ఉందని అన్నారు.

● సౌత్‌మోపూరు ప్రభుత్వ హైస్కూల్లో పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు వేమూరి ఆదిత్య, కోటంరెడ్డి సోదరులు నగదు బహుమతులను అందజేశారు. ఈ విజయోత్సవ సభలో ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్ ఆర్ఎం ఉమామహేశ్వర రావు, బ్రాంచి మేనేజరు కే హరికృష్ణ, సీపీఐ సీనియర్ నాయకుడు పముజుల దశరథరామయ్య, టీడీపీ నాయకులు రాపూరు చంద్రశేఖర్, పముజుల ప్రదీప్, ఉపసర్పంచ్ చల్లా నరసయ్య, ఎంపీటీసీ రాపూరు చంచమ్మ, సీపీఎం నాయకుడు బాలు ఆదిశేషయ్య, బీజేపీ నాయకుడు పముజుల సురేష్, సౌత్‌మోపూరు గ్రామస్థులు పాల్గొన్నారు.



'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' విజయోత్సవ సభలో మాట్లాడుతున్న ఆంధ్రజ్యోతి ఈడీ వేమూరి ఆదిత్య, పక్కన ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి, ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్ ఆర్ఎం ఉమామహేశ్వరరావు తదితరులు

అక్షరం అండగా..

భవిష్యత్తులో మరిన్ని..

అభివృద్ధి పనులకు మరో రూ.కోటి



'జనవరిలో నిర్వహించిన 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' కార్యక్రమంలో రూ.కోటితో సౌత్‌మోపూరులో అభివృద్ధి పనులు చేస్తామని హామీ ఇచ్చాం. ఇచ్చిన మాట ప్రకారం 40 రోజుల్లోనే పనులు ప్రారంభించి పూర్తి చేస్తున్నాం. హైస్కూల్ ప్రహరీ నిర్మాణం జరుగుతోంది. బస్ షెల్టర్‌కు శంకుస్థాపన చేసుకున్నాం. ఈ శుభ తరుణంలో మరో హామీ ఇస్తున్నాం. రాబోవు సంవత్సరంలో మరో రూ.కోటితో సౌత్‌మోపూరులో అభివృద్ధి పనులు చేపడతాం. వచ్చే ఏడాది ఇదే రోజులోపు ఆ పనులను పూర్తి చేస్తాం.' అని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రకటించారు. వైసీపీ ప్రభుత్వ పాలనలో ఎవరూ బయటకొచ్చే పరిస్థితులు లేని రోజుల్లో 'ఆంధ్రజ్యోతి' తెగించి పోరాటం చేసిందని ఆయన గుర్తు చేశారు.

- సమస్యల పరిష్కారానికి పట్టుదలతో కృషి
- 'అక్షరం అండగా-పరిష్కారమే అజెండాగా' కార్యక్రమం లక్ష్యం ఇదే
- 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వేమూరి ఆదిత్య
- సౌత్‌మోపూరు గ్రామంలో విజయోత్సవ సభ
- మరో రూ.కోటితో పనులు చేపడతామని ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి హామీ




విజయోత్సవ సభలో పాల్గొన్న సౌత్‌మోపూరు వాసులు

గ్రామస్థుల ఆనందోత్సాహం

మొన్నటిదాకా అంతర్గత రహదారుల్లేవు. వర్షం కురిస్తే చాలు ఆ గ్రామస్థుల్లో వణుకు. ఏ వైపు నుంచి నీరు వచ్చి మీద పడుతుందోనని. ఇక కాలువల్లేక డ్రైనేజీ నీరంతా ఇళ్ల ముందు చేరిపోయేది. ఆ దుర్వాసన భరిస్తూనే కాలం వెళ్లదీశారు. ఇలా అనేక సమస్యల నడుమ తల్లడల్లిన సౌత్‌మోపూరు వాసుల్లో 'ఆంధ్రజ్యోతి' ఆనందం నింపింది. 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' పేరుతో నిర్వహించిన చేపట్టిన కార్యక్రమం మంచి ఫలితాన్ని ఇచ్చింది. దాదాపు రూ.1.22 కోట్లతో గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులు కొన్ని పూర్తవగా, ఇంకొన్ని పురోగతి స్థాయిలో ఉన్నాయి. ముఖ్యంగా రోడ్ల పనులు పూర్తయ్యాయి. బుధవారం జరిగిన విజయోత్సవ సభలో ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ సంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వేమూరి ఆదిత్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు 'ఆంధ్రజ్యోతి'పై ప్రశంసలజల్లు కురిపించారు.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)





హైస్కూలులో ప్రహరీ గోడ పనుల గురించి ఆదిత్యకు తెలియజేస్తున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి



సింహ వాహనంపై కామాక్షితాయి

బుచ్చిరెడ్డిపాళెం, మే 21 (ఆంధ్రజ్యోతి) : జొన్నవాడలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం కామాక్షితాయి సింహ వాహనంపై కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక పుష్పాలంకరణ, మంగళ వాయిద్యాలు, పండితుల వేదమంత్రాల నడుమ అమ్మవారి ఊరేగింపు భక్తులను ఆకట్టుకుంది. ఉదయం తిరుచా ఉత్సవంలో గంగా, కామాక్షితాయి సమేతంగా మల్లికార్జునస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తలకు నిత్యాన్నదాన సదనంలో ప్రత్యేక భోజన వసతి ఏర్పాటు చేశారు. భక్తులకు ఉచిత ప్రసాదాలు పంపిణీ చేశారు. ఉత్సవ కమిటీ చైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, ఈఓ శ్రీనివాసులు రెడ్డి, సభ్యులు, సర్పంచు పెంచలయ్య పాల్గొన్నారు.

రేపు నెల్లూరు పార్లమెంటు స్థాయి మహానాడు

నెల్లూరు, మే 21 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంటు స్థాయి మహానాడు కార్యక్రమం ఈ నెల 23వ తేదీన జరగనుంది. నగర శివార్లలోని కనుపర్తిపాడులో ఉన్న వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరగనున్న ఈ కార్యక్రమ ఏర్పాట్లను ఆ పార్టీ ముఖ్య నేతలు బుధవారం పరిశీలించారు. కార్యక్రమం అజెండా ఎలా ఉండాలి? వచ్చే నాయకులు, కార్యకర్తలకు వసతుల కల్పన వంటి అంశాలపై చర్చించారు. అలానే జిల్లాస్థాయిలో చేయాల్సిన తీర్మానాలపై కూడా మాట్లాడుకున్నారు. ఏర్పాట్లను పరిశీలించిన వారిలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, దగ్గుమాటి వెంకటకృష్ణారెడ్డి, నెల్లూరు పార్లమెంటు అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు. టీడీపీ ఆనవాయితీ ప్రకారం రాష్ట్ర మహానాడుకు ముందు నియోజకవర్గ, పార్లమెంటు స్థాయి మినీ మహానాడు కార్యక్రమాలను నిర్వహిస్తుంటారు. నియోజకవర్గ స్థాయి తీర్మానాలను పార్లమెంటు స్థాయిలోనూ, పార్లమెంటు స్థాయి తీర్మానాలను రాష్ట్రస్థాయి మహానాడు కార్యక్రమంలో ప్రవేశపెడతారు. ఈ నెల 27, 28, 29వ తేదీల్లో కడప వేదికగా మహానాడు జరగనుంది. ఆ క్రమంలో ఇప్పటికే జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు సంబంధించి మినీ మహానాడు కార్యక్రమాలు పూర్తయ్యాయి. ఇక మిగిలిన నెల్లూరు పార్లమెంటు స్థాయి మహానాడు కార్యక్రమం శుక్రవారం జరగనుంది.

● ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి ఆనం, ఎంపీ, ఎమ్మెల్యేలు




నెల్లూరు పార్లమెంటు స్థాయి మహానాడు కార్యక్రమ ఏర్పాట్లపై సమీక్షిస్తున్న టీడీపీ ముఖ్యనేతలు

డబుల్ హార్టి

ఉద్యాన పంటలు సాగుచేస్తున్న రైతులకు ప్రభుత్వం ఊరట కల్పించే శుభవార్తను వినిపించింది. ఇప్పటికే వివిధ పంటలకు అందిస్తున్న రాయితీలను రెట్టింపు చేసింది. గత ప్రభుత్వ హయాంలో పెట్టుబడులు పెట్టి రాయితీల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగి విసిగిపోయిన ఉద్యాన రైతులకు ప్రస్తుత కూటమి ప్రభుత్వం అందిస్తున్న చేయూత వారిలో ఆర్థిక భరోసాను నింపుతోంది.

డ్రాగన్ ఫ్రూట్ పంటను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారి సుబ్బారెడ్డి (ఫైల్)





నెల్లూరు (వ్యవసాయం), మే 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సుమారు 75వేల ఎకరాల్లో వివిధ రకాల ఉద్యాన పంటలు (హార్టీ కల్చర్) సాగవుతున్నాయి. ముఖ్యంగా మామిడి, నిమ్మ, డ్రాగన్ ఫ్రూట్, సపోటా, బొప్పాయి, అరటి, నేరేడు, జామ, ఉసిరి వంటి పంటలను రైతులు పండిస్తున్నారు. ప్రతి ఏటా దాదాపుగా 4,51,516 మెట్రిక్ టన్నుల దిగుబడులు వస్తున్నాయి. ఈ క్రమంలో ఉద్యాన పంటలను ప్రోత్సహించేందుకు కూటమి ప్రభుత్వం ఇప్పటికే 40 నుంచి 90శాతం వరకు రాయితీలను అందిస్తోంది. అయితే తాజాగా ఆయా రాయితీలను రెట్టింపు చేస్తున్నట్లు ప్రకటించింది. 2025-26 సంవత్సరానికిగాను లక్ష్యాలను కూడా నిర్దేశించింది. దాదాపుగా 5375 ఎకరాల్లో వివిధ రకాల ఉద్యాన పంటలు సాగు చేసేలా జిల్లా అధికారులకు ఆదేశాలు వచ్చాయి. అంతేకాకుండా జిల్లాలో దాదాపు గా 82వేల ఎక రాలు ఎలాంటి పంటలు సాగు చేయకుండా భూమి ఖాళీగా ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. దీంతో ఆయా పొలాల రైతులకు ఉద్యాన పంటలపై అవగాహన కల్పించి సాగుచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. నీటి వసతి ఉన్న ప్రతి పొలంలో పంటలు సాగయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. నర్సరీల నుంచి నాణ్యమైన మొక్కలు సేకరించడంతో పాటు సాగు పద్ధతులపై రైతులకు శిక్షణ తరగతులు కూడా నిర్వహించనున్నారు.

రాయితీలు సద్వినియోగం చేసుకోవాలి

ఉద్యాన రైతులకు అందుతున్న పంటల రాయితీలను ప్రభుత్వం రెట్టింపు చేసింది. 2025-26 సంవత్సరానికి 5375 ఎకరాల్లో ఉద్యాన పంటల పెంచేలా ప్రభుత్వం లక్ష్యాలను నిర్దేశించింది. ఎలాంటి పంటలు సాగు చేయని 82 వేల ఎకరాలు ఉన్నాయి. సాగునీరు అందుబాటులో ఉన్న భూముల్లో ఉద్యాన పంటలు సాగుచేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశాలు వచ్చాయి. రైతులకు అవగాహన కల్పించి ఉద్యాన పంటల విస్తీర్ణం పెంచేందుకు కృషి చేస్తున్నాం. గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలను సంప్రదిస్తే పూర్తి సమాచారం అందిస్తారు.

- సుబ్బారెడ్డి, జిల్లా ఉద్యానశాఖ అధికారి

- ఉద్యాన రైతులకు రాయితీ రెట్టింపు
- డ్రాగన్ ఫ్రూట్ సాగుకు భారీగా పెరుగుదల
- ఒకేసారి రూ.50వేల నుంచి రూ.1,82లక్షలకు పెంపు
- పంటల ప్రోత్సాహానికి ప్రభుత్వ పథకాలు

● ఎంఐడీహెచ్ పథకంతో రాయితీ

సమీకృత ఉద్యాన అభివృద్ధి మిషన్ (ఎంఐడీహెచ్) పథకం ద్వారా ఉద్యాన రైతులకు, కొత్త ఉద్యాన పంటల అభివృద్ధికి ప్రభుత్వం రాయితీలు కల్పిస్తోంది. ఈ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం, కేంద్ర ప్రభుత్వం 60శాతం వాటాగా రాయితీలు అమలు చేయనున్నాయి. ముఖ్యంగా కొత్త తోటల విస్తరణ పథకం, పాత తోటల పునరుద్ధరణ పథకం, నీటి కుంటలు, పాలీహౌస్, షేడ్ నెట్, మల్చింగ్ రక్షణాత్మక సాగుతోపాటు కోత అనంతరం యాజమాన్య పథకం, ఉద్యాన యాంత్రీకరణ పథకాల్లో భాగంగా చిన్న ట్రాక్టర్లు, పవర్ టిల్లర్లు, స్ప్రేయర్లు వంటివి ఇవ్వనుంది.

యాంత్రీకరణ పథకం

ఉద్యాన యాంత్రీకరణ పథకంలో భాగంగా ఉద్యాన రైతులకు భారీ రాయితీలు అందిస్తోంది. మినీ ట్రాక్టర్‌కు గతంలో రూ.75వేలు రాయితీ ఉండగా ప్రస్తుతం రూ.1.96లక్షలకు పెరిగింది. అదేవిధంగా పవర్ టిల్లర్‌కు రూ.40వేల నుంచి రూ.60వేలు ఇస్తుండగా తాజాగా రూ.80వేల నుంచి రూ.లక్షలకు పెంచింది. ట్రాక్టర్ ఆపరేటెడ్ స్ప్రేయర్లకు గతంలో ఎలాంటి రాయితీ లేదు. నూతన మార్గదర్శకాల ప్రకారం రూ.33వేల నుంచి రూ.1.10లక్షల వరకు రాయితీ ఇచ్చింది.

- నూతన తోటల విస్తరణ పథకంలో భాగంగా హెక్టారు మామిడి తోటకు మూడేళ్లకు గాను గతంలో రూ.13,300 నుంచి రూ.16,400 వరకు రాయితీ అందేది. నూతన మార్గదర్శకాల ప్రకారం ఆ మొత్తం రూ.35,320 నుంచి రూ.54,560 వరకు పెరిగింది.
- నిమ్మ పంటకు మూడేళ్లకుగాను రూ.16,004 నుంచి రూ.36,402కు పెరిగింది.
- డ్రాగన్ ఫ్రూట్‌కు భారీగా ప్రోత్సాహకాలను ప్రభుత్వం ప్రకటించింది. గతంలో హెక్టారుకు రూ.50వేలు రాయితీ ఇస్తుండగా తాజాగా దాన్ని రూ.1,82లక్షలకు పెంచేసింది. దీంతో ఈ పంటను సాగు చేస్తున్న రైతులకు ఎంతో లాభం చేకూరనుంది.
- సంకర జాతి కూరగాయలకు రూ.20వేల నుంచి రూ.24వేలు...
- విడిపూల సాగుకు రూ.16వేల నుంచి రూ.20 వేలకు పెంచింది.

● రాయితీ ఇలా..

- నేరేడు, బొప్పాయి, అరటి పంటలకు మాత్రం రాయితీ పెంచలేదు.
- పాత తోటల పునరుద్ధరణ పథకం కింద హెక్టారుకు రాయితీని రూ.17500 నుంచి రూ.24వేలకు పెంచింది.
- రక్షణాత్మక సాగు కింద పాలీ హౌస్‌కు రూ.42.20 లక్షల నుంచి రూ.52.50లక్షల వరకు పెంపు చేసింది.
- మల్చింగ్‌కు రూ.16వేల నుంచి రూ.20వేల వరకు పెరిగింది.
- కోత అనంతరం యాజమాన్య పథకం కింద ఫార్మ్ గేట్ ప్యాక్ హౌస్‌కు గతంలో రాయితీ ఇవ్వలేదు. కానీ ఈ ఆర్థిక సంవత్సరం నుంచి రూ.12.50లక్షలు రాయితీ ప్రకటించింది.
- ప్రైమరీ మినిమల్ ప్రాసెసింగ్ యూనిట్‌కు రూ.10లక్షల నుంచి రూ.12.25లక్షలకు, సోలార్ పవర్ కోల్డ్ రూంకు రూ.5.25లక్షల నుంచి రూ.18.20లక్షలకు పెంచింది.

వేసవి విజ్ఞాన శిబిరాన్ని వినియోగించుకోవాలి

విడవలూరు, మే 21(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని లయన్ సుబ్బారావు, పద్మావతి తెలిపారు. విడవలూరులోని గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో బుధవారం వారు పాల్గొని మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞానానికి నిలయాలని, గ్రంథాలయాల్లో అనేక పుస్తకాలు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రతిరోజు గ్రంథాలయానికి వచ్చి పుస్తక పఠనం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ నిరూప పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9198
వెండి కిలో ధర	రూ. 100,100
వెండి ఒక గ్రాము	రూ. 103.10

రుణాల కోసం ఎదురుచూపులు

• ఎస్సీ కార్పొరేషన్‌లో ఆగిన వెబ్‌సైట్ • దరఖాస్తుదారుల ఆందోళన

నెల్లూరు (హరనాథపురం), మే 21 (ఆంధ్రజ్యోతి): బీసీలకు, ఎస్సీలకు రాయితీ రుణాలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో ఆయా వర్గాల్లో ఆశలు చిగురించాయి. ప్రభుత్వ సాయంతో ఉపాధి అవకాశాలు కల్పించుకోవచ్చనే ఆశతో అత్యధికులు దరఖాస్తు చేసుకున్నారు. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో రుణాల మంజూరుకు లబ్ధిదారుల ఎంపికను ఎమ్మెల్యేలు చేపట్టినట్లు సమాచారం. దీంతో దళారులు రంగప్రవేశం చేయడంతో ఈ ప్రక్రియకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. రాయితీ రుణాలకు ప్రభుత్వం ఇప్పటికే బడ్జెట్‌లో నిధులు కేటాయించింది. జిల్లాలో బీసీ కార్పొరేషన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ కూడా పూర్తయింది.అయితే ఆయా కార్పొరేషన్లకు లక్ష్యానికి మించి దరఖాస్తులు అందినట్లు తెలిసింది.

• ఎస్సీ కార్పొరేషన్‌లో ఆగిన వెబ్‌సైట్

ఎస్సీ కార్పొరేషన్ పరిధిలో ఏప్రిల్ 14 నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మే 10 వరకు దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని అధికారులు ప్రకటించారు. అయితే మే 7న వెబ్‌సైట్ ఓపెన్ కాలేదు. దీంతో గడువు



ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం

ముగుస్తుండడంతో దరఖాస్తుదారులు ఆందోళనకు గురయ్యారు. ముందుగానే వెబ్‌సైట్ పనిచేయకపోవడంతో అసలు రుణాలు ఇస్తారా? లేదా? అనే డైలమాలో వారు పడిపోయారు.

• బీసీ కార్పొరేషన్ ద్వారా..

జిల్లాలో బీసీ, బ్రాహ్మణ, కమ్మ, క్షత్రియ, రెడ్డి, వైశ్య, ఈబీసీ, కాపు, మేదర, శాలివాహన కార్పొరేషన్ల ద్వారా 2129 మంది లబ్ధిదారులకు రుణాలు ఇవ్వాలనేది లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి ఆయా కార్పొరేషన్లకు ఆన్‌లైన్‌లో 18,831 దరఖాస్తులు అందాయి. ఎంపీడీవోలు 2450 మందిని ఎంపిక చేశారు. ఈ నివేదికను జిల్లా కార్యాలయానికి పంపారు. బీసీ, కమ్మ, రెడ్డి, వైశ్య, ఈబీసీ కార్పొరేషన్ ద్వారా 88 జనరిక్ మందుల దుకాణాలు పెట్టుకోవాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇందుకు 74 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఎంపీడీవోలు 12 మందిని ఎంపిక చేసి పంపారు. జిల్లాలోని బీసీ, బ్రాహ్మణ, కమ్మ, తదితర కార్పొరేషన్‌ల ద్వారా లబ్ధిదారుల ఎంపిక జాబితా రాష్ట్ర ప్రభుత్వానికి వెళ్లింది. ఈ జాబితా ఆధారంగా లబ్ధిదారులకు రుణాలను విడుదల చేయాల్సి ఉంది. అయితే ఈ ప్రక్రియకు తాత్కాలికంగా బ్రేక్ పడినట్లు తెలిసింది. అయితే వేలాదిమంది రాయితీ రుణాల కోసం ఎదురుచూస్తున్నారు. ఎస్సీ కార్పొరేషన్ అధికారులను ప్రశ్నించగా వెబ్‌సైట్ ఓపెన్ అయితే ఎన్ని దరఖాస్తులు వచ్చాయో.. ? తెలుస్తుందని చెప్పారు.బీసీ కార్పొరేషన్ అధికారులను ప్రశ్నించగా, రాయితీ రుణాల మంజూరు ప్రక్రియను పూర్తి చేశామని చెప్పారు. లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల వివరాలను కూడా రాయితీ రుణాలు విడుదల కోసం ప్రభుత్వానికి పంపామని పేర్కొన్నారు.

భూసార పరీక్షలతో అధిక దిగుబడులు

• డీ.రఘునాథరెడ్డి, మండల వ్యవసాయాధికారి

ఇందుకూరుపేట, మే 21(ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షలతో భూమికి, మొక్కకు కావాల్సిన స్థూల సూక్ష్మ పోషకాలను నిర్ధారించుకుని అందించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చు. దీంతో భూసార పరీక్షలపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నాం. రైతులందరూ భూసార పరీక్షలు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి డి.రఘునాథరెడ్డి కోరారు.

? భూసార పరీక్షలు వలన లాభమేమిటి.

! భూసార పరీక్షల వలన మొక్కకు కావాల్సిన సూక్ష్మ పోషకాలు నిర్ధారించుకుని అందించడం ద్వారా అధిక దిగు బడులు సాధించవచ్చు.



? వరి పంటలో సూక్ష్మ పోషకాల ఆవశ్యకత ఏమిటి.

! వరి పంటలో జింకు లోపాన్ని గుర్తించి జింక్ 21శాతం చల్లి నివారించుకోవచ్చు. చౌడు భూములు జిప్సం చల్లి సరిచేసుకోవచ్చు.

? ఎడగారులో సాగు చేయాల్సిన ముఖ్యమైన వరి వంగడాలు ఏవి.

! ఎన్ఎల్ఆర్-3354, ఎన్ఎల్ఆర్-34449, కేఎన్ఎం-1638 వరి రకాలను సాగు చేసుకోవచ్చు.

? ఎడగారుకి అనువైన సీజన్ ఏది.

! ఏప్రిల్ 15 నుంచి మే 15వ తేదీ మధ్య నారుమడి పోసుకుని సాగు చేసుకోవచ్చన్నారు. ఈ సమయంలో సాగు చేస్తే మంచి దిగుబడి వస్తుంది.

కామాక్షితాయి సేవలో వేమిరెడ్డి దంపతులు

బుచ్చిరెడ్డిపాళెం, మే 21(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు బుధవారం జొన్నవాడ ఆలయంలో కామాక్షితాయి, మల్లికార్జున స్వామిలను దర్శించుకున్నారు. జొన్నవాడలో జరుగుతున్న కామాక్షితాయి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయానికి వచ్చిన వారికి ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసులురెడ్డి, సేవాకమిటీ ఛైర్మన్ అశోక్‌రెడ్డి, సభ్యులు ఆలయ మర్యాదలతో స్వాగతిం చారు. అనంతరం గోత్ర నామములతో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి, అమ్మవారి శేషవస్త్రాలతో సత్కరించి వేదాసీర్వచనాలు అందజేశారు. అనంతరం వీపీఆర్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహిస్తున్న ఉచిత ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కామాక్షితాయి ఆలయ భక్తులకు ఏ అవసరమొచ్చినా తమవంతు సేవలు



జొన్నవాడ ఆలయంలో కామాక్షితాయిని దర్శించుకున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దంపతులు

అందిస్తామని తెలిపారు. జిల్లాతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలకు కామాక్షితాయి మల్లికార్జున స్వామి ఆశీస్సులు ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచు పెంచలయ్య, హరికృష్ణ, ఉమ్మయ్యస్వామి, రత్నం, నరసింహులు, శీనయ్య టీడీపీ మండల అధ్యక్షులు శ్రీనివాసులు, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పించండి

• ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి టీడీపీ నాయకుల వినతి

కొడవలూరు, మే 21(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పేదలకు నివేశిత స్థలాలు ఇప్పించాలని టీడీపీ ఎస్సీ సెల్ మాజీ మండల అధ్యక్షుడు తువ్వర ప్రవీణ్ కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిని కోరారు. ఈ మేరకు బుధవారం పలువురు టీడీపీ నాయకులతో కలసి నెల్లూరులోని ఎమ్మెల్యే నివాసంలో ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కొడవలూరు పరిధిలోని శ్రీవెంకటేశ్వర ఇంజనీరింగ్ కాలేజీకి అనుకుని ఉన్న భూములను ప్రభుత్వ భూమిగా నిర్ధారిస్తూ రెవెన్యూ అధికారులు బోర్డు ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ భూమిని గతంలో కొందరు ఆక్రమించుకున్నారని, కోర్టు ఆదేశాలతో తిరిగి ప్రభుత్వానికి దక్కిందన్నారు. ఆ భూమిలో అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పించాలని కోరారు. స్పందించిన ఆమె పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరికీ స్థలాలు మంజూరయ్యేలా చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట టీడీపీ పలువురు నాయకులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి ప్రభుత్వ స్థలం వివరాలు తెలుపుతున్న టీడీపీ ప్రవీణ్

'ఉపాధి'లో అవకతవకలు జరిగితే చర్యలు

• పనులు పరిశీలించిన ఎంపీడీవో నగేష్‌కుమారి



వరిణిలో ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో నగేష్‌కుమారి

విడవలూరు, మే 21(ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి పథకం పనుల్లో అవకతవకలు జరిగితే చర్యలు తప్పవని ఎంపీడీవో నగేష్‌కుమారి తెలిపారు. వరిణి పంచాయతీలో బుధవారం జరిగిన ఉపాధి పనులను ఆమె పరిశీలించారు. మస్టర్లను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ జాబ్ కార్డులు కలిగిన వారికి 100 రోజులు పనిదినాలు కల్పించాలన్నారు. పనులకు సంబంధించి రికార్డులు సక్రమంగా ఉండాలన్నారు. అనంతరం ఎంపీడీవో వావిళ్ల, గాదెలదిన్నె సచివాలయాలను పరిశీలించి సిబ్బంది పనితీరుని అడిగి తెలుసుకున్నారు.

సూర్యప్రభ వాహనంపై శ్రీవారు

పొదలకూరు, మే 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శ్రీలక్ష్మీగోదా సమేత శ్రీవేంకటే శ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో మూడోరోజు బుధవారం సూర్యప్రభ వాహనంపై శ్రీవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం సుదర్శన నారసహోమం, సూర్యప్రభ వాహనసేవ జరిగాయి. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం ఎదుర్కోలు ఉత్సవం, రాత్రికి హనుమంతసేవ, చంద్రప్రభ వాహనసేవ నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



సూర్యప్రభ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం

విద్యా శాఖలో 30 మందికిపైగా బదిలీ

నెల్లూరు (విద్య), మే 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని విద్యాశాఖలో ఉద్యోగుల బదిలీలకు రంగం సిద్ధమైంది. పాఠశాల విద్య కమిషనర్ ఆదేశాల మేరకు డీఈఓ, డిప్యూటీ ఈఓ, ఎంఈఓ, ఇతర విభాగాల్లో పని చేస్తున్న సిబ్బంది బదిలీలను ప్రభుత్వం జారీ చేసిన ఉపాధ్యాయ బదిలీల జీఓకు అనుగుణంగా నిర్వహించనున్నారు. ఒకేచోట ఐదేళ్ల సర్వీస్ పూర్తిచేసిన వారు, ఉద్యోగోన్నతి పొంది ఒకే ప్రాంతంలో ఐదేళ్లు పనిచేసిన వారు బదిలీ కానున్నారు. అలాగే ఐదేళ్లలోపు సర్వీస్ ఉన్న వారికి రిక్వెస్ట్ బదిలీలు చేపట్టి రిటైర్‌మెంట్‌కు దగ్గరగా ఉన్న వారికి వెసులుబాటును కల్పించనున్నారు. అదేవిధంగా స్పౌజ్ ఉద్యోగులకు ఒకేచోటుకు లేదా దగ్గరి ప్రాంతాలకు బదిలీ చేస్తారు. దీంతో జిల్లా విద్యాశాఖలో పనిచేస్తున్న సిబ్బందిలో కేటగిరీల వారీగా జాబితాలను సిద్ధం చేస్తున్నారు. బదిలీల్లో 30 మందికిపైగా సిబ్బందికి స్థానచలనం కలగనుందని సంబంధిత అధికారులు తెలిపారు. విద్యాశాఖలోని నాలుగో తరగతి ఉద్యోగులు, రికార్డ్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు స్థాయి ఉద్యోగులను డీఈఓ, సూపరింటెండెంట్ స్థాయి అధికారులను ఆర్జేడీ, ఏడీ స్థాయి అధికారులను కమినర్ బదిలీ చేస్తారని తెలిపారు.

కోనలో నేడు హనుమజ్జయంతి వేడుకలు

రాపూరు, మే 21 (ఆంధ్రజ్యోతి) : పెంచలకోన క్షేత్రంలో గురువారం హనుమజ్జయంతి వేడుకలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా శ్రీవారి ఆలయానికి ఎదురుగానున్న క్షేత్రపాలకుడు వీరాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఉదయం నాలుగు గంటలకు పంచామృతాభిషేకం, పది గంటలకు ఆకుపూజ, సిందూరంతో సహస్ర నామార్చన, సాయంత్రం క్షేత్రోత్సవం నిర్వహిస్తామని అర్చకులు తెలిపారు.

ఉప్పలపాటి కుటుంబానికి పరామర్శ

వెంకటాచలం, మే 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కనుపూరుకి చెందిన టీడీపీ మాజీ మండల ఉపాధ్యక్షుడు ఉప్పలపాటి ధనుంజయనాయుడు తల్లి ఉప్పలపాటి కాంతమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో కనుపూరులోని వారి స్వగృహంలో బుధవారం జరిగిన పెద్దకర్మకు సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా కాంతమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట సర్వేపల్లి ఏఎంసీ ఛైర్మన్ గాలి రామకృష్ణారెడ్డి, కనుపూరు కెనాల్ ఛైర్మన్ మస్తాన్‌నాయుడు, కనుపూరు సాగునీటి సంఘం అధ్యక్షుడు వల్లూరు రమేష్‌నాయుడు, నేతలు వల్లూరు వంశీకృష్ణ, కుడితిపూడి రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

రహదారికి రంధ్రం.. చూడకుంటే ప్రమాదం!

తోటపల్లిగూడూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వరిగొండ నుంచి తోటపల్లి గూడూరుకి వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు కుంగి రంధ్రం పడింది. సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రయాణికులు నానా అగచాట్లు పడుతున్నారు. ఆ రోడ్డు గుండా నిత్యం వేలాది మంది ప్రయాణికులు, ఉద్యోగులు ప్రయాణిస్తుంటారు. రంధ్రం పడి సుమారు 20 రోజులు గడుస్తున్నా ఇప్పటికీ ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకోవడంలేదని ప్రయాణికులు వాపోతున్నారు. ఏ ప్రయాణికుడైనా ఆదమరిస్తే.. అందులో పడి ఆసుపత్రి పాలుకావాల్సిందే. ఇప్పటికైనా అధికా రులు స్పందించి ఆ రోడ్డుకు మరమ్మతులు చేయాలని వరిగొండ గ్రామస్థులు కోరుతున్నారు.



వరిగొండ ఆర్అండ్‌బీ రోడ్డుకు పడిన రంధ్రం

మైపాడు పంచాయతీలో ఎలాంటి అవకతవకలు జరగలేదు

• డీఎల్‌పీవో డాక్టర్ రమణయ్య

ఇందుకూరుపేట, మే 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని మైపాడు గ్రామ పంచాయతీలో నిధులు దుర్వినియోగం అయ్యాయన్న ఆరోపణలపై డీఎల్‌పీవో డాక్టర్ పుట్టా రమణయ్య బుధవారం విచారణ నిర్వహించారు. ఈ విచారణ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ మైపాడు పంచాయతీలో ఎటువంటి నిధులు దుర్వినియోగం కాలేదన్నారు. సదరు ఫిర్యాదు దారుడు సమక్షంలో అన్ని రికార్డులు పరిశీలించామని తెలిపారు. దీంతో ఆయన కూడా సమ్మతించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచు సంగం వెంకయ్య మాట్లాడుతూ తనపై ఎటువంటి ఆరోపణలు వచ్చినా తక్షణమే తగిన నగదు పంచాయతీకి కట్టి తన సర్పంచు పదవికి రాజీనామా చేస్తామని తెలిపారు. మైపాడు గ్రామం అంటే ఒక విశిష్టతతో కూడిన సంప్రదాయం కలిగిన గ్రామమన్నారు. గ్రామంలో కొంతమంది వ్యక్తులు తప్పుడు ఆరోపణలు చేస్తూ గ్రామ పరువును బజారుకీడుస్తున్నారని వాపోయారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

పెరగని పొగాకు ధర!

కలిగిరి, మే 21(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మార్కెట్ డిమాండ్‌ను బట్టి గత మూడేళ్లుగా పొగాకు రైతులకు మార్కెట్ అనుకూలించడంతో రికార్డు ధరలు దక్కాయి. దీనికితోడు బోర్డు కూడా గతేడాది కంటే ఈ ఏడాది అధిక పొగాకు ఉత్పత్తికి అనుమతులివ్వడంతో ఎక్కువ మంది పొగాకు సాగుకు మొగ్గుచూపారు. అయితే కొనుగోళ్లు ప్రారంభం అయి రెండునెలలు దాటుతున్నా ధరలు పెరగకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గతేడాది రికార్డుస్థాయిలో పొగాకు ధరలు పెరగడంతో ఈ ప్రభావం ఈ ఏడాది సాగుపై పడింది. భూమి, బ్యారన్ కౌలు, కట్టె ఖర్చు, పచ్చాకు ముఠా కూలీలు అమాంతం పెరిగిపోయాయి. దీంతో గతేడాదికన్నా ఒక్కొక్క బ్యారెన్‌కు 30శాతం మేర అదనపు ఖర్చులు పెరిగాయి. 2023-24 సీజన్‌లో ప్రారంభ ధర కిలో రూ.280 పలకగా కొనుగోళ్ల చివరి దశకు వచ్చేసరికి నాణ్యత కలిగిన ఏగ్రేడ్ రకం కిలో ధర రూ.330గా నమోదైంది. అయితే ఈ ఏడాది ఇప్పటి వరకు గరిష్ఠ ధరలో మార్పు లేకుండా కొనుగోళ్లు జరుగుతుండటంతో రైతులు ఇటీవల ఆందోళనలకు దిగారు. దీనికితోడు లోగ్రేడు పొగాకును కొనుగోలు చేయకుండా నోబిడ్ ప్రకటిస్తూ వెనక్కి తిప్పి పంపుతున్నారు. ఇళ్లవద్ద మండెలు పేర్చి, బేళ్లుగా తయారు చేసి వేలం కేంద్రానికి తీసుకువచ్చిన పొగాకును తిరిగి ఇంటికి తీసుకెళ్లాలంటే రైతుకు శ్రమతోపాటు రవాణాఖర్చు కూడా పెరిగిపోతుండటంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాదిపెట్టుబడులు గణనీయంగా పెరగడంతో మార్కెట్ ధరలు పెరగకపోతే తీవ్రంగా నష్టపోతామని పేర్కొంటున్నారు. బోర్డు అధికారులు ప్రభుత్వానికి రైతుల పరిస్థితిని తెలియజేసి మద్దతు ధరలు పెంచాలని కోరుతున్నారు.



కలిగిరి వేలం కేంద్రంలో పొగాకు బేళ్లు

అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ ఆధారంగానే..

అంతర్జాతీయ మార్కెట్ డిమాండ్‌ను బట్టి పొగాకును కంపెనీలు కొనుగోలు చేస్తాయి. ప్రస్తుతం లోగ్రేడ్ పొగాకుకు డిమాండ్ లేకపోవడంతో కంపెనీలు కొనుగోలు చేయడానికి ముందుకు రావడంలేదు, మార్కెట్ పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ దానికి అనుగుణంగా పొగాకుబేళ్లను వేలం కేంద్రానికి తీసుకువచ్చి మద్దతు ధర పొందాలి. ఈ విషయం రైతులకు సూచిస్తున్నాం.

- ఇసాక్ స్వరన్‌దత్, వేలం నిర్వహణాధికారి, కలిగిరి

కానుగ ఆకుపై ఆంజనేయుడు



హనుమ జయంతిని పురస్కరించుకుని మండలంలోని మహమ్మదాపురం గ్రామానికి చెందిన రిటైర్డ్ డ్రాయింగ్ టీచర్ పచ్చా పెంచలయ్య కానుగ ఆకుపై ఆంజనేయుడి చిత్రాన్ని గీశారు. ఎంతో భక్తి భావంతో అందంగా గీసిన ఆ సూక్ష్మ కళాచిత్రం అందరినీ ఆకట్టుకుంటోంది.

- పొదలకూరు, (ఆంధ్రజ్యోతి)

నీరు-చెట్టు.. కనికట్టు!

- ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడుస్తున్న అక్రమార్కులు
- చేయని పనులకు కూడా బిల్లులు పెడుతున్న వైనం
- రోజురోజుకు పెరుగుతున్న బిల్లుల సంఖ్య
- పాత తేదీలతో ఎంబుక్‌లు రికార్డు చేస్తున్న అధికారులు
- నీకింత.. నాకింత.. అంటూ వాటాలు?

నీరు-చెట్టు పథకం కింద నిజంగా పనులు చేసిన కాంట్రాక్టర్లను కాపాడాలన్నది ప్రభుత్వ లక్ష్యం. వైసీపీ ప్రభుత్వ కక్ష సాధింపుతో కుదేలైన వ్యక్తులను ఆదుకోవాలన్నది ప్రధాన ఉద్దేశం. ఇందులో భాగంగానే పెండింగ్ బిల్లులను చెల్లించాలన్న కీలక నిర్ణయాన్ని తీసుకుంది. అయితే కొందరు అక్రమార్కులు ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడుస్తున్నారు. ప్రభుత్వం మంచితనాన్ని అలుసుగా తీసుకుని ప్రజాధనాన్ని దోచుకునేందుకు సిద్ధమయ్యారు. చేయని పనులను కూడా చేసినట్లుగా ఎంబుక్‌లు రికార్డు చేస్తూ బిల్లులు పెట్టుకునే కుట్రలు జరుగుతున్నాయి. నీరు-చెట్టు బిల్లుల సంఖ్యను పరిశీలిస్తేనే ఈ విషయం స్పష్టమవుతుంది. అసలు జిల్లాలో ఎన్ని బిల్లులు పెండింగ్ ఉన్నాయన్న దానిపై ఏ ఒక్క డివిజన్‌లో స్పష్టత లేకపోవడం గమనార్హం. నాలుగు నెలల క్రితం జిల్లాలో సుమారు 750 బిల్లులు అప్‌లోడ్ చేయాల్సి ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య రెట్టింపయ్యింది. మార్చి నెలాఖరుకు అప్‌లోడ్ చేసిన బిల్లులన్నిటినీ ప్రభుత్వం క్లియర్ చేసింది. మరి ఇంకా వందల సంఖ్యలో బిల్లులు ఎక్కడి నుంచి వస్తున్నాయన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది.

నెల్లూరు, మే 21 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వం ఏర్పడే నాటికి జిల్లాలో 2,433 నీరు-చెట్టు పనులకు గానూ రూ.191.29 కోట్లు బిల్లులు చెల్లించాల్సి ఉంది. అయితే అప్పట్లో నీరు-చెట్టు పనులపై అనేక రకాల ఎంక్వయిరీలు వేసి బిల్లులు చెల్లింపులో జాప్యం చేశారు. రెండేళ్ల తర్వాత నుంచి పనులు చేసిన వారు హైకోర్టు మెట్లెక్కడం మొదలుపెట్టారు. కోర్టు ఆదేశాలతో బిల్లులు మంజూరయ్యాయి. ఈ నేపథ్యంలో ఒక్కొక్కరుగా కోర్టుకు క్యూ కట్టారు. ఇలా సగం మంది వరకూ తమ బిల్లులను తెచ్చుకున్నారు. దాదాపుగా 90 శాతం మంది హైకోర్టులో కేసులు వేశారు. పనులు చేయని వారు కోర్టుకు వెళ్లలేదు. అయితే ప్రభుత్వం మారడంతో నీరు-చెట్టు బిల్లులను చెల్లించేందుకు నిర్ణయించింది. ఈ పెండింగ్ బిల్లులన్నింటినీ చెల్లించేందుకు ప్రభుత్వం గత డిసెంబరులో బడ్జెట్ కేటాయింపులు కూడా చేసింది. ఆ తర్వాత బిల్లులు అప్‌లోడ్ చేయడం మొదలుపెట్టారు. తొలుత కోర్టులో పెండింగ్ ఉన్న కేసులకు సంబంధించిన బిల్లులు మాత్రమే అప్‌లోడ్ చేయాలని ఆదేశాలు అందడంతో ఇరిగేషన్ అధికారులు ఆ బిల్లులను మాత్రమే అప్‌లోడ్ చేస్తూ వచ్చారు. తర్వాత అన్ని బిల్లులను పంపాలని సూచించడంతో ఒక్కసారిగా బిల్లుల సంఖ్య పెరిగింది. పనులు చేయని వ్యక్తులు కూడా దొంగ మార్గాల్లో బిల్లులను పెట్టుకునేందుకు తెరలేపారు. ఈ ఏడాది జనవరి 28వ తేదీ నాటికి ఇరిగేషన్ అధికారుల లెక్కల ప్రకారం జిల్లా మొత్తం అప్‌లోడ్ చేయాల్సిన బిల్లులు 828 ఉంటే అందులో ఇరిగేషన్ సర్కిల్ పరిధిలోనివి 764 ఉండడం గమనార్హం. సోమశిల, టీజీపీ సర్కిల్స్ పరిధిల్లో 64 మాత్రమే ఉన్నాయి. అయితే ప్రస్తుతం ఈ సంఖ్య అమాంతం పెరిగిపోయింది. ఫిబ్రవరి, మార్చి నెలల్లో వందల బిల్లులను అప్‌లోడ్ చేయగా వాటన్నింటికీ పేమెంట్ కూడా జరిగిపోయింది. అయినా ఇంకా 1500కు పైగా బిల్లులు పెండింగ్ చూపిస్తుండడం చర్చనీయాంశంగా మారింది.

పెండింగ్ బిల్లుల వివరాలు

డివిజన్ పేరు	28-01-2025	17-05-2025
సెంట్రల్ డివిజన్	134	173
కావలి డివిజన్	225	121
ఆత్మకూరు డివిజన్	208	185
గూడూరు డివిజన్	152	721
వెంకటగిరి డివిజన్	45	359

• పర్సంటేజీలతో కానిచ్చేస్తున్నారు!

2019లో టీడీపీ ప్రభుత్వం దిగిపోయేనాటికి చాలా నీరు-చెట్టు వర్కులకు అగ్రిమెంట్లు జరిగి ఉన్నాయి. తర్వాత వైసీపీ ప్రభుత్వం పనులు నిలిపేయడంతో చాలా పనులు జరగలేదు. అయితే అటువంటి అగ్రిమెంట్లు చేసుకున్న వ్యక్తులు ఇప్పుడు ఇరిగేషన్ అధికారులను మేనేజ్ చేసుకొని పాత తేదీలతో ఎంబుక్‌లు రికార్డు చేయించుకుటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇవన్నీ మట్టి వర్కులు కావడంతో ఇప్పుడు పరిశీలించినా కనిపించవు కాబట్టి ఇరిగేషన్ అధికారులు కూడా బరితెగిస్తున్నారు. ముందుగానే పది శాతం తీసుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. అలానే గతంలో కొంత మేర మాత్రమే పనులు చేసి పార్ట్ బిల్లులు పెట్టుకొని ఉన్నారు. అటువంటి బిల్లులను కూడా ఇప్పుడు ఫుల్ బిల్లుగా మారుస్తున్నారు. జీఎస్‌టీని క్లెయిమ్ చేసుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతోనే బిల్లులు సంఖ్య పెరిగిందని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నా ఆ మాటున దొంగ బిల్లులు కూడా వెళుతున్నాయని ఇరిగేషన్ శాఖలో బహిరంగంగానే చెప్పుకుంటున్నారు. ఇప్పుడు క్యూసీ సర్టిఫికెట్లు తెస్తుండడమే ఇందుకు ఉదాహరణగా చూపిస్తున్నారు. అయితే క్యూసీలో పనిచేసే ఓ ఇద్దరు ఉద్యోగులు క్యూసీ పుస్తకాలను ఆఫీసుతో సంబంధం లేకుండా ముద్రించి ఇష్టమొచ్చినట్లు సర్టిఫికెట్లు ఇస్తున్నట్లు తెలుస్తోంది. కాగా ఈ బిల్లుల అంశంపై ఇరిగేషన్ ఎస్ఈ దేశానాయక్‌ను వివరణ కోరగా నీరు-చెట్టు బిల్లుల లెక్క తేలిందని చెప్పారు. పనులు చేసినట్లు అధికారులు ధ్రువీకరించాక మాత్రమే బిల్లులు అప్‌లోడ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎర్రతివాచీ పరిచినట్లు చెట్టంతా పూలే...!

ఎరుపు రంగు పూలతో ఎంతో అందంగా కనిపిస్తున్న ఈ చెట్టు అందరినీ ఆకర్షిస్తోంది. పట్టణంలోని కావలి మార్గంలో గల స్టేట్‌పేటలో రహదారి పక్కనే ఓ నివాస ఆవరణలో ఈ చెట్టు ఉంది. అరకొరగా ఆకులు కలిగి, చెట్టంతా ఎర్రరంగు పూలతో కనిపించడం దీని



ప్రత్యేకత. ఈ చెట్టును చూసిన పలువురు ఫొటోలు, వీడియోలు తీసుకునేందుకు ఆసక్తి కనపరుస్తున్నారు.

- ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి)



రాజరాజేశ్వరి ఆలయంలో జీర్ణ ధ్వజస్తంభం తొలగింపు

నెల్లూరు (సాంస్కృతికం), మే 21 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రాజరాజేశ్వరి ఆలయంలో బుధవారం పాత ధ్వజస్తంభాన్ని తొలగించారు. ధ్వజస్తంభం అడుగున ఉన్న రాగి యంత్రం, నాణేలను భద్రపరిచారు. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి, దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సుధీర్, పూడిపర్తి గ్రూప్ టెంపుల్స్ ఈవో ఎస్ శ్రీధర్ నాయుడు, రెవెన్యూ, పోలీసు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. కాగా, జీర్ణమైన ఆ ధ్వజస్తంభం స్థానంలో త్వరలో నూతన ధ్వజాన్ని ప్రతిష్ఠించనున్నారు.



ఆంధ్రజ్యోతి ఈడీ వేమూరి ఆదిత్యను సత్కరిస్తున్న సౌత్‌మోపూరు వాసులు




ఆదిత్యతో మాట్లాడుతున్న సౌత్‌మోపూరు వాసి



పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినికి నగదు బహుమతి ఇస్తున్న వేమూరి ఆదిత్య, కోటంరెడ్డి సోదరులు

సౌత్‌మోపూరులో ఉత్సాహం



'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతల వెల్లువ

నెల్లూరు, మే 21 (ఆంధ్రజ్యోతి) : 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' పేరుతో ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ తమ గ్రామ సమస్యలను పరిష్కరించడంతో సౌత్‌మోపూరు వాసుల్లో ఆనందం నెలకొంది. రూ.1.22 కోట్లతో గ్రామంలో కొన్ని పనులు జరగ్గా, ఇంకొన్ని జరుగుతున్నాయి. భవిష్యత్తులోనూ మరో కోటి రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రకటించారు. బుధవారం జరిగిన 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' విజయోత్సవ సభలో ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ సంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వేమూరి ఆదిత్యను కలిసి తమ సంతోషాన్ని పంచుకున్నారు. విజయోత్సవ సభలోనూ కొందరు గ్రామస్థులు ఆంధ్రజ్యోతిని కొనియాడుతూ ప్రశంసలు కురిపించారు.

● **విద్యార్థులకు బహుమతులు**

సౌత్‌మోపూరు ప్రభుత్వ హైస్కూల్లో పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు వేమూరి ఆదిత్య, కోటంరెడ్డి సోదరులు నగదు బహుమతులను అందజేశారు. పీ పవన్‌తేజ, పముజుల రేణుక, షణ్ముఖప్రియ, పముజుల పూజితలకు ధనలక్ష్మీపురానికి చెందిన అల్లూరి ఆదిశేషయ్య ఫౌండేషన్, హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీల ద్వారా నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేసి, అభినందించారు.



బస్‌షెల్టర్ నిర్మాణానికి టెంకాయ కొడుతున్న ఆంధ్రజ్యోతి ఈడీ ఆదిత్య, చిత్రంలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి తదితరులు

సమస్యలు పరిష్కారమయ్యాయి



రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి మా గ్రామంలో అనేక సమస్యలను పరిష్కరించినా ఇంకా కొన్ని సమస్యలు ఉన్నాయి. అందులో వర్షాకాలం వస్తే మెయిన్ రోడ్డుపైకి నీరు వచ్చేది. వర్షాకాలంలో దుర్భర పరిస్థితులు ఉండేవి. 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన కార్యక్రమంలో మా సమస్యను చెప్పుకున్నాం. ఎమ్మెల్యే తక్షణమే స్పందించి ఆ సమస్యను పరిష్కరించారు. 'ఆంధ్రజ్యోతి'కి ధన్యవాదాలు.

\- విజయ్

'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు



కొన్ని నెలల క్రితం మా గ్రామంలో 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన కార్యక్రమంలో మా ఊరి సమస్యలు చెప్పుకున్నాం. ఇప్పుడా సమస్యలు పరిష్కారమయ్యాయి. సీసీ రోడ్లు వేయడంతో పాటు మురికి కాలువలు నిర్మించారు. ఇంకా కొన్ని పనులు జరుగుతున్నాయి. మా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న 'ఆంధ్రజ్యోతి'కి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

\- బాలమురళి

శ్రీ ఆంజనేయం.. వీరాంజనేయం!

● కొనసాగుతున్న హనుమజ్జయంతి ఉత్సవాలు



శబరి క్షేత్రంలో హనుమ ఉత్సవ మూర్తికి ప్రత్యేక అలంకరణ

నెల్లూరు (సాంస్కృతికం), మే 21 (ఆంధ్రజ్యోతి) : శబరి శ్రీరామక్షేత్రంలో జరుగుతున్న హనుమజ్జయంతి ఉత్సవాలు బుధవారం మూడో రోజుకు చేరాయి. ఉదయం అభిషేకం, అర్చన, హోమం, హారతులు, సాయంత్రం బ్యాండు కచేరీ, ప్రత్యేక అలంకారం, హోమాలు జరిగాయి. ఉభయ కర్తలుగా కారంపూడి శ్రీనివాసులురెడ్డి, ఉమ వ్యవహరించారు. హనుమజ్జయంతి సందర్భంగా గురువారం ఉదయం అభిషేకం, హోమం, 10గంటలకు లక్ష మల్లెలార్చన, రాత్రి 7గంటలకు 10 సంవత్సరాలలోపు పిల్లలకు వెండి డాలర్‌తో కంకణధారణ, రాత్రి నగరోత్సవం జరగనున్నాయి.

● మైపాడు గేటు ప్రాంతంలోని ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం హనుమజ్జయంతి ఉత్సవాలు జరుగుతాయని, భక్తులు తరలిరావాలని నిర్వాహకుడు మద్దూరి సుబ్బారావు ఓ ప్రకటనలో కోరారు. ఉదయం అభిషేకాలు, హోమాలు, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం పూలంగిసేవ, చిన్నారులకు రాగి డాలర్ల పంపిణీ, పల్లకీ సేవ జరుగుతాయని పేర్కొన్నారు.

అనిల్... మంగళం శ్రీను

● కార్పొరేటర్ నుంచి మంత్రిగా తీసుకువచ్చా
● అయినా తడిగుడ్డతో గొంతు కోస్తావా...!
● మాజీ మంత్రిపై రూప్‌కుమార్ ధ్వజం

నెల్లూరు (వైద్యం), మే 21 (ఆంధ్రజ్యోతి) : అల్లాటప్పాగా తిరిగే వ్యక్తి కార్పొరేటర్ స్థాయి నుంచి మంత్రి అయ్యే వరకు అండగా నిలిస్తే తడిగుడ్డతో గొంతు కోస్తావా అంటూ మాజీ మంత్రి పోలుబోయిన అనిల్ కుమార్ యాదవ్‌పై నగర డిప్యూటీ మేయర్, అనిల్ బాబాయ్ రూప్‌కుమార్ యాదవ్ ధ్వజమెత్తారు. బుధవారం నగరంలోని ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కరోనా సమయంలో ఆసుపత్రులను బెదిరించి అనిల్ కుమార్ లక్షల రూపాయల అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఓ దళితుడికి సబ్‌స్టేషన్‌లో ఉద్యోగం ఇప్పిస్తామని రూ.7 లక్షలు లంచం తీసుకుంది నీవు కాదా అని ప్రశ్నించారు. పుష్ప సినిమాలో మంగళం శ్రీను లాంటి అనిల్ బర్రెల సంత దగ్గర కోటి రూపాయలు దండుకున్నారని ఆరోపించారు. వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా ఎంతో మంది దళితులకు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఉచితంగా విద్యను అందిస్తున్నారని, దివ్యాంగులకు ట్రైసైకిళ్లు అందిస్తున్నారని అలాంటి వేమిరెడ్డిని అనిల్‌కుమార్ విమర్శించటం సిగ్గుచేటన్నారు. క్వార్ట్జ్ విషయంలో 2023, 2024లో ఎలాంటి అక్రమాలకు పాల్పడ్డారో అందరికీ తెలుసన్నారు. అయితే వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి వందల కోట్ల వ్యయంతో క్వార్ట్జ్ కంపెనీ ఏర్పాటు చేశారని, నిబంధనల ప్రకారం మైనింగ్ చేస్తున్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు దార్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మాతమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ

నెల్లూరు రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దచెరుకూరులో నూతనంగా నిర్మించిన మాతా పరమేశ్వరి ఆలయంలో బుధవారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. ప్రతిష్ఠ ఉత్సవాల్లో భాగంగా మూడు రోజులుగా ఆలయంలో విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, శేషరెడ్డి, రామ్మోహర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీనియారిటీ జాబితా తయారు చేయండి

● డీఆర్వోకు వీఆర్వో సంఘం వినతి

నెల్లూరు (హరనాదపురం) మే 21 (ఆంధ్రజ్యోతి) : సీనియారిటీ జాబితాలు తయారు చేయాలని కోరుతూ వీఆర్వో సంఘ నాయకులు బుధవారం జిల్లా రెవెన్యూ అధికారి ఉదయభాస్కరరావుకు వినతిపత్రం ఇచ్చారు. సంఘం జిల్లా అధ్యక్షుడు పంట అశోక్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గ్రేడ్-1కు సీనియర్ అసిస్టెంట్ లిస్టు, గ్రేడ్-2కు గ్రేడ్-1 సీనియారిటీ లిస్టు తయారు చేయాలని డీఆర్వోను కోరినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి దారా రమణయ్య, రవి శేఖర్, కృష్ణారావు, పెంచలరావు, జనార్దన్, శరవణ్ తదితరులు పాల్గొన్నారు.



డీఆర్వో ఉదయభాస్కర్‌కు వినతిపత్రం ఇస్తున్న వీఆర్వో సంఘం నాయకులు

భూగర్భ గ్యాస్ పైపులైన్ల ఏర్పాటులో జాగ్రత్త

● నగర పాలక సంస్థ కమిషనర్ నందన్

నెల్లూరు(సిటీ), మే 21,(ఆంధ్రజ్యోతి) : నగరంలో పొదలకూరురోడ్డు వెంబడి నూతనంగా ఏర్పాటు చేస్తున్న భూగర్భ గ్యాస్ పైపులైన్ల నిర్మాణంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలని కార్పొరేషన్ కమిషనర్ వైవో నందన్ సూచించారు. బుధవారం ఆయన చాంబరులో ఏజీపీ సిటీ గ్యాస్ కంపెనీ ప్రతినిధులతో సమావేశమయ్యారు. పనులు మొదలుపెట్టిన, ఆపిన వెంటనే కార్పొరేషన్ ఇంజనీరింగ్ విభాగానికి తెలియ చేయాలన్నారు. అనుమతించిన మేరకు మాత్రమే తవ్వకాలు జరపాలని ఆదేశించారు. యూజీడీ, తాగునీటి పైపులకు ఏ మాత్రం ఆటకం కలగకుండా చూసుకోవాలని సూచించారు. అనంతరం బుధవారం కురిసిన వర్షంతో నిండిన ఆత్మకూరు బస్టాండ్ అండర్ బ్రిడ్జి ప్రాంతాన్ని పరిశీలించారు. ఆపై కార్యాలయంలో పారిశుధ్య విభాగంపై సమీక్ష జరిపారు.



అండర్ బ్రిడ్జిలో వర్షపునీటిని పరిశీలిస్తున్న కమిషనర్ నందన్

● **షోకాజు నోటీసులు**

పడారుపల్లి ప్రాంతంలో కమిషనర్ ఆకస్మికంగా తనిఖీలు జరిపారు. స్థానికంగా ఉన్న భవనాలకు కొలతలు వేశారు. కార్పొరేషన్ నుంచి పొందిన అనుమతులకు నిర్మాణాలకు తేడా ఉండటం, పన్నుల్లో వ్యత్యాసం కనిపించడంతో వివరణ ఇవ్వాలని ఆదేశిస్తూ స్థానిక ఆర్‌ఐ, ప్లానింగ్ సెక్రటరీ, అడ్మిన్‌కు షోకాజు నోటీసులు జారీ చేశారు.

నిబద్ధత, నిజాయితీతో ఉన్నత స్థానాలకు..

నుడా ఏవో సన్మాన సభలో చైర్మన్ కోటంరెడ్డి

నెల్లూరు (జడ్పీ), మే 21 (ఆంధ్రజ్యోతి) : నుడాలో పని చేసే ఉద్యోగులందరూ తన కుటుంబ సభ్యులేనని, విధి నిర్వహణలో క్రమశిక్షణతో ఉంటే పదోన్నతులు వాటి అంతట అవే వస్తాయని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. నుడాలో ఏవోగా పని చేస్తున్న ఈశ్వర్ రాజు గ్రేడ్ - 1 మునిసిపల్ కమిషనర్‌గా ఇటీవల పదోన్నతి పొందారు. దీంతో నుడా కార్యాలయంలో బుధవారం ఆయన్ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ విధి నిర్వహణలో నిబద్ధత, నిజాయితీగా మెలిగే వాళ్లే ఉన్నత స్థానాలకు చేరుతారని, అందుకు ఈశ్వర్ రాజు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో నుడా సెక్రటరీ పెంచలరెడ్డి, అకౌంట్స్ ఆఫీసర్ హేమలత, సురేష్, తహసీల్దార్ డేనియల్, ముత్యం నర్సింహులు, ఏపీవో మురళీ సాయి ప్రసాద్, డీఈ బాల మురళి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఈశ్వర్ రాజును సన్మానిస్తున్న నుడా చైర్మన్ కోటంరెడ్డి

ఆన్‌లైన్ అమ్మకాలతో లాభాలు

● డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి, పక్కన అధికారులు

నెల్లూరు (హరనాథపురం), మే 21 (ఆంధ్రజ్యోతి) : పొదుపు మహిళలు ఆన్‌లైన్ అమ్మకాలను విరివిగా చేపట్టి లాభాలను ఆర్జించాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ నాగరాజ కుమారి సూచించారు. బుధవారం డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో పొదుపు మహిళలకు, అధికారులకు ఆన్‌లైన్ మార్కెటింగ్‌పై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఆమె మాట్లాడుతూ జిల్లాలోని పొదుపు మహిళలు తయారు చేసిన ఉత్పత్తులకు మంచి గిరాకీ ఉందని, ఆన్‌లైన్ అమ్మకాలు బాగా జరుగుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో వీఎస్ రాజకుమారి, హైదరాబాద్‌లోని వీసీ ఆర్‌ఐ డైరెక్టర్ కర్ణ, అసిస్టెంట్ బాలు, పీ భానుప్రసాద్, పీ నాగేంద్ర ప్రసాద్, యూ కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు రేంజ్ అటవీ స్క్వాడ్ అధికారుల తనిఖీ

కావలి, మే 21(ఆంధ్రజ్యోతి): పర్మిట్లు లేకుండా టేకు కలప తెచ్చి వ్యాపారాలు చేస్తున్నారనే ఆరోపణల మేరకు బుధవారం కావలిలో గుంటూరు రేంజ్ అటవీశాఖ స్క్వాడ్ అధికారులు తనిఖీలు చేట్టారు. పట్టణ ఉత్తర శివారులో ఉన్న ఒక టింబర్ డిపోను తనిఖీ చేయగా అక్కడ పర్మిట్లు లేని టేకు కలపను గుర్తించినట్లు తెలిసింది. దీంతో కావలిలోని టింబర్ డిపో వ్యాపారులు అందరూ అప్రమత్తమై జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిసింది. అయితే తనిఖీ చేసిన డిపోలో ఎంత సరుకు పర్మిట్ లేకుండా దొరికిందో, వారికి ఏ మేరకు పెనాల్టీ విధించారో, లేక సర్దుబాటు చేసుకుని వెళ్లారో వివరాలు తెలియాల్సి ఉంది. ఈ విషయంపై కావలి రేంజర్ మోహన్‌ను వివరాలు అడగగా తాను విధినిర్వహణలో భాగంగా బయటకు వెళ్లానని, గుంటూరు స్క్వాడ్ అధికారులు వచ్చి వెళ్లారని తెలిసిందని, అందుకు సంబంధించి వారు తమకు సమాచారం ఇవ్వాల్సిన అవసరంలేదని చెప్పారు.

విజ్ఞాన సదస్సులో ఉగ్రవాద వ్యతిరేక దినం



భారత సైనికులకు జేజేలు పలుకుతున్న విద్యార్థులు

నెల్లూరు (సాంస్కృతికం), మే 21 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా బుధవారం జాతీయ ఉగ్రవాద వ్యతిరేక దినం నిర్వహించారు. ప్రజాసైన్స్ వేదిక నగర అధ్యక్షుడు ఎం సతీష్‌కుమార్ విద్యార్థులకు ఉగ్రవాదం వలన కలిగే నష్టాలు, ఉగ్రవాదాన్ని మన సైనికులు ఎలా అణచివేస్తున్నారో వివరించారు. సైనికుల ధైర్యసాహసాలకు బాలబాలికలు జేజేలు పలికారు. అనంతరం సంప్రదాయ ఆటలైన వామనగుంట, పాచికలాట, పరమపద సోపానం వంటివి ఆడించారు. ఈ కార్యక్రమాలను జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కుమార్‌రాజా, యోగా మాస్టర్ ప్రసన్న, గ్రంథాలయ సిబ్బంది జితేంద్ర, కృష్ణయ్య, గిరిజ పర్యవేక్షించారు.

మా గోడు ప్రభుత్వానికి చెప్పండి

● కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి సీహెచ్‌వోల వినతి

నెల్లూరు (వైద్యం), మే 21 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించేలా సహకారం అందించాలని కమ్యూనిటీ హెల్త్ అధికారులు(సీహెచ్‌వో) కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిని కోరారు. వారు ఎమ్మెల్యేను బుధవారం ఆమె నివాసంలో కలిసి వినతిపత్రం ఇచ్చారు. పల్లె ప్రజలకు వైద్య సేవలు అందించే తాము సమస్యల పరిష్కారం కోరుతూ 24 రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేస్తున్నామని, అయినా తమ గోడును ప్రభుత్వం పట్టించుకోవటం లేదని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి ప్రశాంతిరెడ్డి స్పందిస్తూ ప్రభుత్వంతో మాట్లాడతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వోల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు భానుమహేష్, షేక్ ఆదిల్, స్వాతి, అనూష తదితరులు పాల్గొన్నారు.



ప్రశాంతిరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న సీహెచ్‌వోలు

ఆధునిక సాంకేతికత నిర్మాత రాజీవ్

దివంగత ప్రధానికి కాంగ్రెస్ ఘన నివాళి



రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నెల్లూరు (వైద్యం), మే 21 (ఆంధ్రజ్యోతి) : భారత దేశంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి ఆద్యుడు దివంగత ప్రధాని రాజీవ్‌గాంధీ అని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం రాజీవ్‌గాంధీ 34వ వర్ధంతిని నగరంలోని ఇందిరాభవన్‌లో నిర్వహించారు. రాజీవ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సాంకేతిక రంగంలో విప్లవం తీసుకువచ్చి యువతకు స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏటూరి శ్రీనివాసులురెడ్డి, తలారి బాలసుధాకర్, మోహన్‌రెడ్డి, పప్పర్తి గణేష్‌బాబు, హుస్సేన్, అల్లాఉద్దీన్, సోనియా, నసీమా తదితరులు పాల్గొన్నారు.

కాలువల్లో మట్టిని వేగంగా తొలగించాలి

నెల్లూరు (వైద్యం), మే 21 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని 47వ డివిజన్‌లో ఉన్న కాలువల్లో మట్టి తొలగింపు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు కోరారు. బుధవారం డివిజన్ పరిధిలోని కామాటివీధి, మసీదు వీధి, మహాలక్ష్మి గుడివీధి తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేస్తున్న సిబ్బందికి ఆయన సూచనలు చేశారు. కార్యక్రమంలో డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గణేష్‌కుమార్, మునికృష్ణ, మాబాషా తదితరులు పాల్గొన్నారు.



నగరంలోని పొదలకూరు రోడ్డుపై సారాయి అంగడి సెంటర్‌లో తాగునీటి పైప్‌లైన్ పగలడంతో నీరు ఫౌంటెన్‌లా విరజిమ్మింది.

\- ఫొటో : స్టాఫ్ ఫొటోగ్రాఫర్

పెరుగు రామకృష్ణకు స్వర్ణ కంకణం

నెల్లూరు (సాంస్కృతికం), మే 21 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ కవి డాక్టర్ పెరుగు రామకృష్ణకు విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ అచార్య అల్లం శ్రీనివాస రావు బుధవారం స్వర్ణ కంకణం తొడి గారు. ప్రశంసా పత్రం అందజేసి సత్కరించారు. వీసీ చాంబర్‌లో అరసం కవితా స్రవంతి పుస్తకాలు, డాక్టర్ టేకుమళ్ల వెంకటప్పయ్య సంపాదకీయంలో వెలువడిన అద్దేపల్లి రామమోహన్‌రావు కవిత, పెరుగు రామకృష్ణ సంపాదకత్వంలో ముద్రిం చిన పట్టాభి కవితల పుస్తకా లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభ్యుదయ రచయితల సంఘం ఈతరం కోసం 20 పూర్వ అభ్యుదయ కవుల కవితలను చిన్న చిన్న పుస్తకాలుగా ముద్రించి పరిచయం చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్ర మంలో చిత్రకారుడు అరవ రవిబాబు, అభ్యు దయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు గంగిశెట్టి శివకుమార్ పాల్గొన్నారు.



డాక్టర్ పెరుగు రామకృష్ణను సత్కరిస్తున్న వీఎస్‌యూ వీసీ శ్రీనివాసరావు

టెన్త్ సప్లిమెంటరీకి 380 మంది గైర్హాజరు

నెల్లూరు(విద్య), మే 21 (ఆంధ్రజ్యోతి) : టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో బుధవారం ఇంగ్లీష్ పరీక్ష జరిగింది. జిల్లా వ్యాప్తంగా ఈ పరీక్షకు 966 మంది విద్యార్థులు దర ఖాస్తు చేసుకోగా 586 మంది హాజరయ్యారు. 380 మంది గైర్హాజరయ్యారు. అలాగే ఓపెన్ స్కూల్ పరీక్షలకు 355 మంది హాజరు కావాల్సి ఉండగా 291 మంది హాజ రుకాగా 64 మంది గైర్హాజరయ్యారు. డీఈవో బాలాజీ రావు రెండు, ఫ్లయింగ్ స్క్వాడ్ 24 కలిపి మొత్తం 26 కేంద్రాలను పరిశీలించారు.



వహాబ్‌పేటలో..





సండేమార్కెట్‌లో..







రామలింగాపురం వంతెన వద్ద నగరవాసుల అవస్థలు

ముంచెత్తిన వాన


● నగరంలో లోతట్టు ప్రాంతాల్లో నీరు

బుధవారం సాయంత్రం నగరంలో భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరడంతో ప్రజలు అవస్థలు పడ్డారు. రామలింగాపురం బ్రిడ్జి, పొగతోట, సండే మార్కెట్, గాంధీపార్కు రోడ్డు, ఆత్మకూరు బస్టాండు వద్ద ఉన్న అండర్ బ్రిడ్జిలలో నీరు చేరడంతో వాహనదారులు అవస్థలు పడ్డారు.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)



బిందు సేద్యంతో సాగయిన కరపుచ్చ (ఫైల్)



స్ప్రింక్లర్లతో సాగు చేసిన వేరుశనగ

మార్గదర్శకాల కోసం

ఎదురుచూపులు

● సూక్ష్మ సేద్యంపై కొత్త ఆశలు

● పరికరాల రాయితీ పెంచాలని రైతుల డిమాండ్

సంగం, మే 21 (ఆంధ్రజ్యోతి): డ్రిప్, స్ప్రింక్లర్ల మంజూరుకు సంబంధించి కొత్త మార్గదర్శకాల కోసం రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఈసారైనా సబ్సిడీ పెంచుతారని ఆశలు పెట్టుకున్నారు. మార్గదర్శకాల జారీలో జాప్యమవుతుంది. దీంతో అన్నదాతలకు నిరీక్షణ తప్పట్లేదు. 2025 -26 ఆర్థిక సంవత్సరం ప్రారంభమై నెలన్నర దాటినా ఆ ఊసే ఎత్తకపోవడం గమనార్హం.

● గతంలో రాయితీ తగ్గింపు

గత వైసీపీ ప్రభుత్వంలో డ్రిప్, స్ప్రింక్లర్లపై రాయితీ తగ్గించడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గత ఆర్థిక సంవంత్సరంలో దాన్నే కొనసాగించారు. టీడీపీ హయాంలో అమలు చేసిన పాత రాయితీ విధానాన్ని పునరుద్ధరించి న్యాయం చేస్తామని చంద్రబాబునాయుడు హామీఇచ్చారు. గతేడాది రాయితీ పెంచలేదు. ఈ నేపథ్యంలో 10 నెలలుగా డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాల కోసం రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్నా.. డీడీలు కట్టేందుకు ఎక్కువ శాతం మంది రైతులు వెనుకంజ వేశారు. జిల్లాలోని పలు నియోజక వర్గల్లో ఎమ్మెల్యేలు పర్యటనలకు వెళ్లిన సమయంలో రైతులు డ్రిప్, స్ప్రింక్లర్లకు సబ్సిడీ పెంచాలని కోరారు. కొత్త ఆర్థిక సంవత్సరంలోనైనా సబ్సిడీ పెంచి, న్యాయం చేస్తారని ఆశగా ఉన్నారు.

● సబ్సిడీ పెంచాలని వేడుకోలు

గత టీడీపీ హయాంలో ఉమ్మడి జిల్లాలో సూక్ష్మ సేద్యం పరికరాలకు పదెక రాల వరకు 90 శాతం సబ్సిడీ వర్తింపజేశారు. ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం సబ్సిడీ ఇచ్చారు. వైసీపీ పాలనలో సూక్ష్మ సేద్యం పరికరాల మంజూ రుకు సంబంధించి గైడ్‌లైన్స్ మార్చారు. ఐదెకరాలదాకా 90 శాతం, ఆపైన 70 శాతం సబ్సిడీని మాత్రమే వర్తింపజేశారు. ఎస్సీ, ఎస్టీలకు వందశాతం సబ్సిడీని పూర్తిగా ఎత్తేశారు. ఇతర కేటగిరీల రైతుల తరహాలోనే సబ్సిడీపోను మిగతా డబ్బులు చెల్లించాలని ఎస్సీ, ఎస్టీ రైతులకు షరతు పెట్టారు. దీంతో అప్పట్లో భరించలేక ఎస్సీ, ఎస్టీ రైతులు ఎవరూ దరఖాస్తు చేసుకునేందుకు ముందుకు రాలేదు. గత సార్వత్రిక ఎన్నికల సమయంలో పదెక రాల దాకా 90 వాతం సబ్సిడీతో డ్రిప్, స్ప్రింక్లర్ల పరిక రాలు మంజూరు చేస్తామని చెప్పడంతోపాటు టీడీపీ హయాంలో అమలైన విధంగా మిగతా కేటగిరీల రైతులకు డ్రిప్, మంజూరు చేస్తామని చంద్రబాబునా యుడు ప్రతిపక్ష హోదాలో హామీ ఇచ్చారు. ఆయన సీఎం అయి పదకొండు నెలలే పూర్తయింది. ప్రస్తుతం ఆర్థిక సంవత్స రంలోనైనా ఆ హామీనీ అమలు చేయాలని రైతులు కోరుతున్నారు.

గ్రాసం లేక విలవిల

● గడ్డి దొరక్క మూగజీవాల ఇక్కట్లు

● ఆకాశాన్నంటుతున్న ధరలు

● బెంబేలెత్తుతున్న పశుపోషకులు

ఉదయగిరి రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వ్యవసాయం తరువాత పాడి పరిశ్రమపైనే అత్యధికులు ఆధారపడి జీవిస్తున్నారు. మెట్టలో పశువులు, గొర్రెలు, మేకలు పెంపకం రైతులకు జీవనాధారంగా మారింది. ఈ తరుణంలో రోజురోజుకు పశుగ్రాసం ధరలు ఆకాశాన్నంటు తుండడంతో పాటు కొరత ఏర్పడింది. దీంతో పాడి రైతుల బాధలు వర్ణనాతీతంగా మారాయి. అధిక ధర చెల్లించి పశుగ్రాసం కొనుగోలు చేసి మూగజీవాలను పోషించడం తలకు మించిన భారంగా మారింది.

● పచ్చగడ్డి కనుమరుగు

జిల్లా వ్యాప్తంగా 6,46,106 గేదెలు, 57,774 ఆవులు, 10.95 లక్షల గొర్రెలు, 3.86 లక్షల మేకలు ఉన్నాయి. వాటిని పోషించే యజమానులకు గ్రాసం కొరత ఏర్పడింది. ఈ ఏడాది మండిపోతున్న ఎండల పుణ్యమాని పచ్చిక బయళ్లు ఎండుముఖం పట్టాయి. కనుచూపు మేర పచ్చి గడ్డి స్థానంలో ఎండుగడ్డి దర్శనమిస్తున్నది. దీంతో ఎలాగోలా ఆ ఎండు గడ్డినే తింటూ మూగజీవాలు కడుపునింపు కుంటున్నాయి. ఈ నేపథ్యంలో మైదానాలు, కొండల్లో సంచరించే ఆకతాయిలు నిప్పు పెడుతుండడంతో ఎండుగడ్డి సైతం గగనం అవుతుంది. అంతేకాక ఆశించిన మేర వర్షాలు కూడా కురవక పోవడంతో చెరువులు, వాగులు, వంకల్లో నీటి నిల్వ లేకపోవడం పశువులకు శాపంగా మారింది. దీంతో చేసేదేమిలేక కొంతమంది రైతులు తమ జీవాలను తక్కువ ధరలకే అమ్ముకుంటున్నారు.



ట్రాక్టర్లలో వరిగడ్డిని తీసుకెళ్తున్న రైతులు

● ఆకాశాన్నంటిన గ్రాసం ధరలు

గతంలో ఎన్నడూలేని విధంగా పశుగ్రాసం ధరలు నేడు ఆకాన్నంటుతున్నాయి. ట్రాక్టరు వరిగడ్డి గతంలో రూ. 12వేల వరకు ఉండగా ప్రస్తుతం రూ. 15వేల వరకు పలుకుతోంది. ఒక్కో గేదెకు సుమారు ఏడాదికి రెండు ఎకరాల పశుగ్రాసం అవసరం. ఆ వంతున రూ. 30వేల వరకు వెచ్చించాల్సి వస్తున్నది. వీటికితోడు రవాణా చార్జీలు అదనంగా మారడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరమైంది. పాల దిగుబడి సైతం తగ్గుముఖం పడుతుండడంతో పోషణకు అయ్యే పెట్టుబడులు కూడా రావడంలేదని వారు బెంబేలెత్తుతున్నారు.

పశుగ్రాసం అందించాలి



ఎండుగడ్డి ధరలు అమాంతం పెరగడంతో పశువుల పెంపకం భారంగా మారింది. అప్పులు చేసి వాటిని పోషించలేక పోతున్నాం. ప్రభుత్వం స్పందించి సబ్సిడీపై పశుగ్రాసం అందించాలి.

- యలమందల మీరయ్య, పాడిరైతు, తూర్పుబోయమడగల

సద్వినియోగం చేసుకోవాలి



ఉపాధి హామీ పథకం ద్వారా చేపడు తున్న గడ్డి పెంపకం పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. ఒక్కో రైతుకు ప్రభుత్వం రూ. 33వేల వరకు రాయితీ కల్పిస్తోంది. పశువుల దాణా కోసం ఉన్నతాధికారులకు నివేదికలు అందజేశాం.

- ఎస్‌వీ రాఘవేంద్రశర్మ, పశువైద్యాధికారి

రాజుపాలెం రీచ్‌కు సింగిల్ టెండర్..!

కలెక్టర్ నిర్ణయం ఏమిటో...!

నెల్లూరు, మే 21 (ఆంధ్రజ్యోతి) : కలువాయి మండలం రాజుపాలెం వద్ద మానవశక్తి డీసిల్టేషన్ పేరుతో ఇసుక తవ్వకాలకు అధికారులు పిలిచిన టెండర్లో కీలక పరిణామం కనిపిస్తోంది. సాధారణంగా ఇసుక టెండర్లకు పోటీ పడే కాంట్రాక్టర్లు ఎవరూ ఇక్కడ పోటీకి రాలేదు. కేవలం ఒకే ఒక టెండర్ దాఖలైంది. రాజుపాలెం వద్ద నిబంధనలకు విరుద్ధంగా ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేస్తున్నారన్న ప్రచారానికి ఈ సింగిల్ టెండర్ బలం చేకూరుస్తోంది. బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'ఆ టెండర్ వెనుక ఆంతర్యమేమిటో..?' కథనం కలకలాన్ని రేపింది. సంబంధిత జిల్లా అధికారుల వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. దీనిపై కలెక్టర్ ఓ ఆనంద్ కూడా సంబంధిత అధికారుల నుంచి వివరాలు సేకరించినట్లు తెలిసింది. ఇప్పటి వరకూ నిబంధనలకు విరుద్ధంగా రాజుపాలెం వద్ద పెన్నాలో ఇసుక తవ్వకాలు జరుపుతుండగా అది వివాదాస్పదమైంది. అయితే ఏదో ఒక రకమైన పర్మిషన్ తెచ్చుకొని దర్జాగా తవ్వుకోవచ్చునని కొందరు అక్రమా ర్కులు స్కెచ్ వేసినట్లు ఆరోపణలున్నాయి. ఆ క్రమంలోనే మానవశక్తి డీసిల్టేషన్ పేరుతో టెండర్ పిలిచినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే గతంలో జరిగిన పోతిరెడ్డి పాలెం, సంగం, సూరాయపాలెం డీసిల్టేషన్ ఇసుక టెండర్లకు పదుల సంఖ్యలో కాంట్రాక్టర్లు పోటీ పడ్డారు. కొందరైతే కాంట్రాక్ట్ కోసం ఏకంగా హైకోర్టుకు వెళ్లి తెచ్చుకున్నారు. అలానే గత నెలలో జరిగిన మినగల్లు, విరువూరు సెమీ మెకనైజ్ రీచ్‌లకు కూడా నలుగురు చొప్పున టెండర్లు వేశారు. కానీ ఇప్పుడు రాజుపాలెం రీచ్‌కు మాత్రం ఒక్కటే టెండరే దాఖలు కావడం అనేక ప్రశ్నలను రేకెత్తిస్తోంది. అయితే పోటీగా ఎవరూ టెండర్లు వేయకుండా కొన్ని శక్తులు తెరవెనుక మంత్రాంగం నడిపినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ టెండర్లను బుధవారం ఓపెన్ చేయాల్సి ఉన్నప్పటికీ అది జరగలేదు. గురువారం ఓపెన్ చేస్తామని ఇరిగేషన్ సెంట్రల్ డివిజన్ ఈఈ నాగరాజు తెలిపారు. మరి ఇన్ని ఆరోపణలు ఎదుర్కొంటూ సింగిల్ టెండర్ దాఖలైన రీచ్‌పై కలెక్టర్ ఎటువంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి.



సోమశిలలో నీటి నిల్వ

అనంతసాగరం (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయంలో 45.375 టీఎంసీల నీరు ఉన్నట్లు అధికారులు తెలిపారు. పెన్నా డెల్టాకు 4,300, ఉత్తర కాలువకు 200, దక్షిణ కాలువకు 50 క్యూసె క్కుల నీటిని విడుదల చేస్తున్నామని వివరించారు.

● రాపూరు : కండలేరు డ్యాం లో 42.714 టీఎంసీలుగా ఉందని కండలేరు ఏఈ తిరుమలయ్య తెలిపారు. ఇన్‌ఫ్లో ఆగిపోగా, అవుట్‌ఫ్లో 2480 క్యూసెక్కులు ఉందని తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి 2360, లోలెవల్ స్లూయిూస్ ద్వారా 60, హైలెవల్ కెనాల్ ద్వారా 60 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో ఉందని ఆయన వివరించారు.



నేడు హనుమజ్జయంతి

● ఆలయాల్లో భారీ ఏర్పాట్లు

నెల్లూరు (సాంస్కృతికం), మే 21 (ఆంధ్రజ్యోతి) : స్వామి భక్తికి, పరాక్రమానికి, కార్య సిద్ధికి, అమేయ ధైర్యసాహసాలకు పెట్టింది పేరు హనుమంతుడు. రామబంటుగా సీతాన్వేషణలో, లంకా దహనం, శత్రు సంహారంలో కీలక పాత్రధారి. ఆ స్వామి అవతరించిన రోజును హనుమజ్జయంతిగా భక్తులు ఏటా జరుపుకుంటారు. గురువారం జరిగే ఈ పండుగకు జిల్లాలోని వైష్ణవాలయాల్లో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. రామాలయాలు, మందిరాలు, ఆంజనేయ స్వామి ఆలయాలను విద్యుద్దీ పాలు, చలువ పందిళ్లు, మంగళతోరణాలతో అలంకరించారు. పంచామృతా భిషేకాలు, హోమాలు, సహస్ర నామార్చనలు, ఆకు పూజ, మల్లెపూలతో అర్చన, వాహన సేవలు, సీతారామ కల్యాణోత్సవాలు జరపనున్నారు. నెల్లూరులోని శబరి శ్రీరామక్షేత్రం, సంతపేట ఆంజనేయ స్వామి ఆలయం, బాలాజీనగర్ సీతారామ మందిరం, సుజాతమ్మకాలనీలోని అష్టలక్ష్మీ ఆలయంలో ఉన్న కార్యసిద్ధి ఆంజనేయ స్వామి ఆలయం, రాయాజీ వీధి హనుమాన్ మందిరం, పప్పులవీధి ఆంజనేయస్వామి ఆలయంలో ఉత్సవాలు జరగనున్నాయి.

మూలకు చేరిన ఎండీయూ వాహనం



డీలర్ల వద్దే రేషన్ పంపిణీ

● వచ్చే నెల నుంచి అమలులోకి..

● 438 ఎండీయూ వాహనాలకు ఇక చెల్లు

ఉదయగిరి, మే 21 (ఆంధ్రజ్యోతి) : ఇంటింటికి నిత్యావసర వస్తువుల పంపిణీ అంటూ గత వైసీపీ ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి ఎండీయూ వాహనాలను అందుబాటులోకి తెచ్చింది. అయితే ఆచరణలో మాత్రం పలుచోట్ల వీధుల్లో కూడా సరుకులు పంపిణీ చేయలేకపోయింది. ఎండీయూ ఆపరేటర్లుగా వైసీపీ నాయకులు, కార్యకర్తలే ఉండటంతో వారు ఆడిందే ఆట.. పాడిందే పాటగా.. ప్రజా పంపిణీ వ్యవస్థ తయారైంది. డీలర్లకు పని లేకుండా చేయడంతోపాటు నిత్యం సర్వర్ సమస్యతో కార్డుదారులకు సక్రమంగా సరుకులు అందేవి కావు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఎండీయూ వాహనాలను రద్దు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. జిల్లాలోని 438 వాహనాలకు ఇక కాలం చెల్లింది. జూన్ 1 నుంచి జిల్లావ్యాప్తంగా ఉన్న 1,513 చౌకదుకాణాల ద్వారా 7,22,257 లక్షల మంది కార్డుదారులకు సరుకులు అందించేలా ప్రణాళిక రూపొందిస్తోంది. సీసీ కెమెరాల పర్యవేక్షణలో నెలంతా రేషన్ దుకాణాలు పనిచేసేలా చర్యలు చేపట్టడంతోపాటు వృద్ధులు, దివ్యాంగులకు ఇంటికే సరుకులు అందించేలా చర్యలు చేపడుతోంది. అవినీతి, అక్రమాలకు తావులేకుండా నూతన యాప్‌తో పర్యవేక్షణ చేయనుంది

డబ్బిస్తేనే సర్టిఫికెట్!

● పారామెడికల్ కాలేజి నిర్వాహకుల దోపిడీ


● పూర్తయినా డీఎంఎల్‌టీ కోర్సులకు రూ. 5వేలు లంచం

● యూజీసీకి ఫిర్యాదు చేసిన విద్యార్థులు

నెల్లూరు (వైద్యం), మే 21 (ఆంధ్రజ్యోతి) : టెక్నికల్ కోర్సులు చేస్తే ఎంతో కొంత ఉపాధి దొరకుతుందని చాలా మంది యువతీ యువకులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబొరేటరీ టెక్నాలజీ (డీఎంఎల్‌టీ) వంటి పారామెడికల్ కోర్సులలో చేరుతున్నారు. కోర్సు పూర్తయితే ప్రభుత్వ రంగంలోనూ సొంతంగానో ల్యాబ్ పెట్టుకుని ఉపాధి పొందాలని భావిస్తున్నారు. ఆ మేరకు ఫీజులు చెల్లించి, కష్టపడి చదివి కోర్సు పూర్తి చేస్తారు. తీరా సర్టిఫికెట్ల కోసం వెళితే ఆయా కళాశాలల యాజమాన్యం నగదు డిమాండ్ చేస్తోంది. కావలిలోని ఓ పారామెడికల్ కళాశాల యాజమాన్యం డబ్బులు వసూలు చేస్తుండటంతో కొంత మంది విద్యార్థులు నిరాకరించారు. దీంతో ఈ అక్రమాల విషయం వెలుగు చూసింది.

● అసలేం జరిగిందంటే!

2021-22లో పలువురు విద్యార్థులు రెండేళ్ల డీఎంఎల్‌టీ కోర్సులో చేరేందుకు నెల్లూరులోని ఓ నర్సింగ్ కళాశాల యాజమాన్యాన్ని సంప్రదించారు. అయితే, కళాశాలకు అనుమతులు రాకపోవడంతో ఆ కళాశాల అధినేత సూచనల మేరకు కావలిలోని మరో కాలేజీలో చేరారు. ఈ క్రమంలో రెండేళ్లపాటు అన్ని రకాల ఫీజులను చెల్లించారు. పరీక్షల్లో విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. పాసయిన విద్యార్థులు సర్టిఫికెట్లు కావాలని కావలిలోని పారామెడికల్ కళాశాల యాజమాన్యాన్ని కోరారు. రూ.5 వేలు లంచం ఇస్తే సర్టిఫికెట్లు ఇస్తామని వారు చెప్పడంతో విద్యార్థులు ఖంగు తిన్నారు. ఇలా సదరు కళాశాల యాజమాన్యంతో మధ్య జరిగిన ఫోన్ సంభాషణను విద్యా ర్థులు రికార్డు చేశారు. బుధవారం నెల్లూరులోని నర్సింగ్ కాలేజీకి వెళ్లగా అక్కడ కాలేజీ అధినేత లేకపోవటంతో ఫోన్‌లో విషయం చెప్పారు. తాము అన్ని రకాల ఫీజులు కట్టేశామని అదనంగా డబ్బులు అడగటమేమని నిలదీశారు. అయితే కావలిలోని కాలేజీ నిర్వాహకులను అడగాలంటూ ఆయన తప్పించుకునే ప్రయత్నం చేశారు.



Gmail

Srinivasulu Devarakonda <srinulic.cab@gmail.com>

PLEASE HELP ME TO GET MY DMLT PASS CERTIFICATES.

Srinivasulu Devarakonda <srinulic.cab@gmail.com> Mon, May 19, 2025 at 8:05 PM

Draft

I AM CHANDALURI PRAMILA, I WAS STUDIED AT S.V.COLLEGE OF PARA MEDICAL EDUCATION [DMLT], KAVALI, SPSR NELLORE Dist.,ANDHRA PRADESH.

I HAVE COMPLETED, DIPLOMA MEDICAL LAB TECHNOLOGY [DMLT] COURSE. AND I HAVE PASSED THIS COURSE. AFTER I WAS ASKED THE COLLEGE CORRESPONDENT TO GIVE MY DMLT PASSED CERTIFICATES. BUT HE WAS DEMANDING RS.5000/- FOR GIVING THOSE CERTIFICATES. I DONT HAVE ANY PENDING FEES TO COLLEGE.BUT THEY ARE DEMANDING MONEY FOR GIVING CERTIFICATES. NOT ONLY ME ALL THE STUDENTS ARE SUFFERING FROM THIS PROBLEM. SOME STUDENTS HAS ALREADY GAVE MONEY AND TOOK THEIR CERTIFICATES.

SO, I KINDLY REQUEST YOU TO TAKE ACTION.

COLLEGE CORRESPONDENT- SRI. DASARADHA RAMIREDDY GARU, CELL-9492336939

ADDRESS OF THE COLLEGE:
S.V.COLLEGE OF PARA MEDICAL EDUCATION.
KAVALI
SPSR NELLORE DIST.
ANDHRA PRADESH.
PIN- 524201

యూజీసీకి విద్యార్థిని పంపిన ఫిర్యాదు పత్రం

● యూజీసీకి ఫిర్యాదు

జిల్లాలో 23 నర్సింగ్ కళాశాలలు ఉండగా వాటిలో 9 కళాశాలల్లో పారామెడికల్ కోర్సులను నిర్వహిస్తున్నారు. ప్రతి ఏడాది ఒక బ్యాచ్ డీఎంఎల్‌టీ కోర్సును పూర్తి చేసుకుని బయటకు వెళుతుంది. కోర్సు పూర్తయిన తర్వాత దాదాపు అన్ని కళాశాలల్లో ఇలాగే సర్టిఫికెట్ల కోసం అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా నగరానికి చెందిన ఓ విద్యార్థిని సర్టిఫికెట్ల కోసం తమను లంచం అడుగుతున్నారని కావలిలోని పారామెడికల్ కళాశాలపై ఫిర్యాదు చేస్తూ యూజీసీకి మెయిల్ పంపింది. దీంతో యూజీసీ అధికారులు 20 రోజుల్లో విచారణ చేస్తామని రిప్లై కూడా ఇచ్చారు.

పూర్తిస్థాయిలో విచారిస్తాం

సర్టిఫికెట్ల కోసం విద్యార్థుల వద్ద డబ్బులు వసూలు చేస్తున్నారన్న విషయమై పూర్తిస్థాయిలో విచారణ చేయిస్తా. ఆయా కళాశాల యాజమాన్యంపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాను. డీఎంఎల్‌టీ విద్యార్థులకు అండగా ఉంటాను.

- డాక్టర్ సుజాత, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

లక్ష్యాలు అధిగమించాలి

ఉదయగిరి, మే 21(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ సిబ్బందికి కేటాయించిన లక్ష్యాలను అధిగమించాలని ఎంపీడీవో అప్సాజీ పేర్కొన్నారు. బుధవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతిఒక్కరికి పని కల్పించాలన్నారు. పని కల్పించడంలేదని ఫిర్యాదులు రాకూడదన్నారు. ఇంకుడుగుంతలు, నీటితొట్లు, ఫారంపాండ్స్ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పని ప్రదేశంలో కూలీలకు వసతులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈసీ సువార్తయ్య, టీఏలు, ఎఫ్ఏలు తదితరులు పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9198
వెండి కిలో ధర	రూ. 100,100
వెండి ఒక గ్రాము	రూ. 103ట10

రైతుకు ఆసరా... నాణ్యతకు భరోసా !

● అందుబాటులో అగ్రి టెస్టింగ్ ల్యాబ్ ● ఉచితంగా పరీక్షలు

ఆత్మకూరు, మే 21 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ సీజన్ మొదలవుతోంది. రైతులు పెట్టుబడులు, విత్తనాలు సిద్ధం చేసుకుని సాగుకు సన్నద్ధమవుతున్నారు. కొనుగోలు చేసిన విత్తనం నాణ్యమైనది కాకపోతే... పడిన కష్టమంతా బూడిదలో పోసిన పన్నీరవుతుంది. ఎరువులు, పురుగు మందుల విషయంలోనూ ఇదే పరిస్థితి. మార్కెట్‌లో పలు రకాల విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉన్నాయి. వీటిలో నాణ్యత ప్రమాణాలు నిర్ధారించుకోవాలి అనుకునే అన్నదాతలకు ఆత్మకూరులోని ఎంపీడీవో కార్యాలయం సమీపంలో వ్యవసాయ ప్రయోగశాల (అగ్రి టెస్టింగ్ ల్యాబ్) అందుబాటులో ఉంది. పశువుల వ్యాధి నిర్ధారణ ప్రయోగశాలను ఇక్కడే నిర్వహిస్తున్నారు. ఈ ల్యాబ్‌లో పరీక్షలన్నీ ఉచితంగా నిర్వహిస్తారు.

● ఉపయోగాలు ఎన్నో..

రైతులు పొలంలో నాటే విత్తనాలు, అవి మొలకెత్తిన తరువాత వినియోగించే సస్యరక్షణ మందుల నాణ్యతను ఇక్కడ పరీక్షించుకోవచ్చు. విత్తనాల్లో మొలక శాతం, తేమ శాతం అనే అంశంపై పరీక్షలు చేస్తారు. ఎరువుల్లో నత్రజని, భాస్వరం, పొటాష్ వంటి రసాయనాల పరిమాణం, న్యూట్రిన్లు శాతం తదితరమైనవి నిర్ణీత ప్రమాణాల మేరకు ఉన్నాయో.. లేదో పరీక్ష చేసి నివేదికలను సిద్ధం చేస్తారు. పురుగుల మందుల నాణ్యత ప్రమాణాలను పరీక్షిస్తారు. వీటితోపాటు విత్తనాలు, ఎరువుల డీలర్లు కూడా నమూనాలు ప్రయోగశాలకు తీసుకెళ్లి పరీక్షలు చేయించుకోవచ్చు. విత్తనాలకు రూ. 250, ఎరువులకు రూ. 300 రుసుం వసూలు చేస్తారు. వ్యవసాయశాఖ అధికారులు సేకరించిన నమూనాలను పరీక్షిస్తారు.

● అవగాహన లేమే కారణం

ఈ ల్యాబ్ పరిధిలో అనంతసాగరం, ఏఎస్‌పేట, సంగం, మర్రిపాడు, ఆత్మకూరు, చేజర్ల మండలాలు ఉన్నాయి. అయితే ప్రయోగశాలపై రైతులకు సరైన అవగాహన లేదు. వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది కూడా అన్నదాతల్లో అవగాహన కల్పించడం లేదు. దీంతో రైతలు నష్టపోతున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు ఆరు విత్తనాలు, ఒకటి మాత్రమే ఎరువుల నమూనాలు వచ్చివుండడం రైతులకు అవగాహన లోపానికి ప్రత్యక్ష నిదర్శనమని చెప్పాలి.





ఆత్మకూరులోని అగ్రి టెస్టింగ్ ల్యాబ్, ఎరువులు, విత్తనాలను పరీక్షించే ప్రయోగశాల

● వ్యాధి నిర్ధారణ హుళ్లక్కే..

పశువుల వ్యాధి నిర్ధారణ పరీక్షలు అగ్రిటెక్ ల్యాబ్‌లో చేయాల్సి ఉంది. కాని అలాంటి పరీక్షలు చేసిన దాఖలాలు కనిపించడం లేదు. సంబంధింత శాఖ సిబ్బంది కూడా ల్యాబ్‌లో కనిపించరు. పాడిపశువులకు సుస్తీ చేస్తే రక్తం, పేడ, మూత్రం వంటి పరీక్షలు ల్యాబ్‌లో చేసి అనారోగ్యానికి కారణాలు తెలియజేయాల్సి ఉంది. ఈ నివేదికను అనుసరించి పశు వైద్యులు వైద్యం అందిస్తారు. పశువులకు వచ్చే చర్మ వ్యాధులతో పాటు పొదుగు నొప్పి వ్యాధికి సంబంధించిన పరీక్షలు కూడా నిర్వహించాల్సి ఉంది. కాని ఆత్మకూరులోని పశు వైద్యశాలకే పశువులు, జీవాలు తీసుకొస్తారని, అక్కడే పరీక్షలు చేస్తామని సిబ్బంది చెబుతున్నారు. ఈ క్రమంలో ఆత్మకూరులో ఏర్పాటు చేసినన ల్యాబ్‌లో పూర్తిగా పశువుల వ్యాధి నిర్ధారణ పరీక్షలు పూర్తిగా అటకెక్కాయి. ఈ ల్యాబ్‌లో సేవలను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తేవాలని రైతులు, పశుపోషకులు కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

గుంత కాదండీ.. ఇది రోడ్డే !



గుంతల మయంగా కమ్మవారిపల్లి - సోమశిల రహదారి

అనంతసాగరం మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మవారిపల్లి నుంచి సోమశిల వరకు 3 కి.మీ. ప్రయాణానికి 20 నిమిషాల సమయం పడుతోంది. మోకాలి లోతు గోతులతో రోడ్డు ఉండడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ గుంతల వల్ల నిత్యం ప్రమాదాలు జరుగుతున్నట్లు పలువురు వాపోతున్నారు. అధికారులు స్పందించి రహదారిని బాగు చేయాలని వారు కోరుతున్నారు.

ముగిసిన సీతారాముల ఉత్సవాలు

ఉదయగిరి, మే 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పరపల్లిలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న సీతారాముల ఉత్సవాలు బుధవారం ముగిశాయి. చివరిరోజు గ్రామస్థులు వసంతోత్సవం, ఉట్టి మహోత్సవాలను చేపట్టారు. అనంతరం స్వామివార్లను పారువేటకు తరలించారు.

● నేటి నుంచి ఆర్లపడియలో..

మండలంలోని ఆర్లపడియలో గురువారం నుంచి సీతారాముల ఉత్సవాలు ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు బుధవారం తెలిపారు. తొలిరోజు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, విశేష అలంకరణలు, శుక్రవారం స్వామివార్ల కల్యాణోత్సవం, శనివారం వసంతోత్సవం, పారువేట ఉంటాయన్నారు.

రాజీవ్ సేవలు ప్రశంసనీయం




రాజీవ్ గాంధీకి నివాళులు అర్పిస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

ఆత్మకూరు, మే 21(ఆంధ్రజ్యోతి) : మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ దేశానికి చేసిన సేవలు మరువలేనివని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వన్నం నాగరాజు తెలిపారు. బుధవారం స్థానిక మున్సిపల్ బస్టాండ్ వద్ద ఉన్న రాజీవ్‌గాంధీ విగ్రహానికి ఆయన వర్ధంతి సందర్భంగా పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు సీహెచ్ మణికంఠ, వై ఖాజా సుల్తాన్, ఏ ఇమాన్, ఎస్ వెంకీ, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి

సీతారామపురం, మే 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో డిప్యూటీ ఎంపీడీవో భార్గవి ఆధ్వర్యంలో బుధవారం పారిశుద్యం కార్యక్రమం నిర్వహించారు.ఇంటింటికి వెళ్లి తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాతావరణ కాలుష్యం నివారించుటకు గ్రామంలోని ప్రతి ఒక్కరూ వ్యర్థాల నిర్వహణలో భాగస్వాములు కావాలన్నారు. ఇంటిలోని తడి, పొడిచెత్తను గ్రీన్ అంబాసిదర్లకు అందజేయాలన్నారు.

రోడ్లపై చెత్త వేస్తే కఠిన చర్యలు



బస్టాండులో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయిస్తున్న ఎంపీడీవో భవాని

కలువాయి, మే 21 (ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీలో రోడ్లపైనే చెత్త వేసే వారిపై ఇక మీదట కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో భవాని హెచ్చరించారు. బుధవారం ఆమె ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీవో రమేష్, పంచాయతీ కార్యదర్శి సుధాకర్‌తో కలసి వీధులను పరిశీలించారు. బస్టాండు, యడ్ల రామయ్య రైస్‌మిల్లు సెంటర్, బజారు వీధుల్లో రోడ్ల మీదనే చెత్త వేస్తుండడంపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. టిఫిన్ అంగళ్లు, దుకాణాల వద్దకు వెళ్లి, ఇకపై చెత్త ఎక్కడ పడితే అక్కడ వేసినట్లయితే చర్యలు తీసుకుంటామని వ్యాపారులను హెచ్చరించారు. అనంతరం ఆమె పలు కూడళ్లల్లో హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయించారు.

వైభవంగా వీరాంజనేయుడి ఉత్సవాలు



ఆత్మకూరు సమీపంలోని అభయాంజనేయస్వామి

దుత్తలూరు(ఉదయగిరి), మే 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటంపేటలో బుధవారం వీరాంజనేయస్వామి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. వేదపండితులు స్వామివారికి గణపతి, కలశ, సహస్ర నామపూజలతోపాటు కర్పూరహారతితో నైవేద్యం సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు మేళతాళాలు, బాణసంచా పేలుళ్ల మధ్య ఉత్సవ విగ్రహాలను గ్రామం నుంచి రోడ్డుపై ఉన్న ఆలయానికి చేర్చారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తుల కోసం అన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

● అభయాంజనేయుడికి ప్రత్యేక పూజలు

సంగం, (ఆంధ్రజ్యోతి): స్థానిక అభయాంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేకాలు నిర్వహించి పూలతో అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు.

● నేడు హనుమజ్జయంతి

ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని హనుమంతుడి వాగు వద్ద వెలసి ఉన్న శ్రీఅభయాజనేయస్వామి ఆలయంలో గురువారం హనుమజ్జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. భక్తుల సౌకర్యార్థం అన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

● ఆత్మకూరులో..

ఆత్మకూరు, (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బైపాస్ రోడ్డులో గల శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో గురువారం హనుమజ్జయంతిని ఘనంగా నిర్వహించనున్నారు. తెల్లవారుజామున 5 నుంచి 5.45 గంటల వరకు పంచామృతాభిషేకం, 6 నుంచి 7 గంటల వరకు సహస్రనామపూర్వక ఆకుపూజ, 7 నుంచి 8 గంటల వరకు హనుమాన్‌చాలీసా పారాయణం, 8 నుంచి 9 గంటల వరకు పవనముడిదారుల శోభాయాత్ర నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు శ్రీఅభయాంజనేయస్వామి సమేత సువర్చలాదేవి కల్యాణం నిర్వహించనున్నారు.రాత్రి 9 నుంచి 11 గంటల వరకు స్వామివారి పల్లకీసేవ నిర్వహిస్తారు. శుక్రవారం తెల్లవారుజామున 4.30 నుంచి 5 గంటల వరకు అగ్నిగుండం, పదచలనం నిర్వహించనున్నారు.



సంగం : ఆంజనేయుడికి నిర్వహించిన పూలంగిసేవ



ఉదయగిరి : ఉత్సవ విగ్రహాలను ఆలయానికి చేర్చుతున్న కమిటీ సభ్యులు


మినీ మహానాడును జయప్రదం చేయండి



విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

సంగం, మే 21 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరులోని మార్కెట్ కమిటీ ప్రాంగణంలో గురువారం జరిగే మినీ మహానాడును విజయవంతం చేయాలని మండల టీడీపీ అధ్యక్షుడు గుండ్లపల్లి శ్రీనివాసులుయాదవ్, తెలుగు యువత మాజీ జిల్లా కార్యదర్శి బాణా శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. బుధవారం వారు సంగంలో విలేకరులతో మాట్లాడారు. దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు జరిగే మినీ మహానాడుకు బూత్, యూనిట్, క్లస్టర్ స్థాయి కన్వీనర్లు, కో కన్వీనర్లతోపాటు కుటుంబ సాధికార సారథులు, గ్రామ, వార్డు, మండల కార్యకర్తలు, పార్టీ శాశ్వత సభ్యులు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు షేక్ బాబు, ఉక్కాల శ్రీనివాసులు, పిట్టు పట్టాభిరెడ్డి, గునుపూడి గిరి, కండెబోయిన శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ పనులు కల్పించాలి : ఏపీవో



సిబ్బందితో మాట్లాడుతున్న ఏపీవో శ్యామల

సీతారామపురం, మే 21 (ఆంధ్రజ్యోతి): పనులు కావాలని కోరిన ప్రతి ఒక్కరికీ పనులు కల్పించాలని ఏపీవో శ్యామల తెలిపారు. మండల కేంద్రంలోని ఉపాధి హామీ కార్యాలయంలో బుధవారం ఆమె ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో ఉపాధి పనులు కోరిన ప్రతిఒక్కరికీ పనులు కల్పించి పనులకు తగ్గట్టు కూలీలు అందించాలన్నారు.సిబ్బంది అలసత్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో టీఏలు మురళి, రంగనాథ్, ఫీల్డ్ అసిస్టెంట్లు కొత్త జగదీష్, ప్రభాకర్, కనకాద్రి,సుబ్బారెడ్డి,ప్రసాదు,వెంకటేష్ పాల్గొన్నారు.

వైసీపీ నేతలతో మేకపాటి ముచ్చట్లు

ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో బుధవారం నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి నాయకులతో ముచ్చటించారు. ఓ శుభకార్యానికి వెళుతున్న ఆయన బస్టాండ్ సెంటర్‌లో నాయకులతో కలిసి టీ తాగి, నియోజకవర్గంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ ఓబులరెడ్డి, ఎంపీటీసీ జీ.తిరుపతి, ఉప సర్పంచి ముర్తుజా, నాయకులు అక్కి భాస్కర్‌రెడ్డి, అలీ అహ్మద్, ఎంప రియాజ్, ఎస్థానీ, హరి తదితరులు పాల్గొన్నారు.

అందరి ఆమోదంతోనే కమిటీలు : ఎమ్మెల్యే కాకర్ల



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), మే 21 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కమిటీలను అందరి ఆమోదంతోనే ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలిపారు. బుధవారం మండలంలోని వేంపాడు, రామాపురం, వరికుంటపాడు, తిమ్మారెడ్డిపల్లి, తూర్పుకొండారెడ్డిపల్లి, దక్కనూరు గ్రామాల్లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్గ విభేదాలు లేకుండా ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేసి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అన్ని సామాజిక వర్గాలకు కమిటీల్లో ప్రాధాన్యత కల్పించాలన్నారు. ఇంతవరకు 11 పంచాయతీల్లో కమిటీలను పూర్తి చేశామని, మిగిలిన వాటిని సైతం త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. కార్యకర్తలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. అనంతరం గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి పాటు పడతానని హామీ నిచ్చారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చంద్ర మధుసూదనరావు, పొలిటికల్ మేనేజరు మాలేపాటి చైతన్య, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించండి



మాట్లాడుతున్న తహసీల్దారు సుభాషిణి

అనంతసాగరం, మే 21(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై ఉద్యోగులు ప్రత్యేక దృష్టిసారించాలని తహసీల్దారు సుభాషిణి తెలిపారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ సంపూర్ణమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి ఇళ్ల పట్టాలు మంజూరు చేస్తామన్నారు. స్పందన కార్యక్రమంలో వచ్చే ప్రతి అర్జీని ఆన్‌లైన్ చేసి పరిష్కారానికి చొరవ చూపుతున్నట్లు తెలిపారు. ఉపాధి హామీ ఏపీవో సుబ్బరాయుడు మాట్లాడుతూ రైతుల ప్రయోజనం కోసం ఫారంపాండ్స్ అందుబాటులోకి వచ్చాయని, అవసరమైన రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వ్యక్తిగత, కమ్యూనిటీ ఇంకుడుగుంతలు నిర్మించుకుంటే లబ్ధిదారులకు నగదు బదిలీ చేస్తామన్నారు. హౌసింగ్ ఏఈ శరత్ మాట్లాడుతూ పేదలు ఇళ్లు త్వరితగతిన నిర్మించుకునేలా ప్రజాప్రతినిధులు చొరవ చూపాలన్నారు. బిల్లులు మంజూరులో ఎలాంటి జాప్యం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో రామచంద్రయ్య, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

సూర్యప్రభ వాహనంపై దర్శనమిచ్చిన శ్రీవారు



పొదలకూరు, మే 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శ్రీలక్ష్మీగోదా సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో మూడోరోజు బుధవారం సూర్యప్రభ వాహనంపై శ్రీవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం సుదర్శన నారసహోమం, సూర్యప్రభ వాహనసేవ జరిగాయి. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం ఎదుర్కోలు ఉత్సవం, రాత్రికి హనుమంతసేవ, చంద్రప్రభ వాహనసేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కానుగ ఆకుపై ఆంజనేయుడు



హనుమ జయంతిని పురస్కరించుకుని మండలంలోని మహమ్మదాపురం గ్రామానికి చెందిన రిటైర్డ్ డ్రాయింగ్ టీచర్ పచ్చా పెంచలయ్య కానుగ ఆకుపై ఆంజనేయుడి చిత్రాన్ని గీశారు. ఎంతో భక్తి భావంతో అందంగా గీసిన ఆ సూక్ష్మ కళాచిత్రం అందరినీ ఆకట్టుకుంటోంది.

- పొదలకూరు, (ఆంధ్రజ్యోతి)

నీరు-చెట్టు.. కనికట్టు!

- ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడుస్తున్న అక్రమార్కులు
- చేయని పనులకు కూడా బిల్లులు పెడుతున్న వైనం
- రోజురోజుకు పెరుగుతున్న బిల్లుల సంఖ్య
- పాత తేదీలతో ఎంబుక్‌లు రికార్డు చేస్తున్న అధికారులు
- నీకింత.. నాకింత.. అంటూ వాటాలు?

నీరు-చెట్టు పథకం కింద నిజంగా పనులు చేసిన కాంట్రాక్టర్లను కాపాడాలన్నది ప్రభుత్వ లక్ష్యం. వైసీపీ ప్రభుత్వ కక్ష సాధింపుతో కుదేలైన వ్యక్తులను ఆదుకోవాలన్నది ప్రధాన ఉద్దేశం. ఇందులో భాగంగానే పెండింగ్ బిల్లులను చెల్లించాలన్న కీలక నిర్ణయాన్ని తీసుకుంది. అయితే కొందరు అక్రమార్కులు ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడుస్తున్నారు. ప్రభుత్వం మంచితనాన్ని అలుసుగా తీసుకుని ప్రజాధనాన్ని దోచుకునేందుకు సిద్ధమయ్యారు. చేయని పనులను కూడా చేసినట్లుగా ఎంబుక్‌లు రికార్డు చేస్తూ బిల్లులు పెట్టుకునే కుట్రలు జరుగుతున్నాయి. నీరు-చెట్టు బిల్లుల సంఖ్యను పరిశీలిస్తేనే ఈ విషయం స్పష్టమవుతుంది. అసలు జిల్లాలో ఎన్ని బిల్లులు పెండింగ్ ఉన్నాయన్న దానిపై ఏ ఒక్క డివిజన్‌లో స్పష్టత లేకపోవడం గమనార్హం. నాలుగు నెలల క్రితం జిల్లాలో సుమారు 750 బిల్లులు అప్‌లోడ్ చేయాల్సి ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య రెట్టింపయ్యింది. మార్చి నెలాఖరుకు అప్‌లోడ్ చేసిన బిల్లులన్నిటినీ ప్రభుత్వం క్లియర్ చేసింది. మరి ఇంకా వందల సంఖ్యలో బిల్లులు ఎక్కడి నుంచి వస్తున్నాయన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది.

నెల్లూరు, మే 21 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వం ఏర్పడే నాటికి జిల్లాలో 2,433 నీరు-చెట్టు పనులకు గానూ రూ.191.29 కోట్లు బిల్లులు చెల్లించాల్సి ఉంది. అయితే అప్పట్లో నీరు-చెట్టు పనులపై అనేక రకాల ఎంక్వయిరీలు వేసి బిల్లులు చెల్లింపులో జాప్యం చేశారు. రెండేళ్ల తర్వాత నుంచి పనులు చేసిన వారు హైకోర్టు మెట్లెక్కడం మొదలుపెట్టారు. కోర్టు ఆదేశాలతో బిల్లులు మంజూరయ్యాయి. ఈ నేపథ్యంలో ఒక్కొక్కరుగా కోర్టుకు క్యూకట్టారు. ఇలా సగం మంది వరకూ తమ బిల్లులను తెచ్చుకున్నారు. దాదాపుగా 90 శాతం మంది హైకోర్టులో కేసులు వేశారు. పనులు చేయని వారు కోర్టుకు వెళ్లలేదు. అయితే ప్రభుత్వం మారడంతో నీరు-చెట్టు బిల్లులను చెల్లించేందుకు నిర్ణయించింది. ఈ పెండింగ్ బిల్లులన్నింటినీ చెల్లించేందుకు ప్రభుత్వం గత డిసెంబరులో బడ్జెట్ కేటాయింపులు కూడా చేసింది. ఆ తర్వాత బిల్లులు అప్‌లోడ్ చేయడం మొదలుపెట్టారు. తొలుత కోర్టులో పెండింగ్ ఉన్న కేసులకు సంబంధించిన బిల్లులు మాత్రమే అప్‌లోడ్ చేయాలని ఆదేశాలు అందడంతో ఇరిగేషన్ అధికారులు ఆ బిల్లులను మాత్రమే అప్‌లోడ్ చేస్తూ వచ్చారు. తర్వాత అన్ని బిల్లులను పంపాలని సూచించడంతో ఒక్కసారిగా బిల్లుల సంఖ్య పెరిగింది. పనులు చేయని వ్యక్తులు కూడా దొంగ మార్గాల్లో బిల్లులను పెట్టుకునేందుకు తెరలేపారు. ఈ ఏడాది జనవరి 28వ తేదీ నాటికి ఇరిగేషన్ అధికారుల లెక్కల ప్రకారం జిల్లా మొత్తం అప్‌లోడ్ చేయాల్సిన బిల్లులు 828 ఉంటే అందులో ఇరిగేషన్ సర్కిల్ పరిధిలోనివి 764 ఉండడం గమనార్హం. సోమశిల, టీజీపీ సర్కిల్స్ పరిధిల్లో 64 మాత్రమే ఉన్నాయి. అయితే ప్రస్తుతం ఈ సంఖ్య అమాంతం పెరిగిపోయింది. ఫిబ్రవరి, మార్చి నెలల్లో వందల బిల్లులను అప్‌లోడ్ చేయగా వాటన్నింటికీ పేమెంట్ కూడా జరిగిపోయింది. అయినా ఇంకా 1500కు పైగా బిల్లులు పెండింగ్ చూపిస్తుండడం చర్చనీయాంశంగా మారింది.

పెండింగ్ బిల్లుల వివరాలు

డివిజన్ పేరు	28-01-2025	17-05-2025
సెంట్రల్ డివిజన్	134	173
కావలి డివిజన్	225	121
ఆత్మకూరు డివిజన్	208	185
గూడూరు డివిజన్	152	721
వెంకటగిరి డివిజన్	45	359

● పర్సంటేజీలతో కానిచ్చేస్తున్నారు!

2019లో టీడీపీ ప్రభుత్వం దిగిపోయేనాటికి చాలా నీరు-చెట్టు వర్కులకు అగ్రిమెంట్లు జరిగి ఉన్నాయి. తర్వాత వైసీపీ ప్రభుత్వం పనులు నిలిపేయడంతో చాలా పనులు జరగలేదు. అయితే అటువంటి అగ్రిమెంట్లు చేసుకున్న వ్యక్తులు ఇప్పుడు ఇరిగేషన్ అధికారులను మేనేజ్ చేసుకొని పాత తేదీలతో ఎంబుక్‌లు రికార్డు చేయించుకుటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇవన్నీ మట్టి వర్కులు కావడంతో ఇప్పుడు పరిశీలించినా కనిపించవు కాబట్టి ఇరిగేషన్ అధికారులు కూడా బరితెగిస్తున్నారు. ముందుగానే పది శాతం తీసుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. అలానే గతంలో కొంత మేర మాత్రమే పనులు చేసి పార్ట్ బిల్లులు పెట్టుకొని ఉన్నారు. అటువంటి బిల్లులను కూడా ఇప్పుడు ఫుల్ బిల్లుగా మారుస్తున్నారు. జీఎస్టీని క్లెయిమ్ చేసుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతోనే బిల్లులు సంఖ్య పెరిగిందని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నా ఆ మాటున దొంగ బిల్లులు కూడా వెళుతున్నాయని ఇరిగేషన్ శాఖలో బహిరంగంగానే చెప్పుకుంటున్నారు. ఇప్పుడు క్యూసీ సర్టిఫికెట్లు తెస్తుండడమే ఇందుకు ఉదాహరణగా చూపిస్తున్నారు. అయితే క్యూసీలో పనిచేసే ఓ ఇద్దరు ఉద్యోగులు క్యూసీ పుస్తకాలను ఆఫీసుతో సంబంధం లేకుండా ముద్రించి ఇష్టమొచ్చినట్లు సర్టిఫికెట్లు ఇస్తున్నట్లు తెలుస్తోంది. కాగా ఈ బిల్లుల అంశంపై ఇరిగేషన్ ఎస్ఈ దేశానాయక్‌ను వివరణ కోరగా నీరు-చెట్టు బిల్లుల లెక్క తేలిందని చెప్పారు. పనులు చేసినట్లు అధికారులు ధ్రువీకరించాక మాత్రమే బిల్లులు అప్‌లోడ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎర్రతివాచీ పరిచినట్లు చెట్టంతా పూలే..!



ఎరుపు రంగు పూలతో ఎంతో అందంగా కనిపిస్తున్న ఈ చెట్టు అందరినీ ఆకర్షిస్తోంది. పట్టణంలోని కావలి మార్గంలో గల స్టేట్‌పేటలో రహదారి పక్కనే ఓ నివాస ఆవరణలో ఈ చెట్టు ఉంది. అరకొరగా ఆకులు కలిగి, చెట్టంతా ఎర్రరంగు పూలతో కనిపించడం దీని ప్రత్యేకత. ఈ చెట్టును చూసిన పలువురు ఫొటోలు, వీడియోలు తీసుకునేందుకు ఆసక్తి కనపరుస్తున్నారు.

- ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి)

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	136
స్కిన్ చికెన్	244
స్కిన్‌లెస్	270

కోడిగుడ్ల ధర (100): 550



చిన్నారులకు వ్యాసరచన పోటీ

ఉలవపాడు, మే 21(ఆంధ్రజ్యోతి) : వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా ఉలవపాడులోని శాఖ గ్రంథాలయంలో చిన్నారులకు బుధవారం వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు శాఖ గ్రంథపాలకుడు దాసరి కోటేశ్వరరావు తెలిపారు. తొలుత విద్యార్థులతో పుస్తక పఠనం చేయించి తరువాత వారికి నచ్చిన జాతీయ నాయకుడు గురించి వ్యాసం రాయించారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు భాస్కర్‌రాజా ప్యాకల్టీగా వ్యవహరించారు. దాతలు బావనపల్లి చెంచయ్య, కామక్షమ్మ దంపతులు చిన్నారులకు స్నాక్స్, కూల్ డ్రింక్స్ అందచేశారు.

పెరగని పొగాకు ధర!

● రైతుల ఆందోళన

కలిగిరి, మే 21(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మార్కెట్ డిమాండ్‌ను బట్టి గత మూడేళ్లుగా పొగాకు రైతులకు మార్కెట్ అనుకూలించడంతో రికార్డు ధరలు దక్కాయి. దీనికితోడు బోర్డు కూడా గతేడాది కంటే ఈ ఏడాది అధిక పొగాకు ఉత్పత్తికి అనుమతులివ్వడంతో ఎక్కువ మంది పొగాకు సాగుకు మొగ్గు చూపారు. అయితే కొనుగోళ్లు ప్రారంభం అయి రెండునెలలు దాటుతున్నా ధరలు పెరగకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గతేడాది రికార్డుస్థాయిలో పొగాకు ధరలు పెరగడంతో ఈ ప్రభావం ఈ ఏడాది సాగుపై పడింది. భూమి, బ్యారన్ కౌలు, కట్టె ఖర్చు, పచ్చాకు ముఠా కూలీలు అమాంతం పెరిగిపోయాయి. దీంతో గతేడాదికన్నా ఒక్కొక్క బ్యారెన్‌కు 30శాతం మేర అదనపు ఖర్చులు పెరిగాయి. 2023-24 సీజన్‌లో ప్రారంభ ధర కిలో రూ.280 పలకగా కొనుగోళ్ల చివరి దశకు వచ్చేసరికి నాణ్యత కలిగిన ఏగ్రేడ్ రకం కిలో ధర రూ.330గా నమోదైంది.


కలిగిరి వేలం కేంద్రంలో పొగాకు బేళ్లు

అయితే ఈ ఏడాది ఇప్పటి వరకు గరిష్ఠ ధరలో మార్పు లేకుండా కొనుగోళ్లు జరుగుతుండటంతో రైతులు ఇటీవల ఆందోళనలకు దిగారు. దీనికితోడు లోగ్రేడు పొగాకును కొనుగోలు చేయకుండా నోబిడ్ ప్రకటిస్తూ వెనక్కి తిప్పి పంపుతున్నారు. ఇళ్లవద్ద మండెలు పేర్చి, బేళ్లుగా తయారు చేసి వేలం కేంద్రానికి తీసుకువచ్చిన పొగాకును తిరిగి ఇంటికి తీసుకెళ్లాలంటే రైతుకు శ్రమతో పాటు రవాణాఖర్చు కూడా పెరిగిపోతుండటంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాదిపెట్టుబడులు గణనీయంగా పెరగడంతో మార్కెట్ ధరలు పెరగకపోతే తీవ్రంగా నష్టపోతామని పేర్కొంటున్నారు. బోర్డు అధికారులు ప్రభుత్వానికి రైతుల పరిస్థితిని తెలియజేసి మద్దతు ధరలు పెంచాలని కోరుతున్నారు.

అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ ఆధారంగానే..

అంతర్జాతీయ మార్కెట్ డిమాండ్‌ను బట్టి పొగాకును కంపెనీలు కొనుగోలు చేస్తాయి. ప్రస్తుతం లోగ్రేడ్ పొగాకుకు డిమాండ్ లేకపోవడంతో కంపెనీలు కొనుగోలు చేయడానికి ముందుకు రావడంలేదు, మార్కెట్ పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ దానికి అనుగుణంగా పొగాకుబేళ్లను వేలం కేంద్రానికి తీసుకువచ్చి మద్దతు ధర పొందాలి. ఈ విషయం రైతులకు సూచిస్తున్నాం.

- ఇసాక్ స్వరన్‌దత్,
వేలం నిర్వహణాధికారి, కలిగిరి

గ్రామాల్లో పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలి

● మాధవరావు, లింగసముద్రం పంచాయతీ కార్యదర్శి



లింగసముద్రం, మే 21(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలి. ఇప్పటికే పంచాయతీ సాధారణ, 15వ ఆర్థిక సంఘం నిధులతో లింగసముద్రం పంచాయతీ పరిధిలోని లింగసముద్రం, వాకమళ్లవారిపాలెం, జంపాలవారిపాలెం, అంబేడ్కర్‌నగర్‌లో సీసీ రోడ్లు, సైడు కాలువలు నిర్మించాం. వీధి లైట్లు వేయడంతోపాటు కాలువల్లో పూడికతీత, మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయించి క్లోరినేషన్ చేయించామని పంచాయతీ కార్యదర్శి ఎం మాధవరావు తెలిపారు.

? లింగసముద్రం పంచాయతీ అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకున్నారు.

! పంచాయతీలోని అంబేడ్కర్‌నగర్‌లో రూ.7లక్షలతో మూడు సీసీ రోడ్లు, వాకమళ్లవారిపాలెం అయ్యప్పగుడి వద్ద రూ.11 లక్షలతో సీసీ రోడ్డు, సైడు కాలువ నిర్మాణం, రెండు లక్షలతో చిప్స్ రోడ్డు నిర్మాణం, లింగసముద్రం నాయకుల బజారులో రూ.లక్షతో సైడు కాలువ నిర్మించాం.

? దోమల నివారణకు ఏమైనా చర్యలు తీసుకున్నారా. మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయించి, క్లోరినేషన్ చేయిస్తున్నారా.

! అన్ని గ్రామాల్లో మురుగు కాలువల్లో పూడిక తీయించాం. త్వరలో బ్లీచింగ్ వేయించి, ఎబేట్ మందు స్ప్రే చేయిస్తాం. వాకమళ్లవారిపాలెం, లింగసముద్రం, జంగంరెడ్డిపాలెం గ్రామాలలోల్లోని మంచినీటి ట్యాంకులను ఇటీవల శుభ్రంగా కడిగించి, క్లోరినేషన్ చేయించాం.

? అన్ని గ్రామాల్లో వీధిలైట్లు వేయించారా.

! పంచాయతీలోని అన్ని గ్రామాల్లో మూడు వారాల క్రితం వీధి లైట్లు వేయించాం.

? లింగసముద్రంలో ఇళ్ల నుంచి ఆర్‌అండ్‌బీ రోడ్డుపైకి వస్తున్న మురుగు నివారణకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు.

! రోడ్లపైకి మురుగు నీరు వదిలే వారికి త్వరలో నోటీసులు ఇస్తాం. అప్పటికీ వినకపోతే ఈఓపీఆర్డీ దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం.

న్యూస్ బాక్స్

నేడు అల్లూరులో ఎమ్మెల్యే పర్యటన

అల్లూరు, మే 21(ఆంధ్రజ్యోతి) : కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి గురువారం అల్లూరులో పర్యటించనున్నారని సోమశిల ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ తెలిపారు. అల్లూరులోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన స్థానిక నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే పర్యటనపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో మరుగున పడిన తాగునీటి ప్రాజెక్టుకు దాదాపు రూ.55 లక్షల పైచిలుకు నిధులతో మరమ్మతులు చేపట్టామన్నారు. అల్లూరుతోపాటు ఇస్కపల్లి, గోగులపల్లి ప్రాంత ప్రజలకు తాగునీటిని అందించే విధంగా వినియోగంలోకి తీసుకొచ్చిన ఈ ప్రాజెక్టును పునఃప్రారంభించనున్నట్లు తెలిపారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అల్లూరు రామకృష్ణ జూనియర్ కళాశాలలో కుట్టు మిషన్ కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే చర్చించనున్నట్లు తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలగాటి శ్రీనివాసులురెడ్డి, మేడా కృష్ణారెడ్డి, సామంతుల పరంధామరెడ్డి, బండి శ్రీనివాసులురెడ్డి, కృష్ణచైతన్య తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు రేంజ్ అటవీ స్క్వాడ్ అధికారుల తనిఖీ

కావలి, మే 21(ఆంధ్రజ్యోతి): పర్మిట్లు లేకుండా టేకు కలప తెచ్చి వ్యాపారాలు చేస్తున్నారనే ఆరోపణల మేరకు బుధవారం కావలిలో గుంటూరు రేంజ్ అటవీశాఖ స్క్వాడ్ అధికారులు తనిఖీలు చేట్టారు. పట్టణ ఉత్తర శివారులో ఉన్న ఒక టింబర్ డిపోను తనిఖీ చేయగా అక్కడ పర్మిట్లు లేని టేకు కలపను గుర్తించినట్లు తెలిసింది. దీంతో కావలిలోని టింబర్ డిపో వ్యాపారులు అందరూ అప్రమత్తమై జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిసింది. అయితే తనిఖీ చేసిన డిపోలో ఎంత సరుకు పర్మిట్‌లు లేకుండా దొరికిందో, వారికి ఏ మేరకు పెనాల్టీలు విధించారో, లేక సర్దుబాటు చేసుకుని వెళ్లారో వివరాలు తెలియాల్సి ఉంది. ఈ విషయంపై కావలి రేంజర్ మోహన్‌ను వివరాలు అడగగా తాను విధినిర్వహణలో భాగంగా బయటకు వెళ్లానని, గుంటూరు స్క్వాడ్ అధికారులు వచ్చి వెళ్లారని తెలిసిందని, అందుకు సంబంధించి వారు తమకు సమాచారం ఇవ్వాల్సిన అవసరంలేదని చెప్పారు.

124 పొగాకు బేళ్లు తిరస్కరణ

కలిగిరి, మే 21(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి గురువారం రైతులు మొత్తం 531 పొగాకు బేళ్లు అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 10 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 407 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-107, ఆర్‌ఆర్-4, సీఆర్-7, జంపింగ్‌లాట్స్-6 కారణాలతో 124బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.200, సగటు ధర రూ.244.93గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి టీ.ఇసాక్‌స్వరన్‌దత్ తెలిపారు.

రోడ్డు పక్కన పడిన హోర్డింగ్ ప్రేమ్


ట్రంకురోడ్డు పక్కన విరిగి పడి ఉన్న హోర్డింగ్ ఐరన్ ప్రేమ్

కావలి, మే 21(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం బృందావనం హౌసింగ్‌కాలనీ పక్కన ట్రంకురోడ్డును ఆనుకుని ఏర్పాటు చేసిన హోర్డింగ్ ఇటీవల గాలికి విరిగి రోడ్డు పక్కన పడింది. ఆ హోర్డింగ్‌కు సంబంధించిన ఫ్లెక్సీని తీసివేయగా దాని ఐరన్ ప్రేమ్ అక్కడే పడి ఉంది. దీంతో ట్రంకు రోడ్డుపై రాకపోకలు సాగించే వారు రాత్రి సమయంలో కొంచెం రోడ్డు మార్జిన్‌లోకి వచ్చారంటే ప్రమాదాలకు గురికాక తప్పదు. నిత్యం రద్దీగా ఉండే ఆ ప్రాంతంలో హోర్డింగ్ పడి ఐదారు రోజులు అవుతున్నా హోర్డింగ్ ఏర్పాటు చేసిన వారు కానీ, మున్సిపల్, పోలీస్ అధికారులు కానీ పట్టించుకోవడం లేదు. దీంతో దాని వలన ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఇప్పటికే కొన్ని వాహనాలు రోడ్డు మార్జిన్‌కు షడన్‌గా వచ్చి కిందపడిన ఇనుప కమ్ముల ప్రేమ్‌ను గుర్తించి త్రుటిలో తప్పించుకున్నారు. అధికారులు స్పందించి రోడ్డు పక్కన పడి ఉన్న ఆ హోర్డింగ్ ప్రేమ్‌ను తొలగింపునకు చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహన చోదకులు కోరుతున్నారు.

దాడి ఘటనపై కేసు నమోదు

ఉలవపాడు, మే 21 (ఆంధ్రజ్యోతి) : ఉలవపాడు జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థిపై గతంలో జరిగిన దాడిపై మంగళవారం రాత్రి కేసు నమోదు చేసినట్లు బుధవారం పోలీసులు తెలిపారు. వివరాల మేరకు.. ఉలవపాడు పంచాయతీ పరిధిలోని కేరాజుపాలెం పంచాయతీ కుమ్మరిపాలెంకు చెందిన కలికివాయి మనోజ్ ఉలవపాడులో జూనియర్ ఇంటర్ చదువుతున్నాడు. ఇటీవల జరిగిన పరీక్షల సమయంలో కళాశాలలోకి వెళుతుండగా కాలుజారి ముందుకు పడ్డాడు. అది చూసి ఉలవపాడు హైస్కూల్ సంఘంకు చెందిన దాసరి నందకిశోర్ నవ్వాడు. దీంతో ఎందుకు నవ్వుతున్నావని ప్రశ్నించగా నాయిష్టం అంటూ వాదనకు దిగాడు. ఈ క్రమంలో పరీక్ష హాల్లోకి వెళుతున్న మనోజ్‌ను అటకాయించి డొక్కలో పిడిగుద్దులు గుద్దాడు. ఆ విషయం ఆ విద్యార్థి ఇంట్లో పెద్దలకు చెప్పలేదు. కానీ కడుపు నొప్పి ఉందని చెప్పడంతో అప్పటి నుంచి ఉలవపాడు, కావలి, నెల్లూరు ఆసుపత్రిలల్లో చికిత్స చియించారు.


ఒంగోలు రిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఇంటర్ విద్యార్థి మనోజ్

తగ్గకపోవడంతో చివరకు ఒంగోలు రిమ్స్‌కు చేరారు. అతని పరిస్థితి విషమంగా ఉండడంతో అసలు ఏమి జరిగిందని వైద్యులు ప్రశ్నించగా జరిగిన విషయం చెప్పాడు. దీంతో కుటుంబ సభ్యులు, బాధితుడు నిందుతుడు నందకిశోర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు తెలిపారు.

ఉత్తమ విద్యార్థులకు బహుమతుల అందజేత

కందుకూరు, మే 21(ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్కృతి ప్రైవేటు పాఠశాలలో ఈనెల 11న నిర్వహించిన మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బుధవారం పాఠశాల చైర్మన్ కొంకా చంద్రశేఖర్ బహుమతులు అందజేశారు. 1 నుంచి 9వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 27 మందికి కోర్సు ఫీజు పూర్తిగా ఉచితంగా ఇస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మక వెలికి తీసేందుకు ఈ పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. తరగతుల వారీగా మొదటి బహుమతిగా ట్యాబు, రెండో బహుమతి సెల్‌ఫోన్, మూడవ బహుమతి స్మార్ట్ వాచ్ ప్రదానం చేసి ప్రశంసాపత్రం అందజేశారు.

విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డులు

వలేటివారిపాలెం, మే 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని చుండి మోడల్ స్కూల్‌లో చదివి పదవ తరగతిలో ప్రతిభ చూపిన ఐదుగురు విద్యార్థులకు మంగళవారం విజయవాడలో రాష్ట్ర మంత్రి నారా లోకేష్ బాబు షైనింగ్ స్టార్స్ ప్రోత్సాహక అవార్డులను అందజేశారు. అవార్డులు అందుకున్న వారిలో వీరమోసు జయసంహిత, బోడా నవ్యశ్రీ, ప్రగడ రాజేష్, మీసాల మనోజ్ఞ, చెరువుపల్లి హంతివకసాయికోటి ఉన్నారు. జిల్లాలో ఈ అవార్డులకు 9 మంది విద్యార్థులు ఎంపిక అవ్వగా వారిలో ఐదుగురు చుండి మోడల్ స్కూల్ విద్యార్థులు ఉండడం విశేషం. అవార్డులు అందుకున్న విద్యార్థులను ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీవెంకటేశ్వర్, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.


మంత్రి లోకేష్ నుంచి అవార్డు అందుకుంటున్న విద్యార్థిని వీరమోసు జయసంహిత

వైసీపీకి అమరా వేదగిరి గుడ్‌బై

● క్రియాశీలక సభ్యత్వానికి, వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి పదవికి రాజీనామా

కావలి, మే 21(ఆంధ్రజ్యోతి): కావలి నియోజకవర్గంలో వైసీపీకి ఒకరి వెంట ఒకరు దూరమవుతున్నారు. వైసీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి, మాజీ కౌన్సిలర్, 33వ వార్డు వైసీపీ ఇన్‌చార్జి అమరా వేదగిరి సుబ్బరాయుడు గుప్తా తన పదవికి రాజీనామ చేసి పార్టీకి గుడ్‌బై చెప్పారు. ఈ మేరకు కావలి పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత కారణాల వలన తాను వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. వార్డులోని నాయకులు, తన శ్రేయోభిలాషులతో చర్చించిన అనంతరం ఏ పార్టీలో చేరేది త్వరలో ప్రకటిస్తానని చెప్పారు. అయితే ఆయనకు టీడీపీలో లైన్‌క్లియర్ కావడంతో త్వరలో టీడీపీలో చేరతారనే ప్రచారం జరుగుతున్న తరుణంలో ఆయన వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించడం అందుకు బలం చేకూరుస్తోంది.


మాట్లాడుతున్న అమరా వేదగిరి

రాళ్లపాడు కుడి, ఎడమ కాలువ కట్టల

రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు

లింగసముద్రం, మే 21(ఆంధ్రజ్యోతి) : రాళ్లపాడు ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువ కట్టల రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ కింద రూ.75 లక్షలు మంజూరు చేసింది. రెండు నెలల క్రితం ప్రాజెక్టులో ఉన్న సమస్యలను పరిష్కరించేందకు నిధులు మంజూరు చేయాలని ప్రాజెక్టు ఈఈ మునిరత్నం ఆదేశించారు. మంజూరైన రూ.75 లక్షలలో ప్రాజెక్టులోని సబ్ డివిజన్-1కి రూ.52.50 లక్షలు. సబ్ డివిజన్-2కు రూ.22.50 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. ఈ మేరకు ప్రాజెక్టు అధికారులు ప్రతిపాదనలను పంపడంతో నిధులు మంజూరయ్యాయని డీఈ ఎం వెంకటేశ్వర్లు బుధవారం చెప్పారు. ఈ నిధులతో ప్రాజెక్టు వంతెన రోడ్డుకు ఇరువైపులా ఉన్న చిల్లచెట్లు తొలగింపు, ఎడమ కాలువ ప్రారంభం నుంచి చివరి వరకు ఉన్న కాలువ కట్ట రోడ్డును అవసరమైన చోట గ్రావెల్‌తో నిర్మిస్తామన్నారు. అలాగే కుడి కాలువ ప్రారంభం నుంచి చివరి వరకు ఉన్న 20 కిమీల కాలువ కట్ట రోడ్డును కూడా అవసరమైన చోట గ్రావెల్‌తో మరమ్మతులు చేస్తామన్నారు. అలాగే కుడి కాలువ పరిధిలోని జంగాలపల్లి బ్రాంచ్ కెనాల్ కాలువ రోడ్డును కూడా బాగు చేస్తామని చెప్పారు. నామినేషన్ పద్ధతిలో జరిగే ఈ పనులు వచ్చే వారం నుంచి ప్రారంభం కానున్నాయని పేర్కొన్నారు.

నేడు హనుమాన్ జయంత్యుత్సవాలు

● విద్యుద్దీపాలతో ముస్తాబైన వలేటివారిపాలెం ప్రసన్నాంజనేయస్వామి ఆలయం

వలేటివారిపాలెం, మే 21 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ జయంత్యుత్సవాలకు వలేటివారిపాలెంలోని దక్షణముఖ ప్రసన్నాజనేయస్వామి ఆలయం ముస్తాబైంది. ఆలయాన్ని రకరకాల విద్యుత్ దీపాలతో భక్తులకు కనువిందుచేసేలా అలంకరించారు. ఆంజనేయస్వామి విగ్రహానికి సిందూరం దిద్దారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పిస్తున్నారు. పలువురు భక్తులు అన్నదానం, మజ్జిగ, పులిహోర ప్యాకెట్లు, మినరల్ వాటర్ ఏర్పాటు చేస్తున్నారు. భక్తులు తిలకించేందుకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆలయ పరిసర ప్రాంతాలను నిర్వాహకులు పరిశుభ్రం చేయించారు.


వలేటివారిపాలెం : విద్యుత్ దీపాలతో అలంకరించిన ప్రసన్నాంజనేయస్వామి ఆలయం

● ఏర్పాట్లు పూర్తి

కలిగిరి : మండలంలోని కమ్మవారిపాలెం, జిర్రావారిపాలెం తిప్ప, కలిగిరి పట్టణాలలో గురువారం జరగనున్న హనుమజ్జయంతికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆలయాల వద్ద భక్తుల సౌకర్యార్థం చలువపందిళ్లు వేశారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

● చౌదరిపాలెంలో...

కావలి రూరల్ : కావలి మండలం చౌదరిపాలెంలోని ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం హనుమాన్ జయంత్యుత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఉదయం అభిషేకాలతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని, రాత్రి 8 గంటలకు స్వామివారికి ఆకు పూజ, ఆలయ ప్రాంగణంలో అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు. రాత్రి స్వామివారి గ్రామోత్సవం జరుగుతుందని తెలిపారు. గ్రామస్థుల సహాయ సహకారాలతో నిర్వహిస్తున్న ఈ ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.


విద్యుత్ దీపాలతో ఆంజనేయుడి ప్రతిమ

కమనీయం సీతారాముల కల్యాణం


వలేటివారిపాలెం : ఎమ్మెల్యే నాగేశ్వరరావును సత్కరించిన నిర్వాహకులు, గ్రామస్థులు


బిట్రగుంట : సీతారాములకు పూజలు చేస్తున్న భక్తులు

కావలిటౌన్, మే 21(ఆంధ్రజ్యోతి) : ముసునూరు మందాటి చెరువు వద్ద వెలసివున్న హరిహర సమేత హనుమత్ క్షేత్రంలో జరుగుతున్న హనుమత్ జయంత్యుత్సవంలో భాగంగా బుధవారం సీతారాముల కల్యాణం కనుల పండువగా జరిగింది. హనుమత్ క్షేత్రం వ్యవస్థాపక ప్రధాన అర్చకుడు వేదగిరి సూర్యనారాయణ చార్యులు పర్యవేక్షణలో ఉదయం శ్రీరాముడికి అభిషేకం శ్రీరామ హోమం పూజలు, మహా నివేదన తదితర పూజలు జరిగాయి. సాయంత్రం శ్రీరామ కోటి పుస్తకాల ఉత్సవం జరగగా రాత్రి సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. భక్తజనం పెద్దఎత్తున పాల్గొని కల్యాణ మహోత్సవం తిలకించారు. అనంతరం శ్రీరామ లేఖన పుస్తకాలను శ్రీరామ క్రతుస్తంభంలో వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు..


కావలిటౌన్ : సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

జమీన్‌ఉప్పలపాడులో...

వలేటివారిపాలెం : మండలంలోని జమీన్‌ఉప్పల పాడులో బుధవారం సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. దేవతామూర్తుల విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి మేళతాళాలు మంగళవాయిద్యాలు, మంత్రోచ్ఛరణల నడుమ అర్చకులు ప్రత్యేక పూజలు, కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సీతారాముల కల్యాణానికి తిలకించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సోమినేని రవీంద్ర, సోమినేని నరసింహం, సోమినేని మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా 16 రోజుల పండుగ

బిట్రగుంట : బోగోలు మేజర్ పంచాయతీ పాత దళితవాడలోని కోదండ రామస్వామి ఆలయంలో వెలసి ఉన్న సీతారాముల కల్యాణం అనంతరం బుధవారం పదహారు రోజుల పండుగ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజాభిషేకాలు, మధ్యాహ్నం అన్న సంతర్పణ కార్యక్రమాలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

డీఆర్‌యూసీసీ సమావేశంలో కావలి స్టేషన్ సమస్యలు

కావలిటౌన్, మే 21(ఆంధ్రజ్యోతి) : విజయవాడ డివిజనల్ రైల్వే మేనేజర్ నరేందర్‌పటేల్ పర్యవేక్షణలో బుధవారం విజయవాడలో జరిగిన డీఆర్‌యుసీసీ సమావేశంలో కావలి సమస్యలపై డీఆర్‌యుసీసీ సభ్యుడు వేణుమాధవ్ ప్రస్తావించారు. కావలి రైల్వే స్టేషన్ పడమర వైపు బుకింగ్ కౌంటర్ ఏర్పాటు, బ్రిడ్జి పొడిగింపు, 3, 4ప్లాట్‌ఫామ్‌లలో మొబైల్ టికెట్ కౌంటర్‌ల ఏర్పాటు, శబరి, పద్మావతి, జోదాపూర్ తదితర రైళ్ల నిలుపుదల సమస్యలపై ప్రస్తావించారు. పై సమస్యల పట్ల డీఆర్‌ఎం సానుకూలంగా స్పందించారని త్వరలో సమస్యల పరిష్కారం జరుగుతాయని వేణుమాధవ్ ఆశాభావం వ్యక్తం చేశారు.


వేణుమాధవ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఆర్‌ఎం నరేందర్‌పటేల్

ఫారం పాండ్ల నిర్మాణాలకు చర్యలు చేపట్టండి : ఏపీడీ

లింగసముద్రం, మే 21(ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకంలో ఫారం పాండ్ల నిర్మాణాలకు సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఉపాధి హామీ పథకం కందుకూరు ఏపీడీ జే బాబూరావు ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం సమావేశం హాలులో మండల ఇన్‌చార్జి ఏపీవో దయాసాగర్ అధ్యక్షతన జరిగిన లింగసముద్రం, వలేటివారిపాలెం మండలాల టీఏలు, ఎఫ్‌ఏల సమావేశంలో ఏపీడీ పాల్గొని మాట్లాడారు. ఇప్పటికే ప్రారంభమైన ఫారం పాండ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని, కొత్త వాటిని నిర్మించేందుకు అంచనాలు రూపొందించాలన్నారు. రైతులు ఉద్యానవన పంటల సాగుకు మొగ్గు చూపేలా అవగాహన కల్పించాలన్నారు. నిమ్మ, మామిడి, జామ మొక్కల సాగుకు ముందుకొచ్చే రైతులు ఏపీవో, ఎంపీడీవోలను సంప్రదించాలన్నారు. ఆ రైతులకు 100 శాతం సబ్సిడీతో మొక్కలు అందజేస్తామన్నారు. అలాగే రోడ్లకు ఇరువైపులా, కట్టలపైన పల్లెవనం కింద మొక్కలు నాటించాలన్నారు. అలాగే కూలీల సంఖ్యను పెంచాలని, చెప్పారు. బోగస్ మస్టర్లు వేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



మాధవనగర్ పరిధిలోని బాలగంగమ్మ ఆలయ సమీపంలో వేసిన సీసీ రోడ్డు

నేడు విజయోత్సవ సభ

- జీవకోనకు ఎమ్మెల్యే ఆరణి, ఆంధ్రజ్యోతి ఈడీ ఆదిత్య, అధికారుల రాక
- సీసీ రోడ్డుకు భూమిపూజ, పోలీస్ అవుట్ పోస్ట్ ప్రారంభం
- 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..'లో సమస్యలకు పరిష్కారం

తిరుపతి, మే 21 (ఆంధ్రజ్యోతి): తిరుపతి కపిలతీర్థం సమీపాన శేషాచల కొండకు ఆనుకుని ఈశాన్యంలో ఉండే ఈ ప్రాంతం రాజకీయ నాయకులకు ఓ సెంటిమెంట్. ఎన్నికలు ముంచుకొస్తే రాజకీయ పార్టీలకు జీవకోన గుర్తుకొస్తుంది. ఇక్కడ నుంచే రాజకీయ ప్రచార ఢంకా మోగించేందుకు పోటీ పడతారు. కానీ ఎన్నికలైన తర్వాత అటువైపు కన్నెత్తి చూసేందుకు కూడా ఇష్టపడరు. జీవకోన అంటే రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకుగానే చూస్తాయి. శ్రామిక, కార్మిక వర్గాలు అధికంగా ఉండే ఈ ప్రాంతం తిరుపతికి మానవ వనరు కేంద్రంగా కనిపిస్తుంది. జీవకోన పరిధిలోని రాజీవ్ గాంధీ కాలనీ, సత్యనారాయణపురం, సాయినగర్, క్రాంతినగర్, పార్వతీపురం, సంతోషమ్మ నగర్, శ్రీనగర్ కాలనీలు ఉన్నాయి. 5 డివిజన్లు కలిగిన ఈప్రాంతంలో 12వేలకు పైగా గృహాలు, సుమారు 60వేల జనాభా కలిగివుంది. పేరులో కోన ఉంది కానీ ఇక్కడ తాగునీటి కష్టాలే. గుంతలపడ్డ రోడ్లు, అల్లరి మూకల ఆగడాలు, పారిశుధ్య లోపాలపై 'ఆంధ్రజ్యోతి' సచిత్రాలతో ప్రత్యేక కథనాలను ప్రచురించింది. ఈ క్రమంలో జనవరి 28న 'ఆంధ్రజ్యోతి' అధ్యక్షతన 'అక్షరం అండగా సమస్యల పరిష్కారమే అజెండాగా' జరిగిన సదస్సుకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, అధికారులు అతిథులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రజలు లేవనెత్తిన సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ మౌర్య, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ప్రత్యేక చొరవ చూపెట్టారు. ఇప్పటికి కార్పొరేషన్ అధ్వర్యంలో దాదాపు రూ.65 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైన్లు, ప్యాచ్ వర్కులు పూర్తయ్యాయి. మరో రూ52.30లక్షల పనులకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. ఈ క్రమంలో 'ఆంధ్రజ్యోతి' ఆధ్వర్యంలో గురువారం జీవకోనలో విజయోత్సవ సభ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పలు పనులకు భూమిపూజ చేయనున్నారు.



సిద్ధమైన పోలీస్ అవుట్‌పోస్టు

ఇవి చేశారు

- ఎమ్మెల్యే తన సొంత నిధులతో ఇటీవల రెండు ఆర్వో వాటర్ ప్లాంట్లు ఏర్పాటుచేశారు.
- తిరుమల బైపాస్ నుంచి సత్యనారాయణపురం వెళ్లే 30 మీటర్ల రోడ్డు పనుల పూర్తి
- రాళ్లుతేలిన సత్యనారాయణపురం- ఎర్రమిట్ట తూర్పు రోడ్డుకు రూ.37.5 లక్షలతో నిర్మాణం
- క్రాంతి నగర్, పార్వతి నగర్‌లో దెబ్బతిన్న డ్రైనేజీ కాలువలకు రూ.9.97లక్షలతో మరమ్మతులు
- బాలగంగమ్మ గుడి సమీపంలోని మాధవ నగర్లో రూ7.40లక్షలతో సీసీ రోడ్డును కార్పొరేషన్ నిర్మించింది.
- ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆధ్వర్యంలో ఏర్పాటైన పోలీస్ అవుట్ పోస్టు గురువారం ప్రారంభంకానుంది.

వేదిక: శ్రీలలితా త్రిపుర సుందరి ఆలయంలోని ఫంక్షన్ హాలు
సమయం: గురువారం ఉదయం 10 గంటలకు
అతిథులు: ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, 'ఆంధ్రజ్యోతి' ఈడీ వేమూరి ఆదిత్య, కమిషనర్ మౌర్య, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, స్థానిక కార్పొరేటర్లు అన్నా అనిత, అన్నా సంధ్య, స్థానిక నాయకులు


క్రాంతినగర్ సమీపంలో మురుగునీటి కాలువ నిర్మాణం

ఇవి చేయనున్నారు

- గోవిందనగర్‌లో రూ.6.50లక్షలతో సీసీ రోడ్డు
- జ్యోతి లెప్రసీ కాలనీలో రూ9.90 లక్షలతో.. రాజీవ్‌గాంధీ కాలనీలో రూ9.96లక్షలతో.. అరుణోదయ నగర్, సత్యనారాయణపురంలో రూ9.95 లక్షలతో సీసీ డ్రైన్ల నిర్మాణం
- క్రాంతి నగర్, విజయపురం, పార్వతి నగర్ వద్ద రూ6 లక్షలతో యూడీఎస్ లైన్ పునరుద్ధరణ, సీసీ ప్యాచ్ పనులు
- రూ10 లక్షలతో శ్మశాన వాటిక ప్రహరీ, సంతోషనగర్లో నీటి సంపు, పైపులైన్ల పనులు.

ఇంకా..
- తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) రూ.35లక్షలతో జీవకోన వద్ద గల లెప్రసీ కాలనీలో రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసింది.
- జీవకోన మొత్తం 120 సీసీ కెమెరాలను పోలీస్ శాఖ ఏర్పాటు చేయనుంది.


నేడు భూమిపూజ జరగనున్న గోవిందనగర్ రోడ్డు

చల్లంగ చూడవే
ముముగన్న తల్లీ!

- గంగమ్మకు సీఎం దంపతుల పూజలు


అమ్మవారికి పూజలు చేస్తున్న చంద్రబాబు దంపతులు

కుప్పం, మే 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం సుభిక్షంగా, అభివృద్ధి పథంలో నడవాలని, ప్రజలను చల్లగా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, భువనేశ్వరి దంపతులు గంగమ్మ తల్లిని కోరుకున్నారు. కుప్పంలోని ప్రసన్న తిరుపతి గంగమాంబ జాతరలో చివరి ఘట్టమైన గంగమ్మ విశ్వరూప దర్శనం సందర్భంగా బుధవారం చంద్రబాబు దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. టీటీడీ తెచ్చిన పట్టువస్త్రాలను, సారెను ప్రభుత్వం తరపున అమ్మవారికి సమర్పించారు. తిరిగి వెళుతూ క్యూలో ఉన్న భక్తులను నవ్వుతూ పలకరించారు. ముఖ్యమంత్రిగా బిజీగా షెడ్యూల్ ఉన్నాసరే, స్థానిక టీడీపీ నాయకుల కోరిక మన్నించి చంద్రబాబు కుప్పం వచ్చి అమ్మవారిని దర్శించుకుని మళ్లీ అప్పటికప్పుడే తిరుగు ప్రయాణమయ్యారు. సీఎం హోదాలో జాతర సందర్భంగా గంగమాంబను దర్శించుకోవడం చంద్రబాబు దంపతులకు ఇది రెండోసారి. 2019లో ఎన్నికలకు ముందు గంగమ్మను దర్శించుకుని ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించారు. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాంతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు సీఎంకు స్వాగతం పలికారు.

రైల్వే స్టేషన్‌కు కొత్త హంగులు

- నేడు వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని.. రానున్న కేంద్ర మంత్రి పెమ్మసాని

సూళ్లూరుపేట, మే 21 (ఆంధ్రజ్యోతి): అమృత్ భారత్ పథకం కింద సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌ను రూ.14.50 కోట్లతో ఆధునీకీకరించారు. సకల వసతులతో కొత్త హంగులు సంతరించుకున్న రైల్వేస్టేషన్‌ను ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ పద్ధతిలో గురువారం ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో నేరుగా పాల్గొనేందుకు కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సూళ్లూరుపేటకు రానున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను రైల్వే అధికారులు పూర్తి చేశారు.

నౌకా నిర్మాణ కేంద్రానికి స్థల పరిశీలన

వాకాడు, మే 21 (ఆంధ్రజ్యోతి): వాకాడు మండలం దుగరాజపట్నం సముద్రతీరంలో చేపట్టనున్న నౌకా నిర్మాణ కేంద్రానికి తహసీల్దారు రామయ్య, సర్వేయర్ శకుంతల బుధవారం ప్రాథమికంగా స్థల పరిశీలన చేపట్టారు. దీనికి 2700 ఎకరాలు కావాల్సి ఉండగా, ఇప్పటికే 400 ఎకరాల ప్రభుత్వ భూమి అందుబాటులో ఉందని తహసీల్దారు తెలిపారు. తూపిలిపాళెం తీరంలో 14 హేచరీలకు సంబంధించి 150 ఎకరాలు ఉన్నాయని, ఆయా యాజమాన్యాలతో మాట్లాడామన్నారు. వాగుర్రు, వల్లమేడు, పామాంజిలోని రైతులను కలిసి భూములను ఇవ్వాలని కోరామని తహసీల్దారు చెప్పారు.


తూపిలిపాళెంలో హేచరీ వద్ద వివరాలు నమోదు చేసుకుంటున్న తహసీల్దారు


మంత్రి లోకేశ్ నుంచి అవార్డు అందుకుంటున్న పాలమంగళం విద్యార్థి

షైనింగ్ స్టార్ ఆశిష్

నారాయణవనం, మే 21(ఆంధ్రజ్యోతి): నారాయణవనం మండలం పాలమంగళం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎం.ఆశిష్ షైనింగ్ స్టార్ అవార్డును విద్యాశాఖామంత్రి నారా లోకేశ్ నుంచి అందుకున్నారు. పదో తరగతి చదువుతున్న ఇతడు సీడబ్ల్యూఎస్ఎన్ విభాగంలో జిల్లా స్థాయిలో 500కి 481 మార్కులు సాధించారు. బుధవారం అమరావతిలో ప్రభుత్వం నిర్వహించిన 'విద్యార్థులు షైనింగ్ స్టార్స్' కార్యక్రమంలో షైనింగ్ స్టార్ అవార్డును లోకేశ్ నుంచి అందుకున్నారు. ఆశిష్‌ను, అతడి తల్లిదండ్రులు ఆనంద్, ఉమాదేవిని మంత్రి అభినందించారు.

పిడుగుపాటుకు మహిళ మృతి


చుక్కమ్మ (ఫైల్‌ఫొటో)

కేవీబీపురం, మే 21(ఆంధ్రజ్యోతి): కేవీబీపురం మండలంలో పిడుగుపాటుకు గురై ఓ గిరిజన మహిళ మృతిచెందింది. ఆదరం గ్రామశివారులోని మామిడితోటకు రాజా, చుక్కమ్మ(25) దంపతులు, ముగ్గురు పిల్లలతో కలిసి కాపలాగా ఉంటున్నారు. మంగళవారం రాత్రి ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. ఆ సమయంలో బయట ఉన్న వస్తువులను ఇంట్లోకి తెచ్చేందుకు చుక్కమ్మ వెళ్లగా పిడుగు పడటంతో అక్కడికక్కడే ఆమె మరణించింది. తహసీల్దారు మునిరత్నంరెడ్డి బుధవారం ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

తుడా అభివృద్ధికి కృషి చేస్తా

- చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన డాలర్స్ దివాకర్ రెడ్డి


బాధ్యతలు చేపడుతున్న దివాకర్‌రెడ్డి

తిరుపతి, మే21 (ఆంధ్రజ్యోతి): తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) చైర్మన్‌గా డాలర్స్ దివాకర్ రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. తుడా కార్యాలయంలో వీసీ మౌర్య కార్యదర్శి డాక్టర్ శ్రీకాంత్ బాబు సమక్షంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. సాయంత్రం పెరుమాళ్లపల్లె నుంచి ద్విచక్రవాహనాల్లో ర్యాలీగా వచ్చారు. టౌన్ క్లబ్ కూడలి నుంచి ఓపెన్ టాప్ వాహనంపై ర్యాలీగా ఇందిరాప్రియదర్శిని కూరగాయల మార్కెట్ ఎదురుగా ఏర్పాటుచేసిన వేదికవద్దకు చేరుకున్నారు. ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, బొజ్జల సుధీర్ రెడ్డి, మురళీకృష్ణ, విజయశ్రీ, కురుగొండ్ల రామకృష్ణ, సునీల్ కుమార్, టీటీడీ సభ్యురాలు పనబాక లక్ష్మి, మాజీ మంత్రి పరసా రత్నం తదితరులు పాల్గొని డాలర్స్ దివాకర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. గత ఐదేళ్లలో తుడాను తుడిచిపెట్టిన చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుటుంబ సభ్యులపై వేగవంతంగా చర్యలు తీసుకునేందుకు దివాకర్ కృషిచేయాలన్నారు. అనంతరం తుడా చైర్మన్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్ ఇచ్చిన బాధ్యతకు చెడ్డపేరు తీసుకురానని చెప్పారు. భగవంతుడి సాక్షిగా తుడాలో తప్పుచేయనన్నారు. దుష్టుడు, దుర్మార్గుల పాలన నుంచి తుడా విముక్తి అయిందన్నారు. తనను అవమానించిన చోటే తిరిగి చైర్మన్‌గా వచ్చానన్నారు. డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ పరిచయకర్తగా వ్యవహరించిన ఈకార్యక్రమంలో కూటమి నాయకులు నరసింహ యాదవ్, డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, మబ్బు దేవనారాయణ రెడ్డి, కోలా ఆనంద్, దయాకర్ రెడ్డి, శ్రీధర్ వర్మ, రుద్రకోటి సదాశివం, పులుగోరు మురళీకృష్ణారెడ్డి, ఊట్ల సురేంద్ర నాయుడు, అన్నా అనిత, కుమారమ్మ, పుష్పావతి తదితరులు పాల్గొన్నారు.

|| యోగాతో ఆరోగ్యం ||



తిరుపతి (విశ్వవిద్యాలయాలు/క్రీడలు), మే 21 (ఆంధ్రజ్యోతి): యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకుంటే మానసిక, శారీరక ఆరోగ్యానికి దోహదపడుతుందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అన్నారు. యోగాంధ్ర-2025 కార్యక్రమంలో భాగంగా పద్మావతి మహిళా యూనివర్సిటీలోని మల్టీపర్పస్ ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో బుధవారం ఉదయం యోగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. యోగా మాస్టర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలసి 45 నిమిషాలు యోగాసనాలు వేశారు. యోగాకు గంట సమయం కేటాయిస్తే అనారోగ్యానికి దూరంగా ఉండొచ్చన్నారు. దీనిపై అధికారులు విస్తృత ప్రచారం ప్రచారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, గ్రీనరీ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ సుగుణమ్మ, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, మహిళా వర్సిటీ వీసీ ఉమా, రిజిస్ట్రార్ రజని, డీఆర్వో నరసింహులు, కార్పొరేషన్ అదనపు కమిషనర్ చరణ్‌తేజ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పలమనేరు చేరుకున్న కుంకీలు


పలమనేరు చేరిన కుంకీ

పలమనేరు, మే 21 (ఆంధ్రజ్యోతి) : చిత్తూరు జిల్లాలో మద గజాలను కట్టడి చేసేందుకు కర్ణాటక నుంచి బయల్దేరిన 4కుంకీ ఏనుగులు బుధవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో పలమనేరు చేరుకొన్నాయి.ఒక్కో ఏనుగును ఒక్కో లారీలో తీసుకు వచ్చారు. పలమనేరు చేరుకొన్న కుంకీ ఏనుగులను ముసలిమడుగు వద్ద సిద్ధం చేసిన ఎలిఫెంట్ క్యాంప్ ప్రాంతానికి తరలించారు. దాదాపు మూడున్నర దశాబ్దాలుగా ఏనుగులు జిల్లాలోని పలు ప్రాంతాల్లో పంటలను నాశనం చేయడంతో పాటు రైతులను సైతం తొక్కి చంపి వేసిన ఘటనలు అనేకం చోటు చేసుకున్నాయి.ఈ నేపథ్యంలో శిక్షణ పొందిన కుంకీ ఏనుగుల సాయంతో మదగజాల పనిబట్టాలని అటవీశాఖ నిర్ణయించింది. ఏనుగులు అటవీ సరిహద్దు గ్రామాల వద్దకు వచ్చినప్పుడు కుంకీ ఏనుగుల సాయంతో వాటిని లోతట్టుప్రాంతాలకు తరిమివేయడంతో పాటు ఒంటరిగా తిరుగుతున్న ఏనుగులను ఈ ఎలిఫెంట్ క్యాంప్ ప్రాంతానికి కుంకీల సాయంతో తీసుకువచ్చి బంధించేందుకు క్రాల్స్ కూడా సిద్ధం చేశారు.

టీచర్ల బదిలీ ప్రక్రియ మొదలైంది

చిత్తూరు సెంట్రల్, మే 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా విద్యాశాఖలో ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియ బుధవారం మొదలైనట్లు డీఈవో వరలక్ష్మి తెలిపారు. గ్రేడ్-2 హెచ్ఎం/ఉపాధ్యాయులతో పాటు ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, కార్పొరేషన్ యాజమాన్యాల్లోని ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చేపట్టినట్లు ఆమె తెలిపారు. 2025 మే 31 నాటికి 5/8యేళ్ల సర్వీసు ఒకేచోట పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులకు, హేతుబద్ధీకరణలో పోస్టు బదలాయింపునకు గురైన ఉపాధ్యాయులకు బదిలీ తప్పనిసరి అని తెలిపారు. ఒకే స్టేషన్‌లో కనీసం 2 సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు, హెచ్ఎంలు అభ్యర్థన బదిలీలకు అర్హులని ఆమె తెలిపారు.

బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ ఇలా...

కార్యాచరణ	హెచ్ఎం	ఎస్ఏ	ఎస్జీటీ
బదిలీకి దరఖాస్తు	21,22.05.2025	21-24.5.2025	21-27.5.2025
పరిశీలన	21,22.05.2025	21-25.5.2025	21-28.5.2025
సీనియారిటీ	24.5.2025	26,27.5.2025	21.5.2025
అభ్యంతరాల స్వీకరణ	25.5.2025	28.5.2025	28.5.2025-1.6.2025
అభ్యంతరాల పరిశీలన	26.5.2025	28,29.5.2025	28.5.2025-2.6.2025
తుది సీనియారిటీ జాబితా	27.5.2025	31.5.2025	6.6.2025
వెబ్ ఆప్షన్	28.5.2025	1.6.2025-2.6.2025	7.6.2025-10.6.2025
బదిలీ ఉత్తర్వులు	30.5.2025	4.6.2025	11.6.2025
పదోన్నతులు	-	30.5.2025(ఎస్ఏ-హెచ్ఎం)	5.6.205(ఎస్జీటీ-ఎస్ఏ)
పదోన్నతి ఉత్తర్వులు	-	31.5.2025	6.6.2025

తిరుమలలో హడలెత్తించిన డ్రోన్


బాలాజీనగర్‌పై ఎగురుతున్న డ్రోన్

తిరుమల, మే 21 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో బుధవారం ఓ డ్రోన్ స్థానికులను హడలెత్తించింది. స్థానికులు నివసించే బాలాజీనగర్‌పై డ్రోన్ ఎగరడంతో ఇక్కడి వారు ఆఆందోళన చెందారు. తిరుమలలో నిషేధమున్న క్రమంలో డ్రోన్ ఎలా ఎగురుతోంది అని ఆశ్చర్యంగా చూశారు. తిరుమలలో భద్రతను పెంచడంలో భాగంగా వరుసగా ఉన్నతస్థాయి భద్రతా సమీక్షలు జరుగుతున్న విషయం తెలిసిందే. సెక్యూరిటీ ఆడిట్‌లో భాగంగా బాలాజీనగర్, ఔటర్‌రింగ్ రోడ్డు వంటి ప్రాంతాల్లో భద్రతను పటిష్టం చేసేందుకు పోలీసు, విజిలెన్స్ విభాగాలే డ్రోన్ ఎగురవేసినట్టు తేలియడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా, భద్రతాధికారులు ఆగమ నిబంధనలను అనుసరించి శ్రీవారి ఆలయ ప్రాంతం కాకుండా ఇతర ప్రాంతాల్లో డ్రోన్ ద్వారా సర్వే చేశారు. భద్రతను ఎక్కడ పెంచాల్సిన అవసరముందనే అంశాలపై పరిశీలించారు.

నేడు తిరుమలలో హనుమజ్జయంతి వేడుకలు

తిరుమల, మే 21(ఆంధ్రజ్యోతి): తిరుమలలో గురువారం హనుమజ్జయంతి వేడుకలు జరగనున్నాయి. శ్రీవారి ఆలయానికి ఎదురుగా ఉన్న బేడి ఆంజనేయస్వామి ఆలయంతో పాటు కాలినడక మార్గంలోని ఏడోమైలు వద్ద ప్రసన్న ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అలాగే జపాలి హనుమాన్ ఆలయానికి టీటీడీ తరఫున పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే ఏర్పాట్లు పూర్తిచేశారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని బుధవారం ట్రాఫిక్ పోలీసులు పలు ఆంక్షలు విధించారు. జపాలికి వెళ్లాలనుకునే భక్తులు ఔటర్‌రింగ్‌లోని ఆక్టోపస్ భవనం సర్కిల్‌లోనే పార్కింగ్ చేసుకుని ఆర్టీసీ బస్సుల ద్వారా చేరుకోవాలని సూచించారు. ప్రైవేట్ వాహనాలను అనుమతించబోమని స్పష్టం చేశారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షకు 400మంది గైర్హాజరు

తిరుపతి(విద్య), మే 21(ఆంధ్రజ్యోతి): టెన్త్ సప్లిమెంటరీ పరీక్షకు బుధవారం 400 మంది గైర్హాజరైనట్లు డీఈవో కేవీఎన్ కుమార్ పేర్కొన్నారు. 1,054మందికిగాను 654మంది పరీక్ష రాశారని తెలిపారు. అలాగే ఓపెన్ టెన్త్ సప్లిమెంటరీ పరీక్షకు 269 మందికిగాను 228మంది హాజరవ్వగా 41మంది గైర్హాజరయ్యారని వెల్లడించారు. ఇంటర్మీడియట్ పరీక్షకు 47 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 20 పరీక్షా కేంద్రాలను పర్యవేక్షించామని తెలిపారు.

గుండె సర్జరీల పెంపునకు ఏర్పాట్లు చేయండి

పద్మావతి చిన్నపిల్లల హృదయాలయ అధికారులకు టీటీడీ ఈవో శ్యామలరావు సూచన


చిన్నారుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న టీటీడీ ఈవో

తిరుపతి(వైద్యం), మే 21(ఆంధ్రజ్యోతి): చిన్నారులను దైవసమానులుగా భావించి పద్మావతి చిన్నపిల్లల హృదయాలతో వైద్యసేవలు అందిస్తున్నామని టీటీడీ ఈవో శ్యామలరావు అన్నారు. ఈ ఆస్పత్రిని ఆయన బుధవారం తనిఖీ చేశారు. పలు ఐసీయూ వార్డులను, ఆపరేషన్ థియేటర్లను, ఓపీ విభాగాలను పరిశీలించారు. అనంతరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారుల తల్లిదండ్రులతో ఆయన మాట్లాడారు. అక్కడ అందుతున్న వైద్య సేవలు, సదుయాపాలను గురించి అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో సంతృప్తికరంగా సదుపాయాలు అందుతున్నాయని చిన్నారుల తల్లిదండ్రులు ఆయనకు వివరించారు. అనంతరం ఈవో ఆస్పత్రిలో అధికారులతో సమీక్షించారు. ఆస్పత్రిలో చిన్నారులకు చికిత్సలతోపాటు గుండె సర్జరీలను పెంచేందుకు వైద్య పరికరాలు, మౌలిక సదుపాయాలు, అత్యవసర మందుల సమకూర్చుకోవాలన్నారు. చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి భవన నిర్మాణ తాజా పరిస్థితిపై నివేదిక సమర్పించాలని సూచించారు. మెరుగైన వైద్యసేవలు అందించేందుకు చేపట్టాల్సిన ప్రణాళికలపై ఆయన అధికారులతో సమీక్షించారు. టీటీడీ జెఈవో వీరబ్రహ్మం, సీఈ సత్యనారాయణ, ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి, ఆర్ఎంవో భరత్ పాల్గొన్నారు.


ఆది, తమన్, అశ్విన్- సుగుణమ్మ-ఆర్కే రోజా, రవళి

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, మే 21(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని బుధవారం టాటా గ్రూప్స్ చైర్మన్ నటరాజన్ చంద్రశేఖర్ దర్శించుకున్నారు. ఇంకా సినీనటి రవళి, హీరోలు అశ్విన్, ఆది, సంగీత దర్శకుడు తమన్, మాజీ మంత్రి ఆర్కే రోజా, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ చైర్మన్ సుగుణమ్మ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు

●బంగారు,వెండి ఆభరణాల స్వాధీనం


మీడియాతో మాట్లాడుతున్న డీఎస్పీ ప్రసాద్

తిరుచానూరు, మే 21(ఆంధ్రజ్యోతి): అంతర్రాష్ట్ర దొంగను అరెస్టు చేసి బంగారు,వెండి ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తిరుచానూరు పోలీస్ స్టేషన్‌లో బుధవారం డీఎస్పీ ప్రసాద్ మీడియాకు వెల్లడించిన వివరాల మేరకు.. తిరుపతి రూరల్ మండలం కొత్తూరులో ఈ నెల 1న కుమార్‌రాజా ఇంట్లో దొంగ పట్టపగలు తలుపులు పగులగొట్టి బంగారు ఆభరణాలు, వెండి వస్తువులను అపహరించాడు. ఈ చోరీ ఘటనపై పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. ఈక్రమంలో బుధవారం ముండ్లపుడి వద్ద బెంగళూరులోని బనసంకరికి చెందిన అంతర్రాష్ట్ర దొంగ నాగరాజును అరెస్టు చేశారు. నిందితుడి నుంచి 168 గ్రాముల బంగారు ఆభరణాలు, 192 గ్రాముల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. ఇతడిపై కర్ణాటకలో పలు పోలీసుస్టేషన్లలో కేసులున్నాయని డీఎస్పీ తెలిపారు. నాగరాజు అరెస్ట్‌లో కీలకంగా వ్యవహరించిన సీఐ సునీల్‌కుమార్, ఎస్ఐలు సాయినాథ్ చౌదరి, అరుణ, జగన్నాథరెడ్డి, పోలీసులను డీఎస్పీ అభినందించారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



తిరుపతి అర్బన్, మే 21(ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్స్ జిల్లా సంఘం ఆధ్వర్యంలో బుధవారం సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఏఎస్వో కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేష్‌రెడ్డి మాట్లాడుతూ తమ కుటుంబాల్లో చీకట్లు నింపిన ఎండీయూ వాహనాల వ్యవస్థను రద్దు చేయడం హర్షణీయమన్నారు. రేషన్ డీలర్స్ వ్యవస్థ బలోపేతానికి ఆయన చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో రేషన్‌డీలర్స్ అసోసియేషన్ ప్రతినిధులు చంద్రశేఖర్‌రెడ్డి, గుత్తా కోటేశ్వరనాయుడు, హేమలత, సాల్మన్‌రాజు, శ్రీనాథ్, పుష్పాంజలి, ప్రమీలమ్మ, వెంకటేష్, జుబేద, అనీఫ్, తాతారావు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా జేఎల్స్ బదిలీలు : ఆర్జేడీ


ఆర్జేడీ శ్రీనివాసులు

చిత్తూరు సెంట్రల్, మే 21 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ విద్యలో అధ్యాపకుల బదిలీలు పారదర్శకంగా చేపట్టనున్నట్లు చిత్తూరు డీఐఈవో, కడప ఆర్జేడీ శ్రీనివాసులు వెల్లడించారు.బుధవారం డీఐఈవో కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాయలసీమ రీజియన్ పరిధిలో 68 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయని చెప్పారు.ఇందులో 400 మంది టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులు, 68మంది ప్రిన్సిపాళ్లు ఉన్నారని తెలిపారు. బదిలీలకు సంబంధించి స్పష్టమైన విధివిధానాలు రాగానే బదిలీ ప్రక్రియ చేపట్టి నెలాఖరులోపు పూర్తి చేస్తామని చెప్పారు. ఏప్రిల్ 7 నుంచి జూన్ ఒకటి వరకు జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలకు మొదటి దశ అడ్మిషన్ల ప్రక్రియవుంటుందని, జూన్ రెండవ తేదీ నుంచి రెండో దశ అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిపారు.ప్రభుత్వ యాజమాన్య కళాశాలల విద్యార్థులకు సెకండియర్‌కు సంబంధించి స్టడీ మెటీరియల్ పోటీ పరీక్షలకు సంబంధించిన తెలుగు బుక్‌లెట్స్ వచ్చాయన్నారు. జూన్ 2న కళాశాలలు ప్రారంభం కాగానే సెకండియర్ విద్యార్థులకు అందించనున్నట్లు తెలిపారు. కాగా ఫస్టియర్, సెకండియర్‌కు సంబంధించి టెక్స్‌బుక్స్ రావాల్సి ఉందని చెప్పారు. ఇప్పటికే ఇంటర్మీడియట్ అడ్వాన్డ్ సప్లిమెంటరీ పరీక్షలు ముగిసిన క్రమంలో ఈనెల 19 నుంచి తిరుపతిలో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించి జవాబు పత్రాల మూల్యాంకనం జరుగుతుందని చెప్పారు.

అమ్మవారి ఆలయానికి భక్తుల తాకిడి

తిరుచానూరు, మే 21(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారి దర్శనానికి బుదవారం భక్తులు పోటెత్తారు. వేసవి సెలవులు కావడంతో అమ్మవారి దర్శనానికి అన్ని రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు వచ్చారు. సర్వదర్శనంలో అమ్మవారిని దర్శించుకోవడానికి సుమారు గంట పట్టిందని భక్తులు తెలిపారు. లడ్డూకౌంటర్లు, దర్శన క్యూలైన్లలో రద్దీ కనిపించింది.



సింహ వాహనంపై కామాక్షితాయి



బుచ్చిరెడ్డిపాళెం, మే 21 (ఆంధ్రజ్యోతి) : జొన్నవాడలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం కామాక్షితాయి సింహ వాహనంపై కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక పుష్పాలంకరణ, మంగళ వాయిద్యాలు, పండితుల వేదమంత్రాల నడుమ అమ్మవారి ఊరేగింపు భక్తులను ఆకట్టుకుంది. ఉదయం తిరుచా ఉత్సవంలో గంగా, కామాక్షితాయి సమేతంగా మల్లికార్జునస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తలకు నిత్యాన్నదాన సదనంలో ప్రత్యేక భోజన వసతి ఏర్పాటు చేశారు. భక్తులకు ఉచిత ప్రసాదాలు పంపిణీ చేశారు. ఉత్సవ కమిటీ చైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, ఈఓ శ్రీనివాసులు రెడ్డి, సభ్యులు, సర్పంచు పెంచలయ్య పాల్గొన్నారు.

రేపు నెల్లూరు పార్లమెంటు స్థాయి మహానాడు

● ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి ఆనం, ఎంపీ, ఎమ్మెల్యేలు


నెల్లూరు పార్లమెంటు స్థాయి మహానాడు కార్యక్రమ ఏర్పాట్లపై సమీక్షిస్తున్న టీడీపీ ముఖ్యనేతలు

నెల్లూరు, మే 21 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంటు స్థాయి మహానాడు కార్యక్రమం ఈ నెల 23వ తేదీన జరగనుంది. నగర శివార్లలోని కనుపర్తిపాడులో ఉన్న వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరగనున్న ఈ కార్యక్రమ ఏర్పాట్లను ఆ పార్టీ ముఖ్య నేతలు బుధవారం పరిశీలించారు. కార్యక్రమం అజెండా ఎలా ఉండాలి? వచ్చే నాయకులు, కార్యకర్తలకు వసతుల కల్పన వంటి అంశాలపై చర్చించారు. అలానే జిల్లాస్థాయిలో చేయాల్సిన తీర్మానాలపై కూడా మాట్లాడుకున్నారు. ఏర్పాట్లను పరిశీలించిన వారిలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, దగ్గుమాటి వెంకటకృష్ణారెడ్డి, నెల్లూరు పార్లమెంటు అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు. టీడీపీ ఆనవాయితీ ప్రకారం రాష్ట్ర మహానాడుకు ముందు నియోజకవర్గ, పార్లమెంటు స్థాయి మినీ మహానాడు కార్యక్రమాలను నిర్వహిస్తుంటారు. నియోజకవర్గ స్థాయి తీర్మానాలను పార్లమెంటు స్థాయిలోనూ, పార్లమెంటు స్థాయి తీర్మానాలను రాష్ట్రస్థాయి మహానాడు కార్యక్రమంలో ప్రవేశపెడతారు. ఈ నెల 27, 28, 29వ తేదీల్లో కడప వేదికగా మహానాడు జరగనుంది. ఆ క్రమంలో ఇప్పటికే జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు సంబంధించి మినీ మహానాడు కార్యక్రమాలు పూర్తయ్యాయి. ఇక మిగిలిన నెల్లూరు పార్లమెంటు స్థాయి మహానాడు కార్యక్రమం శుక్రవారం జరగనుంది.

డబుల్ హార్టీ

ఉద్యాన పంటలు సాగుచేస్తున్న రైతులకు ప్రభుత్వం ఊరట కల్పించే శుభవార్తను వినిపించింది. ఇప్పటికే వివిధ పంటలకు అందిస్తున్న రాయితీలను రెట్టింపు చేసింది. గత ప్రభుత్వ హయాంలో పెట్టుబడులు పెట్టి రాయితీల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగి విసిగిపోయిన ఉద్యాన రైతులకు ప్రస్తుత కూటమి ప్రభుత్వం అందిస్తున్న చేయూత వారిలో ఆర్థిక భరోసాను నింపుతోంది.


డ్రాగన్ ఫ్రూట్ పంటను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారి సుబ్బారెడ్డి (ఫైల్)


మామిడితోట

- ఉద్యాన రైతులకు రాయితీ రెట్టింపు
- డ్రాగన్ ఫ్రూట్ సాగుకు భారీగా పెరుగుదల
- ఒకేసారి రూ.50వేల నుంచి రూ.1,82లక్షలకు పెంపు
- పంటల ప్రోత్సాహానికి ప్రభుత్వ పథకాలు

నెల్లూరు (వ్యవసాయం), మే 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సుమారు 75వేల ఎకరాల్లో వివిధ రకాల ఉద్యాన పంటలు (హార్టీ కల్చర్) సాగవుతున్నాయి. ముఖ్యంగా మామిడి, నిమ్మ, డ్రాగన్ ఫ్రూట్, సపోటా, బొప్పాయి, అరటి, నేరేడు, జామ, ఉసిరి వంటి పంటలను రైతులు పండిస్తున్నారు. ప్రతి ఏటా దాదాపుగా 4,51,516 మెట్రిక్ టన్నుల దిగుబడులు వస్తున్నాయి. ఈ క్రమంలో ఉద్యాన పంటలను ప్రోత్సహించేందుకు కూటమి ప్రభుత్వం ఇప్పటికే 40 నుంచి 90శాతం వరకు రాయితీలను అందిస్తోంది. అయితే తాజాగా ఆయా రాయితీలను రెట్టింపు చేస్తున్నట్లు ప్రకటించింది. 2025-26 సంవత్సరానికిగాను లక్ష్యాలను కూడా నిర్దేశించింది. దాదాపుగా 5375 ఎకరాల్లో వివిధ రకాల ఉద్యాన పంటలు సాగు చేసేలా జిల్లా అధికారులకు ఆదేశాలు వచ్చాయి. అంతేకాకుండా జిల్లాలో దాదాపు గా 82వేల ఎక రాలు ఎలాంటి పంటలు సాగు చేయకుండా భూమి ఖాళీగా ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. దీంతో ఆయా పొలాల రైతులకు ఉద్యాన పంటలపై అవగాహన కల్పించి సాగుచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. నీటి వసతి ఉన్న ప్రతి పొలంలో పంటలు సాగయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. నర్సరీల నుంచి నాణ్యమైన మొక్కలు సేకరించడంతో పాటు సాగు పద్ధతులపై రైతులకు శిక్షణ తరగతులు కూడా నిర్వహించనున్నారు.

ఎంఐడీహెచ్ పథకంతో రాయితీ

సమీకృత ఉద్యాన అభివృద్ధి మిషన్ (ఎంఐడీహెచ్) పథకం ద్వారా ఉద్యాన రైతులకు, కొత్త ఉద్యాన పంటల అభివృద్ధికి ప్రభుత్వం రాయితీలు కల్పిస్తోంది. ఈ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం, కేంద్ర ప్రభుత్వం 60శాతం వాటాగా రాయితీలు అమలు చేయనున్నాయి. ముఖ్యంగా కొత్త తోటల విస్తరణ పథకం, పాత తోటల పునరుద్ధరణ పథకం, నీటి కుంటలు, పాలీహౌస్, షేడ్ నెట్, మల్చింగ్ రక్షణాత్మక సాగుతోపాటు కోత అనంతరం యాజమాన్య పథకం, ఉద్యాన యాంత్రీకరణ పథకాల్లో భాగంగా చిన్న ట్రాక్టర్లు, పవర్ టిల్లర్లు, స్ప్రేయర్లు వంటివి ఇవ్వనుంది.

యాంత్రీకరణ పథకం

ఉద్యాన యాంత్రీకరణ పథకంలో భాగంగా ఉద్యాన రైతులకు భారీ రాయితీలు అందిస్తోంది. మినీ ట్రాక్టర్‌కు గతంలో రూ.75వేలు రాయితీ ఉండగా ప్రస్తుతం రూ.1.96లక్షలకు పెరిగింది. అదేవిధంగా పవర్ టిల్లర్‌కు రూ.40వేల నుంచి రూ.60వేలు ఇస్తుండగా తాజాగా రూ.80వేల నుంచి రూ.లక్షలకు పెంచింది. ట్రాక్టర్ ఆపరేటెడ్ స్ప్రేయర్లకు గతంలో ఎలాంటి రాయితీ లేదు. నూతన మార్గదర్శకాల ప్రకారం రూ.33వేల నుంచి రూ.1.10లక్షల వరకు రాయితీ ఇచ్చింది.

- నూతన తోటల విస్తరణ పథకంలో భాగంగా హెక్టారు మామిడి తోటకు మూడేళ్లకు గాను గతంలో రూ.13,300 నుంచి రూ.16,400 వరకు రాయితీ అందేది. నూతన మార్గదర్శకాల ప్రకారం ఆ మొత్తం రూ.35,320 నుంచి రూ.54,560 వరకు పెరిగింది.
- నిమ్మ పంటకు మూడేళ్లకుగాను రూ.16,004 నుంచి రూ.36,402కు పెరిగింది.
- డ్రాగన్ ఫ్రూట్‌కు భారీగా ప్రోత్సాహకాలను ప్రభుత్వం ప్రకటించింది. గతంలో హెక్టారుకు రూ.50వేలు రాయితీ ఇస్తుండగా తాజాగా దాన్ని రూ.1,82లక్షలకు పెంచేసింది. దీంతో ఈ పంటను సాగు చేస్తున్న రైతులకు ఎంతో లాభం చేకూరనుంది.
- సంకర జాతి కూరగాయలకు రూ.20వేల నుంచి రూ.24వేలు...
- విడిపూల సాగుకు రూ.16వేల నుంచి రూ.20 వేలకు పెంచింది.

● రాయితీ ఇలా..

- నేరేడు, బొప్పాయి, అరటి పంటలకు మాత్రం రాయితీ పెంచలేదు.
- పాత తోటల పునరుద్ధరణ పథకం కింద హెక్టారుకు రాయితీని రూ.17500 నుంచి రూ.24వేలకు పెంచింది.
- రక్షణాత్మక సాగు కింద పాలీ హౌస్‌కు రూ.42.20 లక్షల నుంచి రూ.52.50లక్షల వరకు పెంపు చేసింది.
- మల్చింగ్‌కు రూ.16వేల నుంచి రూ.20వేల వరకు పెరిగింది.
- కోత అనంతరం యాజమాన్య పథకం కింద ఫార్మ్ గేట్ ప్యాక్ హౌస్‌కు గతంలో రాయితీ ఇవ్వలేదు. కానీ ఈ ఆర్థిక సంవత్సరం నుంచి రూ.12.50లక్షలు రాయితీ ప్రకటించింది.
- ప్రైమరీ మినిమల్ ప్రాసెసింగ్ యూనిట్‌కు రూ.10లక్షల నుంచి రూ.12.25లక్షలకు, సోలార్ పవర్ కోల్డ్ రూంకు రూ.5.25లక్షల నుంచి రూ.18.20లక్షలకు పెంచింది.

రాయితీలు సద్వినియోగం చేసుకోవాలి

ఉద్యాన రైతులకు అందుతున్న పంటల రాయితీలను ప్రభుత్వం రెట్టింపు చేసింది. 2025-26 సంవత్సరానికి 5375 ఎకరాల్లో ఉద్యాన పంటల పెంచేలా ప్రభుత్వం లక్ష్యాలను నిర్దేశించింది. ఎలాంటి పంటలు సాగు చేయని 82 వేల ఎకరాలు ఉన్నాయి. సాగునీరు అందుబాటులో ఉన్న భూముల్లో ఉద్యాన పంటలు సాగుచేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశాలు వచ్చాయి. రైతులకు అవగాహన కల్పించి ఉద్యాన పంటల విస్తీర్ణం పెంచేందుకు కృషి చేస్తున్నాం. గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలను సంప్రదిస్తే పూర్తి సమాచారం అందిస్తారు.

- సుబ్బారెడ్డి, జిల్లా ఉద్యానశాఖ అధికారి

టీడీపీకి కార్యకర్తలే ప్రాణం: కొండేపాటి



మినీమహానాడు వేదికపై ఎమ్మెల్యేలు విజయశ్రీ, పాశిం సునీల్ కుమార్, కురుగొండ్ల రామకృష్ణ, మాజీ ఎంపీ నెలవల, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నరసింహయాదవ్, పారిశ్రామికవేత్త గంగాప్రసాద్, రఫీ అభివాదం

నాయుడుపేట, మే 21 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే ప్రాణమని, వారి నిరంతర కృషితో అధికారంలోకి రాగలిగామని ప్రముఖ పారిశ్రామికవేత్త, టీడీపీ సీనియర్ నాయకులు కొండేపాటి గంగాప్రసాద్ అన్నారు. బుధవారం నాయుడుపేటలో మినీ మహానాడు నిర్వహించారు. ముందుగా స్థానిక గాంధీమందిరం సెంటర్ నుంచి ఎమ్మెల్యే డాక్టర్ విజయశ్రీ, నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, టీడీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ రఫీ, నెలవల రాజేష్ ఆధ్వర్యంలో మినీ మహానాడు నిర్వహించే కేకే కళ్యాణ సదన్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో గంగాప్రసాద్ మాట్లాడుతూ టీడీపీలో చిన్నచిన్న మనస్పర్థలు ఉన్నప్పటికీ కష్టపడినవారికి అండగా నిలుస్తామన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తల కృషితో భారీ మెజారిటీతో గెలుపొందగలిగామన్నారు. అనంతరం సూళ్లూరుపేట నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, తీసుకోవాల్సిన చర్యలపై తీర్మానం చేశారు. ముఖ్య అతిథులుగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు నరసింహయాదవ్, గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్, వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి హాజరయ్యారు. సమావేశంలో వివిధ మండలాల అధ్యక్షులు అరవపెరిమిడి చంద్రారెడ్డి, విజయల్ నాయుడు, వేమసాని శ్రీనివాసులు నాయుడు, సంచి కృష్ణయ్య, కొక్కు శంకరయ్య, కామిరెడ్డి మురళీరెడ్డి, సూళ్లూరుపేట పట్టణ అధ్యక్షుడు ఆకుతోట రమేష్, నాయకులు నానాబాల సుబ్బారావు, మైలారి రాజశేఖర్, జీవీఆర్ నాయుడు, గంగాప్రసాద్, పొట్లపూడి రాజేష్, ఖలీల్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

మినీ మహానాడులో చేసిన తీర్మానాలు

- వైసీపీ ప్రభుత్వంలో ఇబ్బందులకు గురైన టీడీపీ శ్రేణులకు న్యాయం చేయడం
- చెంగాళమ్మ గుడివద్ద బ్రిడ్జి నిర్మాణం
- తెలుగుగంగ బ్రాంచ్ కాలువల అభివృద్ధి
- స్వర్ణముఖినదికి 2 టీఎంసీల నీటి విడుదల
- పెళ్లకూరులో చెంబేడు రిజర్వాయర్ నిర్మాణం
- పెళ్లకూరులో గురుకుల పాఠశాల ఏర్పాటు
- ఓజిలి మండలం పున్నేపల్లిలో ఉన్నత పాఠశాల
- తడలో మత్స్యకారులకు శిక్షణ తరగతులు
- స్వర్ణముఖి, కాళంగి నదులకు సర్ఫేస్ చెక్‌డ్యామ్‌లు
- స్వర్ణముఖి కాజ్‌వే స్థానంలో బ్రిడ్జి, రోడ్డు ఏర్పాటు
- మేనకూరు, శ్రీసిటీ సెజ్‌లకు అనుసంధానంగా స్కిల్ డవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు
- పులికాట్ ముఖద్వారాల పూడికతీత
- నెర్రికాలువ పనులు పూర్తి చేయడం
- వేనాడు - కొరిడి రోడ్డు నిర్మాణం
- నాయుడుపేటలో ఆటోనగర్ ఏర్పాటు
- అయ్యప్పస్వామి పూజలకు, ఈద్గాలకు స్థల కేటాయింపు

పల్లెలకు ఆర్టీసీ బస్సులేవీ?

మండల సమావేశంలో ప్రజాప్రతినిధుల ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అనిల్ రెడ్డి

సూళ్లూరుపేట, మే 21 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులు సక్రమంగా నడపటం లేదని, ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా ఆర్టీసీ అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అల్లూరు అనిల్ రెడ్డి అధ్యక్షతన మండల సమావేశం జరిగింది. కొరిడి సర్పంచు వినోద్ మాట్లాడుతూ తమ గ్రామానికి వచ్చే బస్సు ఒక ట్రిప్పును ఎటువంటి సమాచారం లేకుండా రద్దు చేశారన్నారు. దీంతో ప్రయాణికులు దాదాపు ఐదు గంటల సేపు బస్సు కోసం పడిగాపులు కాయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. డిపో అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. అదేవిధంగా మంగళంపాడు, ఉచ్చూరు, దామానెల్లూరు మార్గంలో వెళ్లే బస్సు ఒకరోజు వస్తే రెండు రోజులు రావడం లేదని సర్పంచు రుక్మిణి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని గ్రీవెన్స్‌లో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని, ఆయా గ్రామాలకు ప్రతిరోజు బస్సు నడిపేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చెప్పినా ఆర్టీసీ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని బస్సులు నడిపేలా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ అనిల్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. వెంటనే ఎంపీపీ స్పందించి సమావేశానికి చ్చిన ఆర్టీసీ సూపర్‌వైజర్ బాలాజీతో మాట్లాడి అన్ని గ్రామాలకు బస్సులు నడిపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామాల్లో ప్రజా సమస్యలపై అధికారులు దృష్టిపెట్టాలని, ఏవైన సమస్యలుంటే సమన్వయంతో పరిష్కరించాలన్నారు. ముందుగా దేశరక్షణ కోసం సరిహద్దుల్లో అమరులైన వీర జవాన్లకు సంతాపం సూచకంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో మురళీకృష్ణ, సీడీపీవో శారదాంబ, పీఆర్, ఇరిగేషన్, గృహ నిర్మాణ శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు నందకిషోర్, రమేష్, సత్యనారాయణ, భవాని, ఏపీవో లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసుల్లో ఇద్దరు నిందితుల అరెస్టు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ నాగబాబు

వాకాడు, మే 21 (ఆంధ్రజ్యోతి): చోరీలకు పాల్పడుతున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ నాగబాబు తెలిపిన వివరాల మేరకు... పోలీసులు దుగరాజపట్నం వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించారు. వారు వాకాడు మండలానికి చెందిన కొండూరుపాళెం చిరు, నెల్లూరులో నివాసం ఉంటున్న బందిల శీనుగా తెలిసింది. వీరిరువురు గతంలో కోట మండలంలో దొంగతనాలకు పాల్పడ్డారు. అలాగే ఏప్రిల్ 27న వాకాడు స్వర్ణముఖినది సమీపంలో ఉన్న ఓ ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. అదేవిధంగా చిట్టమూరు మండలంలోని చిట్టమూరులో అదేరోజున చోరీకి పాల్పడినట్లు విచారణలో అంగీకరించారు. వారి వద్ద నుంచి రూ.40 వేల విలువైన బంగారు నగలు రికవరీ చేశారు. ఇద్దరినీ కోటలోని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించడంతో నెల్లూరు జైలుకు తరలించినట్లు ఎస్ఐ చెప్పారు.

చిన్నపాటి గాలికే...

నేలవాలిన డంపింగ్ యార్డ్ రేకులు



తడ, మే 21 (ఆంధ్రజ్యోతి): తడ మండలంలోని బోడిలింగాలపాడు వద్ద కరిపేటి కాలువకు సమీపంలో జాతీయ రహదారికి ఆనుకొని డంపింగ్ యార్డ్ ఉంది. చెత్త, వ్యర్థాలు కుళ్లిపోయి దుర్గంధం వెదజల్లుతుండేది. నెల రోజుల క్రితం కలెక్టర్ వెంకటేశ్వర్ తడకు వెళ్తుండగా డంపింగ్ యార్డ్‌ను చూసి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, వీలుకాకపోతే కనీసం ప్రహరీ నిర్మించాలని స్థానిక అధికారులను ఆదేశించారు. దీంతో పంచాయతీ అధికారులు ఆఘమేఘాల మీద సుమారు లక్ష రూపాయల వ్యయం చేసి రేకులతో ప్రహరీ ఏర్పాటు చేశారు. అయితే రెండు రోజుల క్రితం వీచిన చిన్నపాటి గాలికి ఆ రేకులన్నీ నేలపై వాలిపోయాయి.

సీఎం చంద్రబాబును కలిసిన టీడీపీ నేతలు



సీఎం చంద్రబాబు నాయుడితో చిట్టమూరు టీడీపీ నాయకులు

చిట్టమూరు, మే 21(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని చిట్టమూరు టీడీపీ నాయకులు బుధవారం అమరావతిలో మర్యాద పూర్వకంగా కలిశారు. మండల అధ్యక్షుడు గణపర్తి కిషోర్ నాయుడు, గోపాల్ నాయుడు, బాబు నాయుడు సీఎంను కలిసిన వారిలో ఉన్నారు.

తుడా చైర్మన్‌కు ఎమ్మెల్యే పాశిం అభినందనలు

గూడూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో బుధవారం తుడా చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన దివాకర్‌రెడ్డికి ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అభినందనలు తెలిపారు. అలాగే పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్, తదితరులు దివాకర్‌రెడ్డికి అభినందనలు తెలిపారు.



దివాకర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్, కొండేపాటి గంగాప్రసాద్

గూడూరులో చిరుజల్లులు

గూడూరు అర్బన్, మే 21 (ఆంధ్రజ్యోతి): గూడూరు పట్టణంలో బుధవారం మధ్యాహ్నం చిరుజల్లులు కురిశాయి. ఉదయం నుంచి ఎండ తీవ్రత ఉన్నా మధ్యాహ్నం నుంచి ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు కురిశాయి. వాతావరణం కొంత మేర చల్లబడడంతో ప్రజలు ఉక్కపోత నుంచి ఉపశమనం పొందారు.

ఆహారపొట్లాల పంపిణీ

గూడూరు అర్బన్, మే 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు కూడళ్ల వద్ద పేదలకు బుధవారం రెడ్ సంస్థ ఆధ్వర్యంలో భవానీప్రసాద్ దాతృత్వంతో ఆహార పొట్లాలను అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాసాచారి, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

హనుమజ్జయంతికి సన్నాహాలు

గూడూరు అర్బన్, మే 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురువారం హనుమజ్జయంతి పూజలు నిర్వహించేందుకు పలు ఆలయాలను ముస్తాబు చేశారు. స్థానిక కోనేటిమిట్టలోని రామాంజనేయస్వామి ఆలయం, మాళవ్యానగర్ ప్రాంతంలోని శ్రీరామరక్ష కుటీరం, సిరామిక్ రోడ్డులోని ఆంజనేయస్వామి ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

వీఆర్వోల నిరసన



ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న వీఆర్వోలు

సూళ్లూరుపేట, మే 21 (ఆంధ్రజ్యోతి): సచివాలయాల రేషనలైజేషన్‌తో తీసుకొచ్చిన క్లస్టర్ విధానంతో తమను మిగులు సిబ్బందిగా చూపించడం అన్యాయమని బుధవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట వీర్వోలు నిరసన తెలిపారు. జీవో నెం 4 ప్రకారం దాదాపు 7500 మంది వీఆర్వోలను మిగులు సిబ్బందిగా చూపుతున్నారని, ఈ విషయాన్ని ప్రభుత్వం పునరాలోచించాలని రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘ కార్యవర్గ సభ్యుడు మనోజ్‌కుమార్ కోరారు. అనంతరం ఏవో రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వీఆర్వోల సంఘ నాయకులు రామకృష్ణ, భాస్కర్, కరణం బాబు, బార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

జీవో 4ను రద్దు చేయాలి

బాలాయపల్లి, మే21(ఆంధ్రజ్యోతి) రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 4ను రద్దు చేయాలని వీఆర్వోలు డిమాండ్ చేశారు. బుధవారం వారు తహసీల్దార్ విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. జీవో 4ను ద్వారా సచివాలయాలను రేషనలైజేషన్ చేసి వీఆర్వోలను మిగులు సిబ్బందిగా చూపడం సరికాదన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు ఆదిశేషయ్య, జయశంకర్ రెడ్డి, ఈశ్వర్‌రాజు, కిష్టయ్య, మేకలయ్య, రాజేంద్ర, మోహన్, పెంచలయ్య పాల్గొన్నారు.

హనుమయ్య వీడియో ఆవిష్కరణ



హనుమయ్య వీడియో గీతాన్ని ఆవిష్కరిస్తున్న వీహెచ్‌పీ నేతలు

గూడూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మ పరిరక్షణకు విజయదుర్గాదేవి ఉపపీఠం నిర్వాహకుడు కోట సునీల్‌కుమార్ చేస్తున్న కృషి అభినందనీయమని వీహెచ్‌పీ నాయకుడు మురళీరెడ్డి అన్నారు. సునీల్‌కుమార్ రచించి, ఆలపించిన హను మయ్య వీడియో గీతాన్ని బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మురళీరెడ్డి మాట్లాడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపడుతూ హిందూ ధర్మ వ్యాప్తికి సునీల్‌కుమార్ చేస్తున్న కార్యక్రమాలు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయన్నారు. కార్యక్రమంలో కోట సునీల్‌కుమార్, ప్రకాశం, పేటేటి చంద్రనీల్, మనోజ్‌కుమార్, మల్లికార్జున, జనార్దన్ పాల్గొన్నారు.

ఆర్టీసీలో ఆన్‌కాల్ డ్రైవర్లకు ఆహ్వానం

తిరుపతి(ఆర్టీసీ), మే 21(ఆంధ్రజ్యోతి): మంగళం ఆర్టీసీ డిపో పరిధిలో ఆన్‌కాల్ డ్రైవర్లుగా పనిచేయడానికి ఆహ్వానం పలుకుతున్నట్లు మేనేజర్ భాస్కర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హెవీ ప్యాసింజర్ డ్రైవింగ్ లైసెన్స్ పొంది 18 నెలలు పూర్తయి ఉండాలని, అర్హత ఉన్న వారు గురువారం ఉదయం 10 గంటలకు మంగళం డిపో అధికారులను సంప్రదించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9177150347ను సంప్రదించాలని కోరారు.

పోలీసుల అదుపులో సెల్‌ఫోన్ దొంగలు

తిరుపతి(నేరవిభాగం), మే 21(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని వివిధ ప్రాంతాల్లో సెల్‌ఫోన్ చోరీలకు పాల్పడుతున్న 10మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 30 మొబైల్ ఫోన్లు రికవరీ చేసినట్లు తెలిసింది. ఇటీవల విష్ణునివాసం, శ్రీనివాసం వసతి సముదాయాల్లో భక్తుల నగలు, నగదు, మొబైల్ ఫోన్లు అపహరణకు గురవుతున్న విషయం తెలిసిందే. స్పందించిన డీఎస్పీ భక్తవత్సలం దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టారు. అనుమానాస్పదంగా కనిపించిన 10మందిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.

వ్యాధులపై వినూత్న అవగాహన

తిరుపతి(వైద్యం), మే 21(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్, క్షయ వంటి వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖ తరఫున వినూత్న రీతిలో కార్యక్రమాలు నిర్వహిస్తోంది. నాటికలు, పాటలు, కథల రూపంలో అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కళాబృందాలు స్థానిక వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి చేరుకున్నాయి. వైద్యఆరోగ్యశాఖ ఆవరణలో ప్రదర్శించారు. డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్ జెండా ఊపి ప్రారంభించారు.

ఆంజనేయస్వామి కలశాల శోభయాత్ర



కలశమాల పూజలు నిర్వహిస్తున్న భక్తులు

నాయుడుపేట టౌన్, మే 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అగ్రహార పేటలో వెలసిన ఆంజనేయస్వామి దేవస్థానంలో హనుమాన్ జయంతి వేడుకలు ప్రారంభమయ్యాయి. బుధవారం ఆంజనేయ స్వామి కలశాల శోభయాత్ర వైభవంగా నిర్వహించారు. స్వర్ణముఖి నది వద్ద కలశాలకు పూజలు నిర్వహించారు. ఆ కలశాలలో స్వర్ణముఖినది జలాలను తీసుకొని మంగళ వాయిద్యాలు, శ్రీరామనామ సంకీర్తనలతో నడుమ పట్టణ పురవీధుల్లో ఊరేగింపుగా తీసుకొచ్చి ఆంజనేయస్వామి ఆలయంలో భద్రపరిచారు. గురువారం హనుమ జయంతిని పురస్కరించుకొని స్వామివారికి జలాభిషేకం చేస్తారు.

భూపరిహారం అందించకుంటే ఆందోళన



తహసీల్దారు రాజేంద్రకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

నాయుడుపేట టౌన్, మే 21 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - మల్లాం జంక్షన్ వద్ద సాగరమాల రోడ్డుకు ఇచ్చిన భూములకు పరిహారం అందించడంతో జాప్యం చేస్తే ఆందోళనలు చేస్తామని రైతులు అన్నారు. బుధవారం నాయుడుపేట తహసీల్దారు రాజేంద్రకు వినతిపత్రం అందజేశారు. మూడేళ్ల కిందట సాగరమాల రోడ్డు కోసం 35 మంది రైతులు 14.5 ఎకరాల భూమి ఇచ్చామని, ఇప్పటికీ పరిహారం అందజేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలోనే భూపరిహారం అందజేస్తామని తహసీల్దారు హామీ ఇచ్చారు.

వైభవంగా నరసింహస్వామి విగ్రహ ప్రతిష్ఠ



ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న పురోహితులు

పెళ్లకూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిల్లకూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన చెంచులక్ష్మి సమేత నరసింహ స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహాకుంభాభిషేక వేడుకలు మూడు రోజులు పాటు వైభవంగా నిర్వహించనున్నారు. బుధవారం ఉదయం గణపతి హోమం స్వస్తివాచకం, గోపూజ, కలిశస్థాపన, మంగళహారతి కార్యక్రమాలను పురోహితులు చేపట్టారు. మహిళలు కలశాలను నెత్తిమీద పెట్టుకుని మంగళవాయిద్యాలు, తప్పెట్ల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి స్వామి, అమ్మవార్లకు సమర్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఐటీఐలో క్యాంపస్ ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న కంపెనీ ప్రతినిధులు

గూడూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఐటీఐలో బుధవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. గూడూరు, వెంకటగిరి, చిట్టేడు, వాకాడు ప్రాంతాలకు చెందిన ఐటీఐ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. పలు కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి 180 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ నాగరాజు మాట్లాడుతూ ఐటీఐలో ఉపాధికల్పన, శిక్షణశాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పలు కంపెనీల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట నుంచి విజయవాడకు

ఆర్టీసీ సర్వీసు ప్రారంభం

సూళ్లూరుపేట, మే 21 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నుంచి విజయవాడకు నూతన ఆర్టీసీ సర్వీసును బుధవారం ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోకు కొత్తగా వచ్చి సూపర్ లగ్జరీ బస్సును విజయవాడకు నడపాలని నిర్ణయించామన్నారు. త్వరలో సూళ్లూరుపేట నుంచి బెంగళూరు, హైదరాబాదు నగరాలకు బస్సులు నడిపేలా చర్యలు తీసకుంటామన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ మల్లికార్జున, టీడీపీ నాయకులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా మండల సమావేశం



సమావేశంలో ఎంపీపీ అరుణమ్మ, ఎంపీడీవో విజయలక్ష్మి

ఓజిలి, మే 21 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా జరిగింది. మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ఎంపీపీ గడ్డం అరుణమ్మ అధ్యక్షతన ఎంపీడీవో విజయలక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం మండల సమావేశం నిర్వహించారు. వైస్ ఎంపీపీ ప్రసాద్ నాయుడు, ఆరిమేనిపాడు, చిల్లమానుచేను, అత్తివరం, ఓజిలి ఎంపీటీసీ సభ్యులు రఘురామరాజు, ప్రసాద్‌రాజు, శేఖర్, శ్రీనివాసులు పాల్గొన్నారు. విద్య, వైద్యం, ఆరోగ్యం, వ్యవసాయ శాఖల్లో పలు అంశాలపై సమీక్షించారు. సమావేశం మొత్తం గంటన్నరలోనే ముగించారు. తహసీల్దారు పద్మావతి, డీఎల్పీవో రవి, వైద్యాధికారి డానియేల్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వినియోగదారులకు మెరుగైన సేవలందించాలి



సమీక్షలో ఎస్ఈ సురేంద్ర నాయుడు

గూడూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలందించాలని ఎస్ఈ సురేంద్రనాయుడు అన్నారు. బుధవారం స్థానిక గోగినేనిపురంలోని విద్యుత్‌శాఖ కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరాయంగా 24 గంటలు విద్యుత్ సరఫరాను అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని అవసరమైన చోట్ల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అలాగే బకాయిల వసూలుపై దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఈఈ నరేంద్రరెడ్డి, ప్రసాద్, చిన్నయ్య, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

రైల్వేశాఖలో సిబ్బంది నియామకానికి కృషి



సమావేశంలో సంఘ్ నాయకులు

గూడూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): రైల్వేశాఖలో తగిన సంఖ్యలో సిబ్బందిని నియమించేలా కృషి చేస్తామని సౌత్‌సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ ఆల్ ఇండియా ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య అన్నారు. బుధవారం గూడూరులోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో సంఘ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేశాఖలో నూతనంగా రైల్వే లైన్లు, స్టేషన్లు ఏర్పాటు అయ్యాయని, వీటిలో తగినంత సిబ్బంది లేకపోవడంతో ఉన్న రైల్వే కార్మికులపై పనిభారం పెరుగుతోందన్నారు. వందేభారత్ రైళ్ల గూడూరులో నిలుపుదల చేసేలా అధికారులతో చర్చిస్తామన్నారు. సమావేశంలో నాగేంద్రబాబు, వెంకటేశ్వర్లు, నాగరాజు, వెంకటేశ్వరరావు, కోటి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్‌కు గాయాలు

తిరుపతి(నేరవిభాగం), మే 21(ఆంధ్రజ్యోతి): గరుడ వారిధిపై బైక్ డివైడర్‌ను ఢీకొట్టడంతో ఏపీఎస్పీ కానిస్టేబుల్‌కు గాయాలయ్యాయి. అలిపిరి ఎస్ఐ లోకేష్‌బాబు వివరాల మేరకు.. టీటీడీ పరిధిలోని ఆలయాల్లో సెక్యూరిటీగా పనిచేస్తున్న గణేష్ ద్విచక్ర వాహనంలో అలిపిరికి వెళుతున్నాడు. గరుడ వారధిపై మరమ్మతులు జరుగు తుండడం, ఇది గమనించకుండా వేగంగా వెళ్లడంతో బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో ఆయన తల, చేతులు, కాళ్లపై గాయాలయ్యాయి. స్థానికులు అలిపిరి పోలీసులకు సమా చారం అందించారు. ఎస్ఐ లోకేష్ ఘటనా స్థలానికి చేరుకుని గణేష్‌ను నారాయణాద్రి ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి కొంత మెరుగ్గా ఉన్నట్లు వైద్యులు చెప్పారు.

నీటి పథకాల పరిశీలన

సూళ్లూరుపేట, మే 21 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణానికి తాగునీరందించే పిండిపాలెం సమ్మర్ స్టోరేజ్, తల్లంపాడు, కసారెడ్డిపాలెం బోరు పాయింట్లను బుధవారం మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్ రెడ్డి, కమిషనర్ చిన్నయ్య అధికారులతో కలిసి పరిశీలించారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు నీటి పథకాల పనితీరు, పైపులైన్లను పరిశీలించి సంబంధిత అధికారులను వివరాలడిగి తెలుసుకున్నారు. కసారెడ్డిపాలెం, శ్రీనగర్ ప్రాంతాల్లో ఉన్న తాగునీరందుతోందా, నీటి సమస్య ఉందాని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శరత్ గౌడ్, అసిస్టెంట్ ఇంజినీరు మనోజ్ తదితరులు పాల్గొన్నారు.



కసారెడ్డిపాలెంలో నీటిబోర్లను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ శ్రీమంత్‌రెడ్డి, కమిషనర్ చిన్నయ్య